ఈనాడు

హైదరాబాద్ 28-1-2019 సోమవారం సిటీ సంపుటి 45. సంచిక 168

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఫిలిప్పీన్స్ చర్చిలో బాంబు పేలుళ్లు

20 మంది మృతి

- మృతుల్లో పలువురు పౌరులు, భద్రతా సిబ్బంది
- 111 మందికి గాయాలు

13లో



10% కోటా షురూ

- కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
- ఫిబ్రవరి 1 నుంచి అమలు

13లో

త్వరలో రైతులకు ప్యాకేజీ!

- ఆమోదముద్ర వేయనున్న కేంద్ర మంత్రివర్గం

13లో

కొత్త ఏడాదిలో తొలి విజయం

భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ కొత్త ఏడాదిలో తొలి విజయాన్ని అందుకుంది. ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో ఆమె ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారీన్ గాయం కారణంగా ఆట మధ్యలో నుంచి తప్పుకోవడంతో సైనా టైటిల్ సొంతం చేసుకుంది.

-వివరాలు ఛాంపియన్‌లో





నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మార్కెట్ యార్డులో తడిసిన కందుల బస్తాలు

మల్హర్ మండలం ఆరేవాగులో కొట్టుకుపోయిన మిర్చిపంట



అకాల నష్టం

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

- అత్యధికంగా నగునూరులో 10 సెంటీమీటర్లు నమోదు
- పలు జిల్లాల్లో దెబ్బతిన్న పంటలు
- పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు
- నేడూ వర్షాలు కురిసే అవకాశం

తెలంగాణ వ్యాప్తంగా రెండురోజులుగా కురుస్తున్న వానలు కొన్ని జిల్లాల్లో ఎండుముఖం పట్టిన పంటలకు మేలు చేయగా.. మరికొన్నిచోట్ల పంటలకు నష్టం చేకూర్చాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల పరిధిలోని వేలాది ఎకరాల్లో మొక్కజొన్న, మిరప, పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వానలకు కల్లాల్లోని కందులు, ధాన్యం, ఎండబెట్టిన మిరప తడవడంతో రైతులు నష్టపోయారు. మేడిగడ్డ పనులకు ఆటంకం ఏర్పడింది. 2లో

అనుభవజ్ఞులకే అమాత్యహారం

- ఎక్కువసార్లు గెలవడం, నడవడిక ప్రధానార్హతలు
- తొలిసారి విజయం సాధించిన వారిలో ఒకరిద్దరికే అవకాశం
- మంత్రివర్గ జాబితాపై రోజంతా సీఎం కేసీఆర్ కసరత్తు

ఈనాడు - హైదరాబాద్

మంత్రివర్గ విస్తరణలో అనుభవానికి పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలోగా జరిగే తొలివిడత విస్తరణలో ఎక్కువసార్లు గెలిచిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొదటిసారి విజయం సాధించిన వారిలో ఒకరిద్దరికి మాత్రమే అవకాశం దక్కనున్నట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా జాబితాను సిద్ధం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తన నివాసంలో ఆదివారం రోజంతా కసరత్తు చేసినట్లు తెలిసింది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జాబితాను తెప్పించుకొని. . దాని ఆధారంగా జిల్లాలవారీగా సామాజికవర్గాలు, ఇతర వివరాలను పరిశీలించినట్లు సమాచారం. 2014 ఎన్నికల్లో తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమ నేపథ్యం, సామాజిక సమీకరణాలు, రాజకీయ ఏకీకరణ ప్రాతిపదికన కేసీఆర్ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఈసారి అందుకు భిన్నంగా కూర్పు ఉండే అవకాశాలున్నాయి. ఈ మేరకు జాబితాను సిద్ధం చేస్తున్నారు. రెండు నుంచి ఆరుసార్లు (మిగతా 2లో)

ఫిబ్రవరి మూడోవారంలో బడ్జెట్ సమావేశాలు

రాష్ట్ర ప్రభుత్వం యోచన 2లో



మహా సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేద పండితులు. చిత్రంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

కన్యాకుమారి శ్రీవారి ఆలయంలో మహా సంప్రోక్షణ

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులోని కన్యాకుమారిలో తితిదే నిర్మించిన శ్రీవారి ఆలయం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన మహా సంప్రోక్షణ కనుల పండువగా జరిగింది. ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్యలో కుంభ లగ్నంలో మహా సంప్రోక్షణ నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించామని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు



విద్యుత్తు దీపాల వెలుగులో కన్యాకుమారిలోని శ్రీవారి ఆలయం

అకాల నష్టం

ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం

తెలంగాణ వ్యాప్తంగా గత రెండు రోజులుగా పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకూ అత్యధికంగా సిద్దిపేట జిల్లా నంగునూరులో 10, దుబ్బాక-9, భూపాల్‌పల్లి, మొగుళ్లపల్లి, నర్మెట్ట-8, హుజురాబాద్-7, మంథని-6, తిమ్మాపూర్, బెజ్జంకి, జనగామ, పరకాల, వెంకటాపూర్, గంగాధర, ముస్తాబాద్, హుస్నాబాద్‌లలో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. మొత్తంగా ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ రాష్ట్రంలోని 365 ప్రాంతాల్లో ఒక మాదిరి వర్షాలు కురిశాయి. పాత మెదక్ జిల్లా పరిధిలోని సిద్దిపేట జిల్లాలో గత పదేళ్ల జనవరి నెల అత్యధిక వర్షపాతం 5 సెంటీమీటర్లు కాగా.. ఇప్పుడు ఆ జిల్లాలోని పలుచోట్ల అంతకన్నా ఎక్కువ స్థాయిలో వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్‌లో 6.3, చార్మినార్ వద్ద 3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకు పడిపోయాయి. చలి వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. "తెలంగాణ మీదుగా ఉత్తర కర్ణాటక వరకూ రెండు రోజుల క్రితం ఏర్పడిన ఉపరితల ద్రోణి బలహీనపడిందని, సోమవారం కూడా అక్కడక్కడ ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని" హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. మరోవైపు అకాల వర్షాల కారణంగా ఉమ్మడి కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మిరప, మొక్కజొన్న, వరి పంటలు వేలాది ఎకరాల్లో దెబ్బతిన్నాయి.





జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో తడిసిన మిర్చిని చూపుతున్న రైతులు ★ నిలిచిపోయిన మేడిగడ్డ బ్యారేజీ కరకట్ట పనులు

వరి, పత్తి, మిరప రైతులకు నష్టం

ఆకాల వర్షానికి మంథని నియోజకవర్గంలో మహదేవపూర్, కాటారం, మల్హర్, పల్మెల మండలాల్లో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షం కారణంగా వందలాది ఎకరాల్లో పత్తి పొలాల్లోనే తడిసి ముద్దయింది. మల్హర్ మండలం తాడిచెర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల పరిసరాల్లోని ఆరేవాగు, తీగల వాగుల్లో ఆరబోసిన మిర్చి పంట కొట్టుకుపోయింది.

- జోగులాంబ గద్వాల జిల్లాలోని ఇటిక్యాల, రాజోలి, అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాల్లో ఆరబెట్టిన మిర్చి వర్షాలకు తడిసింది. జోగులాంబ గద్వాల జిల్లాతో పాటు వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూరు, వీనపనగండ్ల, పాన్‌గల్, చిన్నంబావి మండలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవడంతో అన్నదాతలు నష్టపోయారు. నాగర్‌కర్నూలు జిల్లాలో కోత దశలో ఉన్న వరి పంటకు అకాల వర్షాలు నష్టాన్ని కలిగించాయి. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పలు చోట్ల వేరుసెనగ పంటలు దెబ్బతిన్నాయి.

ఆగిన మేడిగడ్డ బ్యారేజీ కరకట్ట పనులు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో కాళేశ్వరం ప్రాజెక్టు పనులు నెమ్మదించాయి. శని, ఆదివారం కురిసిన వర్షంతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. ఇరువైపులా చేపడుతున్న కరకట్టల పనులు నిలిచిపోయాయి.

చలితో తగ్గిన కరెంటు వినియోగం

వర్షాలు, చలి వాతావరణంతో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం భారీగా పడిపోయింది. ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో రాష్ట్ర విద్యుత్తు డిమాండు 6,008 మెగావాట్లుగా ఉంది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇది 7,958 మెగావాట్లుగా ఉంది.

రైతులను ఆదుకోవాలి: చాడ వెంకట్‌రెడ్డి

అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి కోరారు. దెబ్బతిన్న వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారుఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. .

పొలాల్లో నిలిచిన నీటిని బయటికి పంపాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల కొన్ని చోట్ల పంటలకు నష్టం వాటిల్లినా, రెండు నెలలుగా వర్షాలు కురవక వాడిన పైర్లకు ఈ వానలు మేలు చేశాయి. సెనగ, పెసర, మొక్కజొన్న వంటి పైర్లలో నిలిచిన నీటిని రైతులు వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేసుకుంటే నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

– విజయకుమార్,
వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు

ఫిబ్రవరి మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు

- రాష్ట్ర ప్రభుత్వం యోచన

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి మూడో వారంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో దీనిపై నిర్ణయం తీసుకోనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం రాష్ట్ర గవర్నర్ నరసింహన్‌తో చర్చల సందర్భంగా బడ్జెట్ సమావేశాల గురించి ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. ఇది రాష్ట్రాల కేటాయింపులపై ప్రభావం చూపనుంది. దీనిని పరిగణనలోకి తీసుకున్నాక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ఇప్పటికే నిర్ణయించింది. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెడుతోంది. ఇందులో రాష్ట్రానికి గల కేటాయింపులు తెలుస్తాయి. వచ్చే నెల 14, 15, 16 తేదీల్లో కేంద్ర ఆర్థిక సంఘం రాష్ట్రంలో పర్యటించనుంది. కమిషన్ ద్వారా సాయం ఎంత వస్తుందనే దానిపైనా స్పష్టత వస్తుంది. వీటి ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించి మూడో వారంలో సమావేశాలను నిర్వహించే వీలుంది. ఇప్పటికే శాఖల వారీగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆయా శాఖల కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

తాజ్‌మహల్ ఓ శివాలయం

- కేంద్ర మంత్రి అనంత్ కుమార్ వ్యాఖ్యలు

దిల్లీ: ప్రఖ్యాత తాజ్‌మహల్‌ను ముస్లింలు నిర్మించలేదని కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే వ్యాఖ్యానించారు. అది ఒక శివాలయం అని చెప్పారు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే ఆయన కర్ణాటకలోని కొడగు జిల్లాలో ఆదివారం ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "తాజ్ అసలు పేరు తేజో మహాలయా. దాన్ని రాజు పరమతీర్థ కట్టించారు. ఆ ప్రాంతాన్ని మరో రాజు జయసింహ నుంచి కొనుగోలు చేసినట్లు షాజహాన్ తన జీవిత చరిత్రలో పేర్కొన్నారు. ఇప్పుడిది తాజ్‌మహల్‌గా మారిపోయింది. ఇలాగే నిద్రపోతూ ఉంటే.. మన ఇళ్లనూ మసీదులుగా మార్చేస్తారు. రాముణ్ని జహాపనా అని, సీతను బీబీ అని పిలుస్తారు"అని ఆయన వ్యాఖ్యానించారు. హిందూ మహిళను తాకేవాడికి చేతులే లేకుండా చేయాలనీ అన్నారు. దీంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి.

హామీలు నెరవేర్చనివారికి ప్రజలు బుద్ధి చెబుతారు: గడ్కరీ

ముంబయి: కలల్లో విహరింపజేసి, వాటిని సాకారం చేయడంలో విఫలమైన వారిని ప్రజలు చితగ్గొడతారని కేంద్ర మంత్రి గడ్కరీ పేర్కొన్నారు. అలాంటి వారికి రాజకీయంగా వారు బుద్ధి చెబుతారని ఆదివారం ముంబయిలో ఆయనొక కార్యక్రమంలో చెప్పారు. 'నేను కేవలం మాటలు చెప్పేవాడిని కాను. ఏం చెప్పానో అది 100% నెరవేరుస్తా. అని అన్నారు. ఓటమితో పాటు వైఫల్యాలనూ అంగీకరించే ధోరణి పార్టీ నాయకత్వానికి ఉండాలని గడ్కరీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

నిరాశ లేదు!


ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

నా మీద నాకే కాదు, ఆ దైవం మీద, మొత్తం మానవాళి మీద విరక్తి కలిగినప్పుడే నేను నిరాశకు లోనైనట్లు. అందుకే నా జీవితంలో నిరాశకు తావులేదు, నా జీవిత నిఘంటువులో 'నిరాశ' 'నిస్పృహ' అన్న పదాలకు చోటూ ఉండదు!

– మహాత్మా గాంధీ

ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం

- కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు
- ఎన్టీఆర్ ఏ బయోగ్రఫీ ఆంగ్ల పుస్తకావిష్కరణ



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 'ఎన్టీఆర్ ఏ బయోగ్రఫీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ. పక్కన పుస్తక రచయితలు చంద్రహాస్, లక్ష్మీనారాయణ

మాదాపూర్, న్యూస్‌టుడే: భాజపా, వామపక్ష పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీరామారావుకే దక్కుతుందని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ అశోక్ గజపతిరాజు అన్నారు. ఎన్టీఆర్ రాజకీయ జీవితం తనలాంటి వారు అనేక మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ ఉన్నత స్థానాలకు వెళ్లిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కె.చంద్రహాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. కె.లక్ష్మీనారాయణలు ఆంగ్లంలో రచించిన 'ఎన్టీఆర్ ఏ బయోగ్రఫీ' పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని సైబర్ సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పుస్తకాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణకు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి ఈ భూమ్మీద ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందని అన్నారు. కేంద్రంలో ఫెడరల్ వ్యవస్థను తీసుకువచ్చేందుకు ఆయన చేసినంత కృషి దేశంలో మరే ముఖ్యమంత్రీ చేయలేదన్నారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా తాను పనిచేసిన కాలంలో ఎన్నో విషయాలు ఆయన నుంచి నేర్చుకున్నట్లు అశోక్ గజపతిరాజు చెప్పారు. నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవిత చరిత్రకు సంబంధించి ఆంగ్లంలో తొలిసారి పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆయన జీవిత చరిత్ర ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. పుస్తక రచయితలు చంద్రహాస్, కె.లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఏ బయోగ్రఫీ పుస్తకాన్ని తీసుకువచ్చేందుకు రెండేళ్ల మూడు నెలలపాటు పనిచేశామన్నారు. రోజుకు 12 నుంచి 14 గంటల పాటు పుస్తక రచనలోనే గడిపినట్లు తెలిపారు. భారత్‌లో నాయకత్వానికి సంబంధించిన పుస్తకాలు అరుదుగా వస్తాయన్నారు. ఇంగ్లాండ్ వంటి దేశాల్లో ఎన్టీఆర్ జన్మించి ఉంటే ఆయనపై ఇప్పటికే కొన్ని వందల పుస్తకాలు వచ్చి ఉండేవన్నారు. నిమ్మకూరు యువకుడు ఎన్టీఆర్‌గా ఎలా ఎదిగాడనేదే ఈ పుస్తకం సారాంశమని చెప్పారు. అంతకుముందు ఈ పుస్తకాన్ని రచించేందుకు తమకు సహకారం అందించిన పలువురిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పుస్తకావిష్కరణ సందర్భంగా ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటకాలను నిర్వాహకులు అందరికీ రుచి చూపించారు. సీపీఐ సీనియర్ నేత నారాయణ, ఏపీ మాజీ మంత్రి కామినేని, మాజీ డీజీపీలు హెచ్.జె.దొర, రామ్మోహన్‌రావు తదితరులు హాజరయ్యారు.

అనుభవజ్ఞులకే అమాత్యహారం!

(మొదటి పేజీ తరువాయి)

గెలిచిన ఎమ్మెల్యేలు, అందులో విధేయులైన వారి పేర్లు మొదటి వరుసలో ఉన్నట్లు తెలిసింది. విధేయత, నడవడిక, పార్టీ, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా పనిచేయడం వంటివి ప్రధానార్హతలు కానున్నాయి.

- పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు మళ్లీ మంత్రి పదవులు ఖాయంగా చెబుతున్నారు.
- నిజామాబాద్ నుంచి ప్రశాంత్‌రెడ్డి లేదా బాజిరెడ్డి గోవర్ధన్‌కు చోటుదక్కే అవకాశాలున్నాయి.
- ఆదిలాబాద్ నుంచి రేఖానాయక్ పేరు ముందువరుసలో ఉంది. ఎస్టీ, మహిళా కోటా రెండూ ఆమెకు కలిసిరానున్నాయి. అయితే, మెదక్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డికి అవకాశం వస్తే.. రేఖానాయక్‌కు జాబితాలో చోటుండకపోవచ్చు. అలాంటి సందర్భంలో ఆదిలాబాద్ నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్నలలో ఒకరికి అవకాశం దక్కొచ్చు.
- మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి/నిరంజన్‌రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి.
- నల్గొండ నుంచి జగదీశ్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, నోముల నర్సింహయ్యలలో ఇద్దరికి పదవులు దక్కే అవకాశాలున్నాయి.
- కరీంనగర్ నుంచి ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి.
- ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్ లేదా ఇతర పార్టీ నుంచి వచ్చే ఎమ్మెల్యే పేరు వినిపిస్తోంది.
- రంగారెడ్డి జిల్లా నుంచి నరేందర్‌రెడ్డి లేదా మరో పార్టీ నుంచి వచ్చే ఎమ్మెల్యేకు అవకాశం లభించేలా ఉంది.
- హైదరాబాద్ నగరం నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేరు అంచనా జాబితాలో ఉన్నట్లు తెలిసింది.
- వరంగల్ జిల్లా నుంచి మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రెడ్యానాయక్‌లలో ఇద్దరికి పదవి వచ్చే అవకాశాలున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో రేఖానాయక్‌కు పదవి వస్తే వరంగల్‌లో రెడ్యానాయక్ మంత్రి కావడం కష్టమే.
- శాసనమండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు కూడా మంత్రివర్గ అంచనా జాబితాలో ఉన్నట్లు తెలిసింది.
- మంత్రివర్గ విస్తరణలో భాగంగా మొదటి విడత ఎనిమిది మందికి అవకాశం కల్పించాలని సీఎం భావిస్తున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ నుంచి ఒక్కొక్కరికి, కరీంనగర్ నుంచి ఇద్దరికి తొలి విడతలో మంత్రి పదవులు దక్కే వీలుంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత మిగతా మంత్రి పదవులు భర్తీ కానుండగా.. అందులో అన్ని ఉమ్మడి జిల్లాలు సర్దుబాటు అయ్యేలా చూస్తారు.

ప్రత్యామ్నాయ పదవులు

మంత్రి పదవులు దక్కని వారికి ప్రత్యామ్నాయ పదవులు ఇవ్వాలని సీఎం ప్రణాళిక సిద్ధంచేస్తున్నారు.

ఉపసభాపతి పదవి ఇందులో కీలకమైంది. రెడ్యానాయక్/రేఖానాయక్, వినయ్‌భాస్కర్/గంప గోవర్ధన్/జోగురామన్న తదితరుల పేర్లు ఇందుకు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు 18 మంది పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శులను నియమించాలనీ కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో నలుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి నిర్వహించే శాఖలకు కార్యదర్శులు కానున్నారు. సీఎం.. నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార పౌరసంబంధాల శాఖలను చేపట్టనున్నట్లు తెలిసింది. మంత్రి, ఇతర పదవులు రాకుంటే ప్రశాంత్‌రెడ్డి లేదా జీవన్‌రెడ్డి, బాల్కసుమన్, పద్మాదేవేందర్‌రెడ్డి/గొంగిడి సునీత, వినయ్‌భాస్కర్/నన్నపునేని నరేందర్‌లు సీఎం శాఖలకు పార్లమెంటరీ కార్యదర్శులు అవుతారని తెలుస్తోంది. కార్యదర్శి పదవులు రానివారికి శాసనసభ చీఫ్ విప్, మూడు విప్‌ల పదవులు దక్కుతాయి. మరికొందరికి ఆర్టీసీ, తదితర కీలక కార్పొరేషన్ల ఛైర్మన్ల పదవులు ఇవ్వనున్నారు.

గ్రహం అనుగ్రహం

28–1–2019 సోమవారం

శ్రీ విళంబి నామ సంII రంII ఉత్తరాయణం
హేమంత ఋతువు; పుష్య మాసం; బహుళ పక్షం
అష్టమి: రా. 8.04 తదుపరి నవమి
స్వాతి నక్షత్రం: రా. 7.56 తదుపరి విశాఖ
అమృతఘడియలు: ఉ. 11.18 నుంచి 12.52 వరకు
వర్జ్యం: రా. 1.31 నుంచి 3.06 వరకు
దుర్ముహూర్తం: మ. 12.36 నుంచి 1.21 వరకు తిరిగి మ. 2.50 నుంచి 3.35 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-49

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	16.1	21.3
సూర్యాపేట	17.0	20.0
మెదక్	17.2	24.4
రామగుండం	17.6	23.0
నిజామాబాద్	18.1	24.4
హైదరాబాద్	18.4	21.2
మహబూబ్‌నగర్	20.1	24.0
ఖమ్మం	22.0	32.0

హిందు మహాసముద్రంలో చైనాకు చెక్

దిల్లీ: వ్యూహాత్మకంగా కీలకమైన అండమాన్ నికోబార్ దీవుల్లో రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు భారత్ రూ.5650 కోట్లతో ఒక ప్రణాళికను ఖరారు చేసింది. పదేళ్లలో దీన్ని అమలు చేస్తారు. దీనికింద అదనంగా యుద్ధ నౌకలు, విమానాలు, డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలు, పదాతి దళ సైనికులను మోహరించేందుకు మౌలిక వసతులను కల్పిస్తారు. హిందు మహాసముద్ర ప్రాంతంలో చైనా జోరు పెరిగిన నేపథ్యంలో భారత్ ఈ చర్యలు చేపడుతోంది.

పరిహారం కుదిరింది

- వేములఘాట్‌లో దీక్షా శిబిరం ఎత్తివేత
- 963 రోజుల పాటు కొనసాగిన దీక్ష
- ఎకరానికి రూ. 11లక్షల చొప్పున చెల్లింపు
- నెల రోజుల్లో వెయ్యి ఎకరాల రిజిస్ట్రేషన్


తొగుట, న్యూస్‌టుడే: మల్లన్నసాగర్ భూసేకరణకు వ్యతిరేకంగా సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌లో చేపట్టిన దీక్షాశిబిరాన్ని ఆదివారం ఎత్తివేశారు. మల్లన్నసాగర్ నిర్మాణానికి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని చేపట్టిన దీక్ష 963 రోజుల పాటు కొనసాగడం గమనార్హం. మండలంలో పూర్తిస్థాయిలో ముంపునకు గురికానున్న ఏటిగడ్డకిష్టాపూర్, పల్లెపహాడ్, రాంపూర్, లక్ష్మాపూర్, బ్రాహ్మణబంజేరుపల్లి గ్రామాలతోపాటు పాక్షికంగా ముంపునకు గురికానున్న తొగుట, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వం జీవోనెం.123తో భూసేకరణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వేములఘాట్ రైతులు ఈ జీవో రద్దుపై హైకోర్టును ఆశ్రయించి విజయం సాధించారు. దీంతో జీవో సైతం రద్దయింది. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి కాంగ్రెసును వీడి తెరాసలో చేరగా ఆయన నేరుగా సీఎం కేసీఆర్‌తో చర్చించి వేములఘాట్‌లో మల్లన్నసాగర్‌కు భూమి ఇవ్వని రైతులకు ఎకరానికి రూ.11 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు ఒప్పించారు. దీంతో నెల రోజుల్లో సుమారు వెయ్యి ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ పూర్తిచేశారు. అంతకంటే ముందు సుమారు 3 వేలకు పైగా ఎకరాలు జీవో నెం.123తో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయి. పునరావాసం, ఉపాధి (ఆర్ అండ్‌ఆర్) ప్యాకేజీ అమలయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెల్చిచెప్పిన రైతులు ఎట్టకేలకు ఆదివారం దీక్ష నుంచి విరమించుకోవడం గమనార్హం. గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్వహించారు. రెండు రోజుల్లో కమిటీని సైతం వేస్తామని, అర్హులందరికీ ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ అమలయ్యే వరకు పోరాటం చేయాలని నిర్ణయించారు. కమిటీ ఏర్పాటయ్యే వరకు వేములఘాట్‌లో నిర్మాణాల సర్వే చేపట్టొద్దని గ్రామానికి వచ్చిన అధికారులను వెనక్కి పంపించారు. మరోవైపు వేములఘాట్ శివారులో ఎల్లమ్మ ఆలయం వద్ద కట్ట నిర్మాణానికి ముళ్లపొదలను తొలగించేందుకు యంత్రాలతో పనులు ప్రారంభించారు. ప్రభుత్వం అర్హులందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చట్టప్రకారం అమలు చేస్తే ఎలాంటి అభ్యంతరాల్లేకుండా మల్లన్నసాగర్ నిర్మాణం పనులకు ఆటంకం తొలిగే అవకాశముంది.

'పరీక్షాపే చర్చ 2.0'కు తెలుగు విద్యార్థులు

- రేపు ప్రధాని మోదీతో ముఖాముఖి

ఈనాడు, దిల్లీ: పరీక్షల సమయంలో కలిగే ఒత్తిడి, భయం, ఆందోళనలను జయించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కోసం కేంద్రం చేపట్టిన ప్రధాని నరేంద్ర మోదీతో ముఖాముఖి('పరీక్ష పే చర్చ 2.0')కి మొత్తం 34 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 9, 10, 11, 12 తరగతులకు చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ నుంచి 19 మంది, తెలంగాణ నుంచి 15 మంది ఉన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల విభాగాల్లో రెండు రాష్ట్రాల నుంచి ఇద్దరిని చొప్పున ఎంపిక చేశారు. ప్రధాని మోదీ రచించిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఇటీవల ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి అన్నిరాష్ట్రాల నుంచి ప్రతిభావంతుల్ని ఎంపిక చేశారు. వీరందరితో దిల్లీలోని టాల్కతోరా స్టేడియంలో ఈ నెల 29వ తేదీన ప్రధాని మోదీ ముఖాముఖి మాట్లాడనున్నారు.

ఇదీ సంగతి!



మీరడిగిన డబ్బు బిచ్చమెత్తి తెచ్చాం సార్, నాలుగైదు రూపాయలు తక్కువున్నాయి. వాటికి బదులుగా చద్దన్నం చింతకాయ పచ్చడీ పచ్చిపులుసూ వేశారు తీసుకోండి!

పౌల్ట్రీపై విదేశీ కుట్ర

- కేజ్‌ల నిషేధ ప్రతిపాదన అందులో భాగమే
- విదేశీ కోళ్ల పరిశ్రమ సంస్థలతో దేశీయ రంగానికి ముప్పు
- ఎ.పి.పి.ఎఫ్. అధ్యక్షుడు డాక్టర్ వి.సుందరనాయుడు



ఈనాడు, విశాఖపట్నం


కోళ్లను కేజ్‌ల్లో పెంచే విధానాన్ని నిషేధించి(కేజ్ బ్యాన్) బహిరంగ ప్రదేశాల్లో పెంచాలని కొన్ని సంస్థలు చేస్తున్న ప్రతిపాదనల వెనుక విదేశీ కుట్రలున్నాయని ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్(ఎ.పి.పి.ఎఫ్.) అధ్యక్షుడు డాక్టర్ వి.సుందరనాయుడు పేర్కొన్నారు. శనివారం విశాఖ వచ్చిన ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ముఖ్యాంశాలు...

- ❑ అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే దేశీయ కోళ్ల పరిశ్రమ(పౌల్ట్రీ)రంగం చాలా వెనుకబడే ఉంది. పోషకాహార జాతీయ మండలి(నేషనల్ న్యూట్రిషన్ కౌన్సిల్) ప్రతి వ్యక్తి సగటున సంవత్సరానికి 180 గుడ్లను తినాలని సూచిస్తుంటే దేశంలో గుడ్ల సగటు వినియోగం 70 మాత్రమే ఉంది. కోడి మాంసం సంవత్సరానికి కనీసం 11 కిలోలు తినాల్సి ఉండగా ప్రస్తుతం సగటున ఐదు కిలోలు కూడా భుజించని పరిస్థితి ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పలు విదేశీ పౌల్ట్రీ సంస్థలు భారత మార్కెట్‌పై కన్నేశాయి. కోళ్లను కేజ్(ఇనుప జాలీలు, చట్రాలతో కూడిన ఏర్పాటు)ల్లో పెంచకూడదంటూ కొత్త వాదనను ప్రచారం చేస్తున్నాయి. అదే జరిగితే వేలాది మంది పౌల్ట్రీ రైతులు రోడ్డున పడటమే కాకుండా, లక్షలాది మంది ఉపాధి దెబ్బతిని ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ముప్పు ఉంది. గుడ్ల ధరలు రెట్టింపై సామాన్యుడు తినలేని పరిస్థితి దాపురిస్తుంది.
- ❑ మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల ధరలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్ల కిందట నిర్ణయించింది. గత రెండేళ్లలో మేత ధరలు, ఇతర వ్యయాలు అన్నీ కలిపి 35 శాతం పెరిగాయి. ఈ నేపథ్యంలో గుడ్లను సరఫరా చేస్తున్నవారు నష్టపోతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. ధరను పెంచాలని పౌల్ట్రీ రైతులు చేసిన విజ్ఞప్తిని ఏపీ ప్రభుత్వం అంగీకరించినప్పటికీ క్షేత్రస్థాయిలో ధరలను పెంచకపోవడంతో కోళ్ల రైతులు నష్టపోతున్నారు.
- ❑ అంగన్‌వాడీ కేంద్రాలకు ఎన్నో ఉత్పత్తులు సరఫరా చేస్తున్నా కేవలం గుడ్ల సరఫరాదారులకు మాత్రమే బయోమెట్రిక్ విధానమంటూ ఇబ్బందులు పెడుతున్నారు. పౌల్ట్రీ రైతులు నేరుగా గుడ్లు సరఫరా చేసే పరిస్థితి లేకుండా పలు టెండరు నిబంధనలున్నాయి. ఈ ఇబ్బందులన్నింటినీ తొలగిస్తే రైతులే గుడ్లు సరఫరా చేసి ఎక్కువ లాభాన్ని ఆర్జిస్తారు.
- ❑ పౌల్ట్రీరంగాన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎం.ఎస్.ఎం.ఇ.) రంగం కింద గుర్తించి వ్యవసాయానికి ఉపయోగపడని నిరుపయోగ భూముల్ని ఔత్సాహిక పౌల్ట్రీ రైతులకు కేటాయిస్తే లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుంది.

పట్టుచీర చిరిగినందుకు పరిహారం

- ఆర్టీసీపై వినియోగదారుని విజయం

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఓ మహిళ కట్టుకున్న పట్టుచీర ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంతో చిరగటంతో వినియోగదారుల ఫోరం రవాణా సంస్థకు రూ.3వేల జరిమానా విధించింది. నల్గొండ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నల్గొండకు చెందిన కట్టెకోల నరసింహారావు, వాణిశ్రీ దంపతులు హైదరాబాద్‌లో వివాహానికి హాజరయ్యేందుకు 2018 ఆగస్టు 26న ఇక్కడి బస్టాండ్‌లో సూపర్‌లగ్జరీ బస్సు (టీఎస్05జెడ్ 0188) ఎక్కారు. బస్సు ప్రవేశద్వారం వద్ద బయటకు తేలిన రేకు తగిలి వాణిశ్రీ పట్టుచీర కొంచెం చిరిగింది. తర్వాత బస్సు ఎక్కిన మరో మహిళ చీరా అలాగే చిరిగిపోయింది. ఆ రేకును సరిచేయాలని డ్రైవర్‌కు నరసింహారావు దంపతులు చెప్పగా అది డిపో సిబ్బంది పని అని బదులిచ్చారు. డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో నరసింహారావు నల్గొండలోని వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. టికెట్, బస్సు, బయటకు తేలిన రేకు, చిరిగిన చీర ఫొటోలను సాక్ష్యంగా సమర్పించారు. విచారణ చేపట్టిన ఫోరం.. ఆర్టీసీ లోపాలను ధ్రువీకరించింది. పట్టుచీరకు రూ.2 వేలు, ఇతర ఖర్చులకు మరో రూ.1,000 జరిమానాను ఈ నెల 18న విధించింది.



చిరిగిన పట్టుచీర.. బస్సు ప్రవేశ ద్వారం వద్ద పైకి లేచిన రేకు



ప్రసంగిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తిరుపతిరావు

చరిత్రపై శాస్త్రీయ అవగాహన అవసరం

ఓయూ మాజీ ఉపకులపతి ఆచార్య తిరుపతిరావు

కేయూలో రాష్ట్ర స్థాయి హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: చరిత్రపై శాస్త్రీయ అవగాహన అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి టి.తిరుపతిరావు అన్నారు. ఆదివారం హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా తిరుపతిరావు హాజరై ప్రసంగించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతులపై పరిశోధకులు, అధ్యాపకులు నిరంతరం పరిశోధనలు చేయాలని చెప్పారు. మరుగునపడిన చరిత్రను భావితరాలకు అందించినప్పుడే వర్తమానంలో ముందుకెళ్లడం సులభమవుతుందన్నారు. ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతులు ఎలా ఉంటాయో వివరించడానికి హిస్టరీ కాంగ్రెస్ వేదికగా ఉపయోగపడాలన్నారు. రెండు రోజులపాటు చరిత్రపై పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచార్య జి.వెంకట్రాజం, డాక్టర్ ఎం.వీరేందర్ చెప్పారు. కార్యక్రమంలో కాకతీయ వీసీ ఆచార్య సాయన్న, ఓయూ మాజీ రిజిస్ట్రార్ కిషన్‌రావు, ఐసీహెచ్‌ఆర్ మాజీ ఛైర్మన్ వై.సుదర్శన్‌రావు, పలు విశ్వవిద్యాలయాల చరిత్ర అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఈనాడు

ఉపేక్షిస్తే ఉపద్రవమే!

'చెరపకురా చెడేవు' అన్నది శతాబ్దాలుగా మానవాళికి పుడమి తల్లి చేస్తున్న మౌన ప్రబోధం. పారిశ్రామిక విప్లవ ఖడ్గ ప్రహారాలతో పర్యావరణానికి నిలువునా తూట్లు పొడిచిన సంపన్న దేశాల స్వార్థపరత్వం- వాతావరణ మార్పులకు కారణభూతమై మనిషి అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తోందన్నది నిష్ఠుర సత్యం. నాలుగో పారిశ్రామిక విప్లవానికి అనుగుణంగా ప్రపంచ గతిరీతుల నిర్మాణం ఎలా సాగాలన్నదే ముఖ్యాంశంగా దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు- ఆర్థిక మందగమనం, అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచీకరణ తగ్గుముఖం పట్టి జనాకర్షక ధోరణులు పెరగడం, 'బ్రెగ్జిట్' వంటి కీలకాంశాలతోపాటు వాతావరణ మార్పుల ఉత్పాతంపై గట్టిగా గొంతెత్తింది. మానవాళి నేడు ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన అస్తిత్వ సవాలు- వాతావరణ మార్పుల తాలూకు దుష్ప్రభావాల ఉరవడేనని దావోస్ సదస్సు ఎలుగెత్తి చాటింది. గత 22 ఏళ్లలో రెండు దశాబ్దాల పాటు భూతాపం రికార్డులు బద్దలుకావడం సమస్త దేశాలకూ జాతిభద్రతా ముప్పేనని ఐక్యరాజ్య సమితి ప్రధాన శాస్త్రవేత్త తీర్మానించడాన్ని ఆషామాషీగా తోసిపుచ్చే వీల్లేదు. మునుముందు ప్రకృతి ఉత్పాతాలు అంతర్జాతీయ శాంతిభద్రతలపైనా దుష్ప్రభావం ప్రసరిస్తాయంటూ, తన దేశం మాల్దీవులే మటుమాయమయ్యే ప్రమాదాన్ని ఆ దేశ విదేశాంగ మంత్రి ప్రస్తావించారు. ఆ మహోపద్రవం సంభవించకుండా కాచుకోవాలంటే, సమష్టి కార్యాచరణకు మనకు మిగిలిఉన్న కాలావధి మరో పదేళ్లేనని సమితి నివేదికే చాటుతోంది. సముద్ర మట్టాలు పెరిగి భయానక తుపాన్లు వరదలు కరవులు దాపురించేలా భూఉపరితలం ఇప్పటికే ఒక డిగ్రీ సెల్సియస్ వేడెక్కిందని, మనిషి మనుగడే దుర్భరమయ్యేలా మూడు నాలుగు డిగ్రీల సెల్సియస్ పెరుగుదల దిశగా వాతావరణం సాగుతోందన్న హెచ్చరికలు మిన్నంటుతున్నాయి. ఉపేక్షిస్తే ఉపద్రవమే అన్నది సాధారణ హెచ్చరిక కాదు, నడినెత్తిన మోగుతున్న ప్రమాదఘంటిక!

ప్రకృతి ఒడిలో శిశువుగా ఎదిగిన బుద్ధిజీవి- తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న దుస్సాహసానికి చెల్లించాల్సిన మూల్యం, వినాశకర వాతావరణంలో ప్రస్ఫుటమవుతోంది. పర్యావరణాన్ని పరిరక్షించుకొనే ఘనతర సంకల్పం ప్యారిస్ ఒప్పందంలో పొడగట్టినా, దాన్ని అడ్డగోలుగా కాలదన్నిన ట్రంపరితనం, అదే పంథాలో సాగుతామంటున్న బ్రెజిల్ దుందుడుకుతనం- భవిష్యత్తును అగమ్యగోచరం చేస్తున్నాయి. వాతావ'రణ ఘోష'ను నిలువరించడానికి ప్యారిస్ ప్రతిపాదనలే సరిపోవని భావిస్తుంటే, వాటికీ తూట్లు పొడుస్తున్న తీరు కారణంగా- పరుగు పందెంలో ప్రపంచం ఓడిపోతోందని సమితి ప్రధాన కార్యదర్శి వాపోతున్నారు. వాతావరణ మార్పుల వల్ల ముప్పు నిజమేనా అనే సందేహాలకు జతపడి సుస్థిర రాజకీయ సంకల్పమూ కొరవడటం కొంపముంచుతోందన్నదాంట్లో మరో మాట లేదు. 1978-1997 నడుమ ఇరవయ్యేళ్ల కాలంతో పోలిస్తే దరిమిలా రెండు దశాబ్దాల్లో ఇండియాలో ప్రకృతి ఉత్పాతాల ఉరవడి దారుణంగా పెరిగింది. 1998-2007 మధ్య ప్రకృతి వైపరీత్యాలు 200 కోట్ల డాలర్ల నష్టాల్ని కలగజేస్తే, 2008-2017 నడుమ ఇండియాకు వాటిల్లిన నష్టాలు 4,500 కోట్ల డాలర్ల (దాదాపు మూడు లక్షల 15 వేలకోట్ల రూపాయల)కు పెరిగిపోయాయి. 1998-2017 మధ్యకాలంలో 328 ప్రకృతి వైపరీత్యాలు ఇండియాలో చోటుచేసుకోగా అందులో దాదాపు సగం వరదలే. ఈ వాతావరణ మార్పుల తాలూకు ఉత్పాతాలకు నిస్సహాయంగా బలైపోతున్నది రైతాంగమే. ప్రకృతి ప్రకోపాన్ని ఉపశమింపజేసేలా పటిష్ఠ కార్యాచరణ వ్యూహాన్ని పట్టాలకెక్కించి, పౌరభాగస్వామ్యాన్ని కూడగట్టి ప్రభుత్వాలు నియమబద్ధంగా ముందడుగేయడం తక్షణావసరం!

ప్రకృతి తిరగబడే స్థాయిలో మనిషి తాను చేసిన తప్పుల్ని సరిదిద్దుకొనేందుకు ఇంకా పట్టుమని పుష్కరకాలం కూడా సమయం లేదు. ఆలోగా కర్బన ఉద్గారాల్ని కనీసం 50 శాతం తగ్గించలేకపోతే, మానవాళికి మనుగడ దుర్లభమనడంలో సందేహంలేదు. కాబట్టే, గ్రెటా థన్‌బర్గ్ అనే పదహారేళ్ల పాప దావోస్ వేదికపై 'మన ఇంటికి నిప్పంటుకొంది' అంటూ భయవిహ్వల భవిష్యత్తును తన గళంలో పలికించింది. తరుముతున్న సంక్షోభానికి దీటుగా స్పందించాలనీ దేశాధినేతలను కోరింది. 2030 నాటికి సాధించాలని ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలన్నింటినీ ఒక్కపెట్టున తుడిచి పెట్టేసేటంత వినాశనాన్ని నేటి వాతావరణం నిశ్వసిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా రెండొందల కోట్ల మంది జీవనానికి భూగర్భ జలాలే దిక్కు. వాతావరణ మార్పుల పర్యవసానంగా వానలు సరిగ్గా పడక సగం దాకా భూగర్భ జలాలు కనుమరుగై పోతాయంటున్న అధ్యయనాలు- ఇంకా నిద్ర నటిస్తున్న నేతాగణాల వీపున ఛర్నాకోలా చరుపు కావాలి! పేదలకు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల ఆసరాను ప్రకృతి వైపరీత్యాల పీడ దూరం చేస్తుందన్న వాస్తవాన్ని కేంద్ర రాష్ట్ర సర్కార్లు గుర్తించాలి. తెలంగాణలో అటవీ భూమి 24 శాతం అని గణాంకాలు చెబుతున్నా పచ్చదనం అందులో సగం కూడా లేదన్న కేసీఆర్ ప్రభుత్వం- 'జంగిల్ బచావో, జంగిల్ బడావో' అంటూ అడవుల రక్షణకు కొత్త చట్టాల్ని ప్రతిపాదిస్తోంది. పట్టుమని 22 శాతం కూడా అటవీ ఆచ్ఛాదన లేని ఏపీ- పచ్చదనం పెంపులో మరెంతో పరిశ్రమించాలి. పెనం మీద నుంచి పొయ్యిలోపడ్డ చందంగా జనం భవిష్యత్తు బలైపోరాదంటే, ప్రజలూ ప్రభుత్వాలూ పర్యావరణహిత పంథాలో త్రికరణశుద్ధిగా ముందడుగేయాలి!

అనుభవాన్ని ఖాతరు చేయకపోవడానికి బలమైన కారణం ఉండాలని 1993లో రెండో జడ్జీల కేసులో తొమ్మిదిమంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరించింది. న్యాయమూర్తుల్లో సీనియారిటీనే కాక అఖిల భారత స్థాయిలో హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీనీ పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. జస్టిస్ ఖన్నాను, జస్టిస్ దినేశ్‌ను నియమించినప్పుడు ఇతర న్యాయమూర్తుల సీనియారిటీని ఎందుకు ఉపేక్షించాల్సి



వచ్చిందో కొలీజియం చెప్పలేదు. కారణం చెప్పిఉంటే ఇంత వివాదానికి అవకాశం ఉండేది కాదు. ఇలాంటి చర్యలవల్ల కొలీజియం పనితీరుపై అనుమానాలు తలెత్తుతున్నాయి. అది తీసుకున్న నిర్ణయాలను వెబ్‌సైట్లో ఉంచుతున్నందువల్ల దాపరికంలేకుండా ఉంటుంది అనుకుంటే డిసెంబరు 12 నాటి నిర్ణయాలను అలా ఉంచలేదు. కొలీజియం ఏ ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటోందన్న విషయం ఇప్పటికీ నిగూఢ రహస్యంగానే ఉంది.

అంతా న్యాయమేనా?

ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా ఉన్నప్పుడు సీనియర్ న్యాయమూర్తులైన జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ 2018 జనవరి 12న పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించడంతో న్యాయవ్యవస్థలోని అవ్యవస్థ బహిరంగమైంది. ఈ నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్రా వ్యవహార సరళి మీద విమర్శలు గుప్పించారు. వీరు రెండు అంశాలను ప్రధానంగా లేవనెత్తారు. ఒకటి- చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా కేసులు విచారించడానికి ధర్మాసనాలు ఏర్పాటు చేస్తున్న తీరు. రెండు- న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో లోపాలు. అంటే కొలీజియం వ్యవస్థలోని లోటుపాట్లను బయటపెట్టారు. న్యాయమూర్తుల నియామకానికి అనుసరించాల్సిన ప్రక్రియకు ఇంకా ప్రభుత్వ ఆమోదం లభించలేదు. ఈ సందిగ్ధతవల్ల న్యాయమూర్తుల నియామకం, కొలీజియం వ్యవహార సరళి మళ్ళీ వివాదాస్పదమైంది. జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తి. న్యాయమూర్తుల నియామకంలో ఆయన అనుసరిస్తున్న వైఖరి చర్చనీయాంశమైంది. ఏడాది కింద ఏ అంశంపైనైతే గొగోయ్ అభ్యంతరం వ్యక్తం చేశారో అదే విధానాన్ని అనుసరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అనుభవాన్ని అధిగమించి...

చీఫ్ జస్టిస్ గొగోయ్ నాయకత్వంలోని కొలీజియం ఈ నెల 10న న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దినేశ్ మహేశ్వరిని నియమించడానికి ఏకంగా 32 మంది సీనియర్ న్యాయమూర్తులను ఉపేక్షించింది. సీనియారిటీని ఇంత బాహాటంగా ఉల్లంఘించడాన్ని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి, భారత న్యాయవాదుల మండలి నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి కైలాశ్ గంభీర్, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ సైతం రాశారు. న్యాయమూర్తుల నియామకానికి సీనియారిటీ ఒక్కటే ప్రధానాంశం కాదు. వివిధ రాష్ట్రాలకు, భిన్న సామాజిక వర్గాల ప్రాతినిధ్యాన్నీ పరిగణించడం ఆనవాయితీ. రాజకీయ జోక్యాన్ని నివారించి, న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించడం కోసం 1993లో సుప్రీంకోర్టు కొలీజియం వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. కొలీజియం వ్యవస్థ మీదా విమర్శలు రావడం ప్రస్తుత సమస్య. ఇందిరా గాంధీ హయాములో నియమోల్లంఘన బాహాటమే. 1977లో న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సీనియారిటీని ఖాతరు చేయకపోవడానికి 'హెబియస్ కార్పస్' కేసులో ఆయన ప్రభుత్వానికి గిట్టని తీర్పు ఇవ్వడమే కారణం. ప్రస్తుత నియామకాల్లో సీనియారిటీని ఉల్లంఘించారన్న ఆరోపణలు వచ్చినప్పుడు అనుమానాలు తొలగించకపోవడం దాపరికానికి చోటిచ్చినట్లయింది. తాజాగా జస్టిస్ సంజీవ్ ఖన్నాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని చేసినప్పుడు దిల్లీ హైకోర్టులోని ముగ్గురి సీనియారిటీని విస్మరించడానికి కారణం ఏమిటో కొలీజియం నిగూఢ రహస్యంగానే మిగిల్చింది. జస్టిస్ ఖన్నాను, జస్టిస్ దినేశ్ మహేశ్వరిని నియమించడానికి ముందు 2018 డిసెంబరు 12న కొలీజియం సమావేశం జరిగింది. అందులో 'కొన్ని' నిర్ణయాలు తీసుకున్నారు. ఆ సమావేశంలో రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రదీప్‌నంద్ర జోగ్‌ను, దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజేంద్ర మీనన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం నిర్ణయించింది. ఈ 'నిర్ణయాల'ను కొలీజియం అటు ప్రభుత్వానికీ తెలియజేయలేదు, ఇటు వెబ్‌సైట్లోనూ ఉంచలేదు. ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే అధికారం చీఫ్ జస్టిస్ గొగోయ్‌కి ఉందా అన్న ప్రశ్న రాక తప్పదు. తరవాత జనవరి 10న మళ్ళీ జరిగిన కొలీజియం సమావేశంలో ఈ ఇద్దరు న్యాయమూర్తులకు సంబంధించి అదనపు సమాచారం అందినందువల్ల ఆ ప్రతిపాదనకు స్వస్తి చెప్పారు. డిసెంబరు సమావేశంలో తీసుకున్న నిర్ణయం న్యాయసంబంధమైన వెబ్‌సైట్లకు అందడం చీఫ్ జస్టిస్ గొగోయ్‌కి వ్యథ కలిగించిందట. మీడియా వార్త రాస్తే, అది నిజమైనప్పుడు బాధ ఏమిటో తెలియదు. ఆ వార్త తప్పయితే మీడియానే ఇబ్బంది పడాల్సింది కదా! కొలీజియం చెప్పిన మరో కారణం డిసెంబరు సమావేశం తరవాత న్యాయస్థానానికి శీతకాల సెలవులు వచ్చాయి. ఈ లోగా జస్టిస్ మదన్ బి.లోకూర్ పదవీ విరమణ చేశారు.



సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్, మాజీ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా

న్యాయమూర్తుల నియామక వివాదం

ఆయన స్థానంలో జస్టిస్ అరుణ్ మిశ్రాను కొలీజియం సభ్యుడిగా నియమించారు. కొలీజియంలో కొత్త సభ్యుడు చేరిన తరవాత జనవరి 5-6 నాటి సమావేశంలో అంతకుముందు తీసుకున్న నిర్ణయాలను తిరగదోడారు. డిసెంబరు 12 నాటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రద్దు చేయడాన్ని జస్టిస్ మదన్ బి.లోకూర్ విమర్శించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దినేశ్ మహేశ్వరి మరింత మెరుగైన, ఎక్కువ అర్హతలున్నవారన్న అభిప్రాయంతో వారిని నియమించారట. నిజానికి ఇది అంతకుముందు నియమించాలనుకున్న న్యాయమూర్తుల సామర్థ్యాన్ని కించపరచడమే.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగానో, న్యాయమూర్తులుగానో ఉన్నవారందరికీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కావడానికి అవకాశం రాకపోవచ్చు. ఇందుకు ప్రతిభ మాత్రమే కాక ఇతరేతర కారణాలు ఉండవచ్చు. దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు రాజేందర్ సచార్, ఎ.పి.షా, మధ్యప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి జి.పి.సింగ్, హిమాచల్ ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి లీలా సేఠ్‌కు ఇతర కారణాలవల్లే సుప్రీంకోర్టు న్యాయమూర్తులయ్యే అవకాశం రాలేదు. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు ప్రతిపాదించిన ప్రక్రియకు మూడేళ్లయినా ప్రభుత్వం ఆమోదం రాని మాట నిజమే. అంతమాత్రం చేత చీఫ్ జస్టిస్ గొగోయ్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవాలని లేదు. కొలీజియంలోని ఇతర సభ్యులు తలాడించడం మరో విచిత్రం. శీతకాల సెలవులే నిర్ణయం ప్రకటించడానికి అడ్డంకి అయితే చీఫ్ జస్టిస్ గొగోయ్ కొలీజియంలోని ఇతర న్యాయమూర్తులకు ఆ విషయం చెప్పి ఉండాల్సింది. అదీ జరగలేదు. ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానంలో నియమితులైన జస్టిస్ దినేశ్ సీనియారిటీని కాదని జస్టిస్ అజయ్ రస్తోగిని గత నవంబరులోనే సుప్రీంకోర్టులో నియమించారు. అప్పుడు విస్మరించిన జస్టిస్ దినేశ్‌ను తరవాత ఎందుకు నియమించారో తెలియదు. ఇప్పుడు జస్టిస్ దినేశ్ అమాంతం జూనియర్ అయిపోయారు.

వారసుల వేట

సుప్రీంకోర్టుకు న్యాయమూర్తులను నియమించడానికి కొలీజియం మరో అంశాన్నీ దృష్టిలో ఉంచుకున్నట్టు ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కావడానికి ఎవరికి ఎక్కువ అవకాశం ఉందని ఆలోచించినట్లుంది. చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ పదవీకాలం ఈ ఏడాది నవంబరులో ముగుస్తుంది. తరవాత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే ఆ స్థానంలోకి వస్తారు. 2021 ఏప్రిల్‌లో జస్టిస్ ఎన్.వి.రమణ ప్రధాన న్యాయమూర్తి అవుతారు. 2022 ఆగస్టులో జస్టిస్ యు.యు.లలిత్, ఆపై 2022 నవంబరు ఎనిమిదిన జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆ స్థానంలోకి వస్తారు. ఈలోగా ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఉన్నవారందరూ ఉద్యోగవిరమణ చేస్తారు. జస్టిస్ ఖన్నా వయసు ప్రస్తుతం 58 ఏళ్లు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఉద్యోగవిరమణ వయసు 65 ఏళ్లు. అంటే ఖన్నా 2024 నవంబరు నుంచి ఏడు నెలలపాటు ప్రధాన న్యాయమూర్తిగా ఉంటారు. ప్రధాన న్యాయమూర్తి అయ్యేవారికి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కొద్ది సంవత్సరాల అనుభవం ఉంటే మంచిదని కొలీజియం భావించినట్టుంది. జస్టిస్ దినేశ్ మహేశ్వరి 2023 మేలోనే ఉద్యోగ విరమణ చేస్తారు. జమ్మూకశ్మీర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ గీతా మిత్తల్, జస్టిస్ దినేశ్ కన్నా రెండు నెలలు సీనియర్. అందువల్ల ఆమె సీనియారిటీని ఉపేక్షించినా పెద్ద ప్రభావం ఉండదు. స్వల్పకాలం న్యాయమూర్తులుగా ఉండటంవల్ల ప్రయోజనం లేదని భావిస్తే అలాంటివారి సీనియారిటీని విస్మరించడానికి కారణం చెబితే అనుమానాలకు తావుండదు. జస్టిస్ ఖన్నా, జస్టిస్ దినేశ్ నియామకంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చినందువల్ల ప్రభుత్వం కొలీజియం సిఫార్సులను యథాతథంగా ఆమోదించకుండా పునఃపరిశీలించాలంటూ తిరిగి పంపుతుందని ఆశించారు. ప్రభుత్వం ఆ పని చేయకుండా ఆమోద ముద్ర వేసింది. ఇటీవలే జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కొలీజియం సిఫార్సు చేసినప్పుడు మాత్రం ప్రభుత్వం ఈ అంశాన్ని పునఃపరిశీలించాలంటూ కొలీజియానికి తిప్పి పంపింది. దీనికి ప్రభుత్వం చూపిన కారణం ఆయనకన్నా సీనియర్లను విస్మరించడమే అయినా అసలు విషయం ఆయన ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వ రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడమే. జస్టిస్ ఖన్నాను, జస్టిస్ దినేశ్‌ను నియమించినప్పుడు ప్రభుత్వం హడావుడిగా ఆమోదించడం అనుమానాలకు తావిచ్చినట్లయింది. సుప్రీంకోర్టు వ్యవహార సరళివల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్న భయాందోళనలు తొలగించడంలో ప్రధాన న్యాయమూర్తి చీఫ్ జస్టిస్ గొగోయ్ పాత్ర విస్మరించడానికి వీలులేనిది. న్యాయం చేయడం ఎంతముఖ్యమో చేస్తున్నట్లు కనిపించడమూ అంతకన్నా ప్రధానం!

- ఆర్వీ రామారావ్



ఎ.సూర్యప్రకాశ్

భారత రత్నాలపై తగని రాజకీయం

జాతికి తిరుగులేని సేవ చేసి, చెరగని ముద్రవేసిన మహోన్నత వ్యక్తులను భారత రత్న పురస్కారాలతో సత్కరించడం ఆనవాయితీ. తమ రంగాల్లో విశిష్ట కృషి చేసి, స్ఫూర్తిదాతలుగా నిలిచిన నానాజీ దేశ్‌ముఖ్, ప్రణబ్ ముఖర్జీ, భూపేన్ హజారికాలకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశంలోనే అత్యున్నత అవార్డులు ప్రకటించడంపట్ల సర్వత్రా హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. అయితే అక్కడక్కడా చిన్నపాటి నిరసనలూ వెలువడ్డాయి. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ శిబిరంనుంచి వ్యతిరేక స్వరాలు ఎక్కువగా వినిపించాయి. భాజపా తమ 'విశ్వసనీయుల'కే పురస్కారాలు కట్టబెట్టుకుందని కాంగ్రెస్ నాయకులు కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు. వారి విమర్శలు, చేస్తున్న వాదనలకు హేతుబద్ధత లేదు. సిసలైన జాతి కథానాయకులకు అవార్డులు ఇవ్వడానికి సంబంధించి ఒకసారి ఆ పార్టీ వెనక్కి తిరిగి తన చరిత్రను పరిశీలించుకుంటే నివ్వెరపోయే వాస్తవాలు కళ్లకు కడతాయి. గ్రామీణ స్వావలంబన, వ్యవసాయ సంస్కరణలకోసం నానాజీ దేశ్‌ముఖ్ జీవితాన్నే ధారపోశారు. పల్లెపట్టుల్లో స్ఫూర్తి రగిల్చి, వారిని స్వావలంబన బాట పట్టించిన నానాజీ వంటి నిస్వార్థ నేతామూర్తిని ఇన్నేళ్లూ ఎందుకు గుర్తించలేదని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించాల్సిన తరుణమిది. విలక్షణ సంగీతం, కళాప్రతిభ ద్వారా భూపేన్ హజారికా దేశ ఈశాన్య ప్రాంతానికి, మిగిలిన రాష్ట్రాలకూ మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించారు. జాతి సమైక్యతా సాధనలో ఆయన కృషి నిరుపమానమైనది. మాజీ రాష్ట్రపతి, ఒకప్పటి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రణబ్ ముఖర్జీ- ఆ పార్టీలోనే అత్యంత సమర్థులైన, తిరుగులేని అర్హతలు గల నాయకులు. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయనకు విలువైన సలహాలు, సూచనలందించి ప్రభుత్వాన్ని ముందుకు నడిపించిన ప్రణబ్- మోదీ జమానాలోనూ అదే విధంగా వ్యవహరించి శెభాష్ అనిపించుకున్నారు. ఇంతటి విశిష్ట వ్యక్తులకు అవార్డులు ప్రకటిస్తే దాన్ని కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది!

విడ్డూర పోకడ

ప్రధానమంత్రి సిఫార్సుల మేరకు భారత రత్న పురస్కారాలను రాష్ట్రపతి ప్రకటిస్తారు. ఈ అవార్డును 1954లో జవహర్‌లాల్ నెహ్రూ జమానాలో ప్రవేశపెట్టారు. అవార్డులను ప్రారంభించిన మరుసటి ఏడాదే అంటే 1955లోనే నాటి ప్రధాని నెహ్రూ తనకు తానే 'భారత రత్న' ప్రకటించుకున్నారు. ఆ తరవాత 1971లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ సైతం స్వయంగా 'భారత రత్న' పురస్కారం కట్టబెట్టుకున్నారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌గాని, 560 సంస్థానాలను విలీనం చేసి సమైక్య భారతావని ఆవిష్కరణకు కృషిచేసిన సర్దార్ వల్లభాయ్‌గాని నెహ్రూకు, ఇందిరకు భారత రత్న పురస్కారాల ప్రకటన సందర్భంగా అప్పట్లో గుర్తుకు రానే లేదన్నమాట! 1991లో రాజీవ్ గాంధీ హత్యానంతరం వెన్వెంటనే నాటి ప్రభుత్వం ఆయనకు 'భారత రత్న' ప్రకటించి గౌరవించింది. వీపీ సింగ్ నాయకత్వంలో జనతాదళ్ సారథ్యంలోని సర్కారు పూనుకొని బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు అత్యున్నత పురస్కారం ప్రకటించింది. అంతటి మహానాయకుడిని అప్పటివరకూ కొనసాగిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు విస్మరించినట్లు? డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి చెప్పినట్లు- 'అప్పట్లో ఎవరూ నెహ్రూ మాటను జవదాటే సాహసం చేయలేదు' మరి!! జాతి ఏకతకు అహరహం శ్రమించిన వల్లభాయ్ పటేల్‌ను



కాంగ్రెస్ అర్థరహిత విమర్శలు

సైతం 1991లో కాంగ్రెసేతర ప్రభుత్వమే గుర్తించి, అత్యున్నత పురస్కారంతో గౌరవించింది. వల్లభాయ్ పటేల్‌కు 'భారత రత్న' ఇద్దామని అప్పటి ప్రధాని చంద్రశేఖర్ ప్రతిపాదించగానే తాను అందుకు వెన్వెంటనే సమ్మతించినట్లు నాడు రాష్ట్రపతిగా ఉన్న వెంకట్రామన్ ఒక సందర్భంలో వెల్లడించారు. 1991 జూన్‌లో పటేల్‌కు, రాజీవ్‌గాంధీకి ఒకేసారి అత్యున్నత పురస్కారాలు ప్రకటించారు. అంతకు ఏడాది క్రితం అప్పటి ప్రధాని చంద్రశేఖర్ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్‌కు 'భారత రత్న' ఇద్దామని ప్రతిపాదించగా, తాను తక్షణం ఆమోదం తెలిపినట్లు వెంకట్రామన్ చెప్పుకొన్నారు. భూపేన్ హజారికాకు 'భారత రత్న' ఇవ్వడమన్నది- గతంలో వాజ్‌పేయీ జమానాలో గోపినాథ్ బొర్దొలికి అత్యున్నత పురస్కారం కట్టబెట్టిన ఘటనను గుర్తుకు తెస్తోంది. పటేల్‌తో సన్నిహితంగా పనిచేసిన బొర్దొలి గొప్ప దేశభక్తులు. అసోమ్‌లోని కొన్ని ప్రాంతాలను కబళించేందుకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలకు సమర్థంగా తిప్పికొట్టి జాతి సమగ్రతను కాపాడిన మహోన్నత నాయకుడాయన. ఆ స్థాయి నాయకుడు కాంగ్రెస్ కంటికి ఎందుకో ఆనలేదు! వాజ్‌పేయీ జమానాలో 1999లో బొర్దొలిని 'భారతరత్న' పురస్కారంతో గౌరవించారు. ఏడో దశకంలో ఇందిరాగాంధీ- దేశం నెత్తిన ఆత్యయిక స్థితిని రుద్దిన సందర్భంగా పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించిన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌కూ భాజపా ప్రభుత్వమే 1999లో అత్యున్నత అవార్డును ప్రకటించింది.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ హయాములో నెహ్రూ, ఇందిర, రాజీవ్ గాంధీల ప్రత్యక్ష సారథ్యంలోనే దేశ ప్రస్థానం 38 సంవత్సరాలు కొనసాగింది. 2004-2014 మధ్యకాలంలో మన్మోహన్ సింగ్ పేరుకు ప్రధానమంత్రి అయినప్పటికీ- కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ కనుసన్నల్లోనే దేశ పాలన సాగిందన్నది బహిరంగ రహస్యం. వాజ్‌పేయీకి భారత రత్న ఇవ్వాలని ఎంతోమంది మేధావులు అప్పట్లో సలహా ఇచ్చినప్పటికీ సోనియా-మన్మోహన్ ద్వయం నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ వచ్చింది. భారతీయ జనతాపార్టీకి ప్రజలు 2014లో తిరుగులేని విజయం కట్టబెట్టి, నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాకే అర్హతకు తగిన అత్యున్నత పురస్కారం వాజ్‌పేయీకి లభించింది. మరోవంక కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం వహించిన పండిత మదన్ మోహన్ మాలవ్య, ప్రణబ్ ముఖర్జీలను నరేంద్ర మోదీ ప్రభుత్వమే సర్వోన్నత అవార్డులకు ఎంపిక చేసింది. ఈ ఉదాహరణలన్నీ అవార్డుల ఎంపికలో కాంగ్రెస్ పార్టీ సంకుచిత మనస్తత్వాన్నే ఎండగడుతున్నాయి.

మహనీయులకు మన్నన

శక్తిమంతమైన సర్వస్వతంత్ర భారతావని ఆవిష్కరణకు పాటుపడిన అంబేడ్కర్, వల్లభాయ్ పటేల్, మదన్ మోహన్ మాలవ్య, జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ వంటి మహోన్నత నేతలను కాంగ్రెస్ పార్టీ వాటంగా విస్మరించింది. కేంద్రంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు కొలువుతీరితే తప్ప ఆ మహానాయకులకు 'భారత రత్న' గుర్తింపు లభించలేదు! అధికారంలో ఉన్నప్పుడు తమకు తామే 'అవార్డు'లు కట్టబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ నాయకులది! భిన్నత్వమే అజెండాగా చెప్పుకొనే కాంగ్రెస్ పార్టీ- రాజకీయపరమైన కారణాలతో జాతి అనర్ఘరత్నాలనదగిన నాయకులనూ గుర్తించలేదు. మరోవంక జాతి పరమోత్తమ పురస్కారాన్నీ రాజకీయ అవసరాలకు వాడుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది! 1988లో ఎంజీ రామచంద్రన్‌కు భారత రత్న ప్రకటించడాన్ని ఈ కోణంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. వెండితెర వేల్పుగా రాజకీయాల్లోకి ప్రవేశించిన ఎంజీ రామచంద్రన్ సారథ్యంలోని పార్టీ మద్దతు- ఎనిమిదో దశకం మలినాళ్లలో కాంగ్రెస్‌కు అవసరపడింది. తమిళనాడులో ఓట్లు కూడగట్టుకోవాలంటే అన్నా డీఎంకే పార్టీ మద్దతు అనివార్యమైనప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు 'భారత రత్న' ప్రకటించింది. ఈ విషయంలో అప్పట్లో కాంగ్రెస్ పార్టీలోనే నిరసన స్వరాలూ వినిపించాయి. ఇన్ని లొసుగులు, లోపాల చరిత్రగల కాంగ్రెస్ పార్టీ- భారత రత్న పురస్కారాలపై నీతులు చెప్పేందుకు ముందుకు రావడమే విడ్డూరం!

(రచయిత- ప్రసారభారతి ఛైర్మన్)

దివ్య క్షేత్రం

ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవీ తాపత్రయపడుతుంది. అందులో ప్రమాదరహితంగా, ప్రమోదభరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్య ఎదురైనప్పుడు ఏదైనా మహిమాన్విత శక్తి తనకు సహకరించాలని ఆశించడం సహజం. భగవంతుడి అనుగ్రహం పొంది, సమస్యను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే- భక్తి మార్గం! అందులో భాగమే పుణ్యక్షేత్రాల సందర్శనం. ప్రశాంతత, స్ఫూర్తిని కలగజేసేవే దివ్య క్షేత్రాలు. క్షేత్రం దర్శనీయం. అందులో క్షేత్రజ్ఞుడు తాత్వికం. సాధారణ దృష్టికి అందనివాటిని తాత్విక దృష్టితో అవగాహన చేసుకోవాలి. తాత్విక విశ్లేషణకు సంబంధించినవే దైవత్వం, మానవత్వం, రాక్షసత్వం వంటి గుణగణాలను తెలిపే పదాలు.

సగుణమైన విశ్వమంతా ఆ మూడింటికి ఆశ్రయమైన భగవత్ స్వరూపమే. ఎంతో వైవిధ్యంతో కూడిన ఆ మూడు తత్వాల ప్రమేయంతోనే జీవచైతన్యం ఉంటుంది. వివిధ గుణగణాల ప్రాబల్యంతోనే అది నిరంతరాయంగా సాగుతుంటుంది. ఆ క్రమగతిలో అక్రమం జరిగినప్పుడు సక్రమం చేయడానికే శుద్ధ చైతన్య స్వరూపుడి అవతరణ జరుగుతుంది.

విశ్వంతో భక్తుడికి ఉన్న అవినాభావ సంబంధ అవగాహన, భక్తి సార్థకతకు చాలా ముఖ్యం. దైవమంటే కిరీటాది ఆభరణాలు, ఆయుధాలతో ఉండే రూపమనే కాదు. అలా చూస్తే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అనే పదాలన్నీ అర్థరహితం అవుతాయి. భారతీయ సంప్రదాయంలో సూర్యచంద్రాది గ్రహాలతో సహ పంచభూతాది ప్రకృతి అంతా దైవశక్తి స్వరూపాలే.

ప్రకృతే ప్రత్యక్ష దేవత. దైవత్వం అంటే తన కోసం ఏ మాత్రం ఆలోచించక సర్వం ప్రసాదించే లక్షణం. తన సంతానం ఆనందమే తనది అనుకోవడం దైవంలోని పితృవాత్సల్యం. దైవం లోకబాంధవుడు. లోకం గురించి ఏ మాత్రం ఆలోచించక అంతా కేవలం తానే పొందాలనుకోవడం రాక్షసత్వం. దైవం నుంచి లభించే సంపదలన్నీ తాను గ్రహిస్తూ, తోటివారికి పంచి ఆనందించడం మానవత్వం.

పరమాత్మ నామాల్లో సంకర్షణుడు ఒకటి. సంకర్షణ అంటే సమ్యక్ కర్షణాత్ అంటే సంపూర్ణంగా ఆకర్షించే లక్షణుడు. ఆకర్షితులయ్యే లక్షణులు భక్తులు. క్షేత్రజ్ఞుడు దివ్యశక్తి సంపన్నుడు అయితే క్షేత్రం ఆకర్షణీయం అవుతుంది. ఆకర్షణీయం అంటే వెంటనే గుర్తుకు వచ్చేది అయస్కాంత తత్వం.



అంతర్యామి

అయస్కాంతం సాధారణ దృష్టికి ఒక లోహపు ముక్కలా కనిపిస్తుంది. ఒక ఇనుప ముక్కను దాని క్షేత్ర పరిధిలోకి చేరిస్తేనే దాని ఆకర్షణతత్వం తెలుస్తుంది. ఇతర లోహాలపై మాత్రం దాని ప్రభావం కనపడదు. అయస్కాంత క్షేత్రంలోఉన్న ఇనుప ముక్కలన్నీ దానిలాగే ప్రవర్తిస్తాయి. కొంత దూరం జరిపితే కొన్నింటిలోనే అయస్కాంత తత్వం నిలబడి ఉంటుంది. అది ఆ లోహ శుద్ధతనం సూచిస్తుంది.


ఆకర్షణీయమైన దివ్యక్షేత్రాలు, ఆకర్షితులయ్యే భక్తుల విషయంలో అంతరం సైతం అలాంటిదే. దివ్యశక్తి పొందడంలో, నిలబెట్టుకోవడంలో భక్తుడి ఆంతర్యశుద్ధి ప్రధానం. భగవంతుడికి ప్రతీకమైన దేహమే దేవాలయం. దేవాలయం అంటే దివ్య క్షేత్రం. దైవత్వంలో జీవించే ప్రయత్నంతోనే అది సార్థకం అవుతుంది. ఆంతర్యశుద్ధితో ఏదోరకంగా పరులకు హితం కోరే అభిలాషగల దేహిలో దివ్యత్వం ప్రకాశిస్తుంది. భగవంతుడి గురించిన స్పృహే దానికి స్ఫూర్తి.

ఆ దివ్యత్వం కోసం ఎక్కడెక్కడో వెతకనవసరం లేదు. బహుళార్థసాధకం అయిన అది ఉన్నచోట లభిస్తే ప్రమాదరహితంగా, ప్రమోదభరితంగా జీవించవచ్చు. స్వస్వరూప శక్తి పగటివేళలో సూర్యుని ప్రకాశంలా ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. రాత్రివేళలో పున్నమి చంద్రుని ప్రకాశంలా ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఆ విశ్వాసం మన శ్వాసలో భాగం కావాలి!

- దువ్వూరి రామకృష్ణ వరప్రసాదు

నిలువెత్తు విలువల నేత!

చలనచిత్రాల నుంచి రాజకీయాల వరకూ.. ఎందు కాలిడినా తెలుగువారి ఆత్మగౌరవ పతాకను ఎలుగెత్తి ఎగరేయటమే కాదు.. దేశ రాజకీయ యవనిక మీద రాష్ట్రాల ప్రాముఖ్యాన్ని, సమాఖ్య–సంకీర్ణ స్ఫూర్తినీ బలంగా ప్రతిష్ఠించిన ఎన్టీఆర్ జీవితం అడుగడుగునా ఆసక్తికరమే. ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా నిబద్ధతతో, జీవితాంతం సమున్నతమైన విలువలకు కట్టుబడిన ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిమంతం. అందుకే నేటి యువ తరం ముందు ఆయన విశ్వరూపాన్ని ఆవిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించిన ఇద్దరు మాజీ ఉన్నతాధికారులు కె.చంద్రహాస్, డా॥ కె.లక్ష్మీనారాయణలు శ్రమకోర్చి ఆంగ్లంలో ‘ఎన్టీఆర్: ఎ బయోగ్రఫీ’ పేరిట 636 పేజీల ఉద్గ్రంథాన్ని వెలువరించారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కృతమైన ఈ పుస్తకం నుంచి కొన్ని ఆసక్తికర ఘట్టాలు...



సమయ పాలకుడు!

ఎన్టీఆర్ సమయపాలనకు ఎంతో విలువ ఇచ్చేవారు. షూటింగ్ జరిగేటప్పుడు అంతా కచ్చితంగా టైమ్‌కు సెట్‌లో ఉండాలన్నది ఆయన నియమం. ఎవరైనా ఆలస్యమవుతుందని ముందే చెబితే ఒప్పుకునేవారుగానీ లేకపోతే అస్సలు క్షమించేవారు కాదు. శ్రీకృష్ణపాండవీయం చిత్రంలో రుక్మిణి పాత్ర కోసం కె.ఆర్.విజయను తీసుకున్నారు. తెలుగులో ఆమెకు అదే మొదటి సినిమా. ఆమె షూటింగుకు వరసగా మూడు రోజులు లేటుగా వచ్చారు. నాలుగో రోజు ఎన్టీఆర్.. మీరు ఆలస్యంగా రావటం మూలంగా జరిగిన నష్టానికి పరిహారం కట్టాలంటూ ఆమెకు లాయర్ నోటీసు పంపారు. చివరికి రాజీ కుదిరి, ఆమె చిత్రంలో కొనసాగారు. ఆ తర్వాత ఎన్నడూ ఆమె షూటింగుకు ఆలస్యంగా వచ్చింది లేదు!



కర్తవ్య సాధకుడు!

జయలలిత ఎప్పుడూ కూడా తన కోసం వచ్చేవారికి ఆతిథ్యం బాగుండాలని భావించేవాళ్లు. ఒకసారి జర్నలిస్టు బి.కె.ఈశ్వర్ తనను ఇంటర్వ్యూ చెయ్యటానికి వస్తానంటే ఆమె.. వాహినీ స్టూడియోలో శ్రీకృష్ణ సత్య షూటింగ్ జరుగుతోంది, అక్కడికి రమ్మని చెప్పారు. ఎన్టీఆర్‌గానీ, కె.వి.రెడ్డిగానీ సెట్‌లోకి జర్నలిస్టులను అనుమతించరని సినిమా రంగంలో అందరికీ తెలుసు. కానీ ఆ విషయం జయలలితకు తెలియదు. ఇంటర్వ్యూకోసం అక్కడకు వచ్చిన ఈశ్వర్‌ను చూసి ప్రొడక్షన్ సిబ్బంది అనుమతించటం కుదరదన్నారు. ఆ విషయం తెలిసి జయలలిత దాన్ని అవమానంగా భావించారు. షాట్ రడీ అయ్యింది. అయినా జయలలిత మాత్రం రాలేదు. ఆమె ఎంతకీ రాకపోవటంతో కారణం తెలీక ఎన్టీఆర్ అసహనానికి గురవుతున్నారు. పరిస్థితి అర్థం చేసుకున్న ప్రొడక్షన్ సిబ్బంది వెంటనే ఆయన వద్దకు వెళ్లి జరిగింది చెప్పారు. సెట్‌లో గొడవలన్నా, షూటింగ్‌లకు అంతరాయమన్నా అస్సలు ఇష్టపడని ఎన్టీఆర్.. వెంటనే ‘మేడమ్ కోసం వచ్చిన అతిథి. ఆయన్ని మీరెలా ఆపుతారు? ముందు వెళ్లి మేడమ్‌కు సారీ చెప్పండి, అతడిని లోపలికి పిలిచి మర్యాదగా చూడండి’ అని చెప్పారు. దీంతో జయలలిత కోపం తగ్గి, పరిస్థితి సర్దుకుంది. బహుశా, తన నియమాన్ని పక్కనబెట్టి, ఎన్టీఆర్ తను ఉన్న సెట్లోకి జర్నలిస్టులను అనుమతించిన ఒకే ఒక్క సందర్భం ఇది. ఆసక్తికరమైన అంశమేమంటే- ఈ చిత్రంలో ఎన్టీఆర్ శ్రీకృష్ణుడిగా నటిస్తే జయలలిత చేసింది సత్యభామ పాత్ర!



జన హృదయ నేత!


1983 జనవరి 3.. ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు. సాయంత్రం 4కల్లా ప్రచారం ఆగిపోవాలి. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఇద్దరూ తిరుపతిలో బహిరంగ సభలు పెట్టారు. ఇందిర హెలికాప్టర్‌లో ముందే వచ్చి ఎస్వీ యూనివర్సిటీలో మధ్యాహ్న భోజనం చేసి బహిరంగ సభకు వెళ్లిపోయారు. పట్టణమంతా జనంతో నిండిపోవటం చూసి ఆమె ముఖం విప్పారింది. ఆమె సభకు లారీల నిండా జనాన్ని సమీకరించేందుకు కాంగ్రెస్ నేతలు ఎంతో కష్టపడ్డారు. కానీ వాళ్లకు పూర్తి నిరాశ కలిగిస్తూ.. లారీల్లో వచ్చిన జనంలో చాలామంది ఇందిర సభ దగ్గర దిగి ఎన్టీఆర్‌ను చూసేందుకు వెళ్లిపోయారు. దీంతో సభ ప్రారంభమయ్యేప్పుడు నిండా ఉన్న జనం మధ్యలోనే పల్చగా అయిపోయారు. ఇంతలో ఎన్టీఆర్ పట్టణంలోకి వచ్చేశారనీ, బహిరంగ సభ ప్రాంగణానికి వెళుతున్నారన్న వార్త గుప్పుమనటంతో క్షణాల్లో గ్రౌండ్ ఖాళీ కావటం మొదలైంది. అది చూసి ఇందిర బిత్తరపోయారు. సినిమా వేరు, రాజకీయాలు వేరు, వంచకులను నమ్మకండి అంటూ ఆమె గొంతెత్తి పలుమార్లు ప్రకటించినా విన్న నాధుడు లేడు. ఆమె వేగంగా ప్రసంగం ముగించి విమానాశ్రయానికి వెళ్లిపోయారు. మరోవైపు ఎన్టీఆర్ ర్యాలీ పెద్ద సంబరంలా తయారైంది. జనం తాకిడికి తిరుపతి వీధులు పట్టలేదు. సభా ప్రాంగణం కిటకిటలాడి పోయింది. ఇదీ ‘తెలుగు ప్రజల ఆత్మగౌరవం’ అంటూ సాగిన ఎన్టీఆర్ ప్రసంగానికి జనం మంత్రముగ్ధులైపోయారు!



సంస్కార మూర్తి!

1984 అక్టోబరు 5. ఎన్టీఆర్ దిల్లీ వెళ్లారు. ఇందిరాగాంధీని ఆమె కార్యాలయంలో కలుసుకున్నారు. నాటి సమావేశానికి సాక్షి అయిన పి.సి.అలెగ్జాండర్ సమాచారం ప్రకారం “తన భార్య బసవతారకం మృతికి సానుభూతి తెలుపుతూ ఇందిర సంతాప సందేశం పంపినందుకు ఎన్టీఆర్ పలుమార్లు ఆమెకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆమెను ‘ప్రియతమ ప్రధాన మంత్రీజీ’ అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆమె కూడా ఎన్టీఆర్‌ను ఎంతో గౌరవంగా, స్నేహపూర్వకంగా ఆదరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల గురించి రామారావు ఆమెకు చెప్పగానే ఆమె సాధ్యమైనంత త్వరగా రాష్ట్రాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు”.





రాజకీయ స్ఫూర్తి!

రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బోఫోర్స్ ఆరోపణల్లో పీకల్లోతు చిక్కుకుపోయింది. నాటి రాష్ట్రపతి జైల్‌సింగ్ బోఫోర్స్ తుపాకుల సమర్థత గురించి తనకు సమాచారం ఇవ్వాలని రాజీవ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. అసలిలా అడిగే అర్హత రాష్ట్రపతికి లేదంటూ రాజీవ్ బృందం రకరకాల రాజ్యాంగ నిబంధనలను ఉటంకిస్తూ లేఖ రాసింది. ఇదంతా చూస్తున్న ఎన్టీఆర్ ఆ సమాచారం అడిగే హక్కు రాష్ట్రపతికి ఉందంటూ “రాజ్యాంగ నిబంధనలను ఉటంకిస్తూ ప్రధాని ఇచ్చిన సమాధానం కొత్తగా ప్రాక్టీసు పెట్టిన లాయర్ మొదటిసారి కోర్టుకు సమర్పించిన పత్రంలా ఉంది” అంటూ విజ్ఞత నూరిపోశారు. “పార్టీ కంటే కూడా దేశం సర్వోన్నతం, దేశం పట్ల మీ బాధ్యతను మర్చిపోకండి” అంటూ అప్పటి ఆర్థిక మంత్రి వి.పి.సింగ్‌కు గట్టిగా బాధ్యత గుర్తు చేశారు.



రేపు దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సదస్సు

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ సదస్సు మంగళవారం (29న) హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఆవరణలో జరుగుతుందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. దేశంలో వ్యవసాయరంగంలో సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమం తదితర అంశాలపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఆదివారం గాంధీ భవన్‌లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డితో కలసి కోదండరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించాల్సిన వ్యవసాయ విధానాలపైనా సదస్సులో చర్చిస్తామని తెలిపారు. ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ నానాపటేల్‌తోపాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కిసాన్ కాంగ్రెస్ ప్రతినిధులు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఇతర నేతలు పాల్గొంటారని చెప్పారు.

మార్చిలోగా స్వయంచాలక పదోన్నతులు

- అన్ని వైద్య కళాశాలల నుంచి సమాచార సేకరణ
- వైద్యవిద్యలో నూతన విధానం అమలుకు సన్నాహాలు

ఈనాడు–హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో కొత్తగా ప్రవేశపెట్టనున్న ‘పదోన్నతుల విధానం’ (కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్) ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లోనూ దీనిని అమలు చేసేందుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. నూతన విధానం అమలుకు కావాల్సిన సమాచారాన్ని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి సేకరించడంపై వైద్యవిద్య సంచాలకుల కార్యాలయం ప్రత్యేక దృష్టిపెట్టింది. వైద్యవిద్యలో స్వయంచాలక (ఆటోమేటిక్)పదోన్నతుల విధానాన్ని అమలు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేస్తూ వస్తోంది. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ గతేడు ఆగస్టులోనే పచ్చజెండా ఊపారు.

ఏమిటి ఉపయోగం?

- వైద్యవిద్యలో ఆచార్యులు, సహ ఆచార్యుల పదోన్నతుల ప్రక్రియ క్రమబద్ధంగా జరగకపోవడంతో వైద్యులు ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోలేదు.
- కొత్త విధానంలో పదోన్నతుల ప్రక్రియతో సంబంధం లేకుండా అధ్యాపకులకు స్వయంచాలకంగా పదోన్నతి లభిస్తుంది.
- పదోన్నతుల్లో ఖాళీలు లేకపోయినా నిర్ణీత కాలానికి నిబంధనల ప్రకారం పదోన్నతి ఇస్తారు. అందుకు అనుగుణంగా ఆర్థిక ప్రయోజనాలూ కల్పిస్తారు.
- వైద్యవిద్యసీట్లు కోల్పోకుండా ఉండడానికి, కొత్త సీట్లను పెంచుకోవడానికి ఎంసీఐ నిబంధనల ప్రకారం వీరిని బోధనా సిబ్బందిగానూ చూపొచ్చు.
- వాస్తవ ఖాళీలు ఏర్పడే వరకూ లభించిన పదోన్నతి హోదాలోనే కొనసాగుతారు. ఖాళీలు ఏర్పడిన అనంతరం సంఖ్యను బట్టి ఆయా ఖాళీల్లో భర్తీ చేస్తారు.
- ఈ విధానం అమల్లోకి తీసుకురావడం వల్ల దీర్ఘకాలం ఒకే హోదాలో కొనసాగుతున్నామనే అసంతృప్తిని సహాయ ఆచార్యులు, సహ ఆచార్యుల నుంచి దూరం చేసినట్లు అవుతుంది.

వయోపరిమితి పెంపుతో మెలిక

గత ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ వైద్యుల పదవీ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచుతూ అప్పటి మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. అయితే నిబంధనల ప్రకారం రావాల్సిన పదోన్నతులు దక్కక సహాయ, సహ ఆచార్యులు అవస్థలు పడుతుంటే పదవీ విరమణ వయసు పెంపును అమలు చేయడాన్ని కొందరు వైద్యులు వ్యతిరేకించారు. దీంతో ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా ప్రభుత్వం పక్కనబెట్టింది. సహాయ, సహ ఆచార్యుల పదోన్నతుల వ్యవహారం కొలిక్కి వచ్చిన అనంతరమే పదవీ విరమణ వయసు పెంపుపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే స్వయంచాలక పదోన్నతుల విధానాన్ని వేగవంతం చేయడంపై దృష్టిపెట్టింది. ఉస్మానియా వైద్యకళాశాల సమాచారం ఇప్పటికే వైద్యవిద్య సంచాలకులకు చేరగా.. మిగిలిన వైద్యకళాశాలల నుంచి కూడా వచ్చే నెల 15 లోగా పంపించాల్సిందిగా ఆదేశాలు జారీచేశామని వైద్యవిద్య సంచాలకులు రమేశ్‌రెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆత్మగౌరవంతో జీవించాలి

సఫాయి కర్మచారి ఆందోళన్ జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులు ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు రావాలని సఫాయి కర్మచారి ఆందోళన్ జాతీయ కన్వీనర్, రామన్ మెగసెసె పురస్కార గ్రహీత బెజవాడ విల్సన్ ఆకాంక్షించారు. దేశంలో మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు వెచ్చిస్తూ... పారిశుద్ధ్య వృత్తిలో ఉన్న కార్మికుల విమోచన కోసం రూ.570 కోట్ల నిధులను రూ.5 కోట్లకు కుదించడం దేనిని సూచిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఇండస్‌బుక్ ట్రస్ట్, సింగిడి, ఎరుక, హర్యాలీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ గాదె వెంకటేశ్ రచించిన ‘నిజాం పాలన- పారిశుద్ధ్య ప్రగతి’ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నిత్యం మరుగుదొడ్ల గురించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ వాటిని శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల క్షేమం గురించి మాట్లాడకపోవడం వారిని నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర నిర్మాణంలో ముస్లింలు, మాదిగల పాత్ర విశేషంగా ఉందన్నారు. నిజాం నియంతృత్వంగా వ్యవహరించినప్పటికీ డ్రైనేజీ, మురుగునీటి వ్యవస్థల విషయంలో పటిష్ఠ చర్యలు తీసుకున్నారని వివరించారు. మలమూత్రాలు తొలగించే దుర్మార్గమైన వృత్తి నిర్మూలనకు కృషి చేశారన్నారు. కవి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ మనవడు నవాబ్ నజఫ్ అలీఖాన్, కవులు, రచయితలు జూపాక సుభద్ర, వందన్‌కుమార్, ఎండ్లూరి సుధాకర్, ఎం.వేదకుమార్, స్కైబాబా, డాక్టర్ పసునూరి రవీందర్, నలిగంటి శరత్, భాస్కర్, వేముల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలప అక్రమ రవాణా కేసులో

సీఐ, ఎస్ఐ సస్పెన్షన్

ఎదులాపురం (ఆదిలాబాద్), న్యూస్‌టుడే: కలప అక్రమ రవాణా కేసుకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సీఐ సతీష్‌కుమార్, నేరడిగొండ ఎస్సై హరీష్ శేఖర్‌లపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇటీవల నిర్మల్‌లో పోలీసులు పట్టుకున్న టేకు దుంగల వ్యవహారంలో వీరిద్దరికీ సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా అధికారులు అదే రోజు రాత్రి ఆ స్థానాల్లో ఇతర అధికారులను నియమించారు. తాజాగా ఆదివారం సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మార్చికల్లా ఉద్యాన వర్సిటీ నిర్మాణం పూర్తి కావాలి: పార్థసారథి

ఈనాడు, హైదరాబాద్: ఉద్యాన విశ్వవిద్యాలయంలోని నిర్మాణాలన్నీ వచ్చే మార్చి 31కల్లా పూర్తిచేయాలని ఉద్యానశాఖ ముఖ్యకార్యదర్శి, వర్సిటీ ఇంఛార్జి ఉపకులపతి పార్థసారథి ఆదేశించారు. సిద్దిపేట జిల్లా ములుగులో నిర్మిస్తున్న వర్సిటీ భవనాల పనులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. హరియాణాలోని సోనేపట్‌లో జాతీయ ఆహార టెక్నాలజీ సంస్థలో అంతర్జాతీయ స్థాయి ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలున్నాయని ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తల బృందం అక్కడికెళ్లి పరిశీలించి వచ్చి అదేస్థాయి ఏర్పాట్లు ఇక్కడ చేయాలని ఆదేశించారు.

పెద్ద నోట్లు రద్దు చేసినా.. నల్లధనం బెడద

ఇండియా టుడే-కార్వీ సర్వేలో 46 శాతం మంది అభిప్రాయం

దిల్లీ: నల్లధనం బెడదను పెద్ద నోట్ల రద్దు చర్య తగ్గించలేకపోయిందని తాజా సర్వేలో అత్యధికులు అభిప్రాయపడ్డారు. కొత్త కరెన్సీ నోట్ల ముసుగులో నల్లధనం తిరిగొచ్చిందని వారు పేర్కొన్నారు. నల్లధనాన్ని బయటకు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2016లో పెద్ద నోట్లను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ చర్య అనంతరం కొత్త కరెన్సీ నోట్ల ముసుగులో నల్లధనం తిరిగొచ్చిందని ఇండియా టుడే, కార్వీ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన సర్వేలో దాదాపు 46 శాతం మంది అభిప్రాయపడ్డారు. నోట్ల రద్దు తర్వాత నల్లధనం బెడద తిరిగి రాలేదని 37 శాతం మంది పేర్కొన్నారు. మిగిలిన 17 శాతం మంది తమకు ఆ విషయంపై అవగాహన లేదని, తాము చెప్పలేమని తెలిపారు.

సామాన్యుడి గూడు.. సాంకేతిక తోడు

- రెండు పడకగదుల ఇళ్లకు కొత్త పరిజ్ఞానం
- షీర్‌వాల్, టన్నెల్ ఫామ్, ప్రీకాస్ట్ విధానాల్లో నిర్మాణం
- వేగంగా, నాణ్యంగా పనుల పూర్తి
- భూకంపాలకూ చెక్కుచెదరవంటున్న నిపుణులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి భారీ సంఖ్యలో నిర్మిస్తున్న రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు కొత్త సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా షీర్ వాల్, టన్నెల్ ఫామ్, ప్రీకాస్ట్ విధానాల్లో గృహ నిర్మాణం చేపట్టారు. ఈ ఇళ్లు నాణ్యంగా ఉంటాయని, భూకంపాలకు కూడా చెక్కుచెదరవని ఇంజినీర్లు చెబుతున్నారు.

సంప్రదాయ పద్ధతిలో మొదట ఉక్కు, కాంక్రీటుతో పిల్లర్లు నిర్మిస్తారు. దానిపై శ్లాబ్ వేశాక ఇటుకలతో గోడలు కట్టి ప్లాస్టింగ్ చేస్తారు. దీనివల్ల భవన నిర్మాణం ఆలస్యమవుతుంది. మానవవనరుల అవసరమూ ఎక్కువే. వీటిని అధిగమించి ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని తెలంగాణ సర్కారు భావించింది. నూతన విధానాల్లో ఇళ్లను నిర్మించడంపై అధ్యయనం చేసేందుకు గత జనవరిలో కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ కమిషనర్, చీఫ్ ఇంజినీరు, గృహ నిర్మాణశాఖ సీఈ, ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఆమోదం మేరకు ప్రభుత్వం కొన్ని ఇళ్లను నూతన విధానాల్లో చేపట్టింది.


దుండిగల్‌లో ప్రీకాస్ట్ విధానంలో ఇళ్ల నిర్మాణం

ప్రీ కాస్ట్ పద్ధతి

భవన నిర్మాణానికి అనుగుణంగా ముందే గోడలను తయారు చేయిస్తారు. వీటిని ఒక్కొక్కటిగా క్రేన్ సాయంతో అమర్చి ఇంటిని పూర్తి చేస్తారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని దుండిగల్‌లో 13 బ్లాకుల్లో 1,512 ఇళ్లను ఈ తరహాలో నిర్మిస్తున్నారు.

షీర్ వాల్ విధానంలో..

తొలుత భూమిలో రాతిపొరలు తగిలే వరకు తవ్వుతారు. అక్కడి నుంచి కాంక్రీట్‌తో పునాది వేస్తారు. దానిపై ఉక్కు చువ్వలను అమర్చి చుట్టూ అల్యూమినియం షీట్స్ వేస్తారు. వాటి లోపల కాంక్రీట్ మిశ్రమాన్ని నింపుతూ గోడలు, స్లాబ్‌ను ఏక కాలంలో నిర్మిస్తారు. అవసరమైన చోట తలుపులు, కిటికీలు, వెంటిలేటర్లు, విద్యుత్తు తీగలు, నీటి పైపుల ఏర్పాటుకు ఖాళీలు వచ్చేలా ముందుగానే డిజైన్ చేస్తారు. గోడల గట్టిదనాన్ని పరీక్షించాక అల్యూమినియం షీట్స్‌ను తొలగించి పై అంతస్తులను నిర్మిస్తారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని దుండిగల్‌లో 8 బ్లాకుల్లో 864 ఇళ్లను షీర్ వాల్ విధానంలో గత మార్చిలో చేపట్టారు. 60 శాతం నిర్మాణం పూర్తయింది. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 30 ఇళ్లు ఈ విధానంలో నిర్మిస్తున్నారు.


ఉక్కు చువ్వల చుట్టూ ఇలా అల్యూమినియం షీట్స్ ఏర్పాటు చేస్తారు


కాంక్రీట్ నింపాక ఇలా


నిర్మాణంలో ఉన్న షీర్ వాల్ ఇళ్లు

మొదటిసారిగా టన్నెల్ ఫామ్

టన్నెల్‌ఫామ్ విధానం షీర్ వాల్ వంటిదే. ప్రభుత్వ రంగ నిర్మాణాలకు ఈ విధానాన్ని ఉపయోగించడం ఇదే మొదటిసారి. ఇక్కడ అల్యూమినియం షీట్స్‌కు బదులు ప్రత్యేకంగా రూపొందించిన టన్నెల్ ఫామ్స్‌ను అమరుస్తారు. పంప్ ద్వారా కాంక్రీట్ నింపుతూ మూడు వైపులా గోడలు, శ్లాబ్ నిర్మిస్తారు. 16 గంటల తరువాత క్రేన్‌తో టన్నెల్ ఫామ్స్‌ను తొలగించి పై అంతస్తుపై అమర్చి నిర్మాణాన్ని కొనసాగిస్తారు. నాలుగో వైపు ఇటుకలతో గోడను పూర్తిచేస్తారు. టన్నెల్ ఫామ్స్‌ను టర్కీ నుంచి దిగుమతి చేసుకున్నారు. భవనాల డిజైన్‌ను మద్రాసు ఐఐటీలో డిజైన్ చేయించారు. జీహెచ్‌ఎంసీలోని రాంపల్లిలో 52 బ్లాకుల్లో 6,240 ఇళ్ల నిర్మాణానికి ఈ విధానాన్ని వినియోగిస్తున్నారు. ఒక్కో అంతస్తులో 12 ఇళ్లు ఉంటాయి. గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన ఈ ఇళ్లను వచ్చే మే నెలలోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.


నిర్మాణంలో ఉన్న మూడో అంతస్తు....


నిర్మాణం పూర్తయ్యాక ఇలా....

ఇవీ అనుకూలతలు

- ఒకేచోట పెద్ద మొత్తంలో ఇళ్లను నిర్మించడానికి ఈ నూతన విధానాలు అనుకూలంగా ఉంటాయి.
- భవనాలకు ఎలాంటి పగుళ్లు రావు.
- భూకంపాలనూ తట్టుకుంటాయి.
- ఇళ్లను నాణ్యంగా, వేగంగా నిర్మించవచ్చు.
- 120 గృహాలుండే ఒక్క బ్లాక్‌ను టన్నెల్ ఫామ్ విధానంలో 40 నుంచి 45 రోజుల్లో పూర్తి చేస్తున్నామని ఇంజినీర్లు చెబుతున్నారు.

“ఈ ఇళ్లు ఆశాజనకంగా ఉంటే రాష్ట్రంలో మరికొన్ని చోట్ల నూతన విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వం భావిస్తోంది.

తక్కువ సమయంలో ఎక్కువ ఇళ్లు

సాధారణ పద్ధతుల్లో నిర్మించే ఇళ్లకు కార్మికుల అవసరం ఎక్కువగా ఉంటుంది. సెంట్రింగ్ పనులు, ఇటుకలతో గోడల నిర్మాణం, ప్లాస్టింగ్ తదితర పనులకు ఎక్కువ సమయం పడుతుంది. నూతన పద్ధతులను అవలంబిస్తే తక్కువ సమయంలో నాణ్యమైన ఇళ్లను నిర్మించొచ్చు. ప్రకృతి విపత్తులు సంభవించినా ప్రాణ, ఆస్తినష్టం ఉండదు.

– వెంకటదాసు, ఎ.కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, గృహ నిర్మాణశాఖ, జీహెచ్‌ఎంసీ

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య

మహదేవ్‌పూర్, న్యూస్‌టుడే: తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన మహారాష్ట్రలో ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ ఆదివాసీని మావోయిస్టులు హతమార్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఏటాపల్లి తాలూకా తాడుగూడ పరిధిలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వారం క్రితం బ్రామ్హఘడ్ ప్రాంతంలో ఆరుగురిని కిడ్నాప్ చేసిన మావోలు ముగ్గురిని వదిలిపెట్టి మరో ముగ్గురిని హత్య చేశారు. ఈ ఘటన మరవక ముందే ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని సోనాసి తను బేగ్ (32)ను గొంతు కోసి చంపేశారు.

3నుంచి ఏపీ తాత్కాలిక హైకోర్టు భవనంలో కార్యకలాపాలు

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభ కార్యక్రమానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ రానుండటం చాలా సంతోషకర విషయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తాను దిల్లీ వెళ్లినప్పుడు సీజేఐ జస్టిస్ రంజన్‌గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డిలను కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్వయంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 3 నుంచి తాత్కాలిక హైకోర్టు భవనంలో కార్యకలాపాలు మొదలు కానున్నాయని సీఎం పేర్కొన్నట్లు సీఆర్‌డీఏ ఒక ప్రకటనలో తెలిపింది. 62 ఏళ్ల తర్వాత విజయవాడ-గుంటూరు ప్రాంతంలో నవ శకం మొదలవుతోందని పేర్కొన్నారు.

ఇవ్వాల్సినవి 29.. ఇచ్చినవి 13



- రాష్ట్రంలో పంచాయతీలకు అధికారాల అప్పగింత తీరిదీ
- కేరళలో అన్నీ బదలాయింపు
- అన్ని రాష్ట్రాలనూ ఒప్పించాలంటూ స్టాండింగ్ కమిటీ సిఫార్సు

పంచాయతీలకు అధికారాల అప్పగింతలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటూనే ఉంది. వాటి ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, సామాజిక పథకాల అమలుకు రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అధికారాలను దఖలు పర్చాల్సి ఉండగా.. తెలంగాణలో ఇంతవరకు 13 అధికారాలు మాత్రమే పంచాయతీలకు మళ్లాయి. పలు రాష్ట్రాలు అధికారాలను బదలాయించడంలేదంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజాగా ఆవేదన వ్యక్తం చేసింది. కేరళలో మాదిరిగా అన్ని అధికారాలు పంచాయతీలకు లభిస్తే. . అవి స్వయం పాలనతో ప్రగతి పథంలో పయనించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ మేరకు రాష్ట్రాలను ఒప్పించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ముమ్మర ప్రయత్నాలు చేయాలని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది.

మూడు 'ఎఫ్'లను బదలాయించాలి..

పంచాయతీలకు అధికారాల అప్పగింతలో జాప్యంపై స్టాండింగ్ కమిటీ తన తాజా నివేదికలో ఆవేదన వ్యక్తంచేసింది. కనీసం పశుగ్రాసం, సంప్రదాయేతర ఇంధన వనరులు, గ్రామీణ విద్యుత్, వయోజన విద్య, చిన్నతరహా పరిశ్రమలు వంటివాటినైనా పలు రాష్ట్రాలు అప్పగించలేదని వెల్లడించింది. రాష్ట్రాలు మూడు రకాల 'ఎఫ్'లను (ఫండ్స్, ఫంక్షన్స్, ఫంక్షనరీస్) బదలాయించేలా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కృషి చేయాలని సిఫార్సు చేసింది. పలు రాష్ట్రాల్లో గ్రామసభలు మొక్కుబడిగా మారాయని.. గ్రామస్థుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంటోందని పేర్కొంది.

పంచాయతీల బలోపేతానికే కొత్త చట్టం

తెలంగాణలో పంచాయతీలను బలోపేతం చేయడానికే కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్టు పంచాయతీరాజ్ శాఖ పేర్కొంటోంది. వాటికి మరిన్ని బాధ్యతలను, విధులను అప్పగించాలంటే తొలుత చట్టపరమైన ఏర్పాట్లు చాలా అవసరమని, అటువంటి అంశాలు 1994 నాటి చట్టంలో లేనందునే దాన్ని రద్దు చేసి 2018, ఏప్రిల్ నుంచి కొత్త చట్టాన్ని తెచ్చామని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఉద్యోగుల పాత్ర, బాధ్యతలను కొత్త చట్టంలో నిర్వచించినందున పరిపాలన మెరుగుపడుతుందని.. వారిలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన విశ్లేషించారు.

– రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ

తెలంగాణలో పంచాయతీలకు అప్పగించిన 13 అధికారాలు ఇవీ

- వ్యవసాయం, విస్తరణ
- పశుసంవర్ధకం
- మత్స్య పరిశ్రమ
- భూమి అభివృద్ధి
- చిన్నతరహా అటవీ ఉత్పత్తులు
- నీటి నిర్వహణ, చిన్నతరహా సాగునీటి వనరులు
- తాగునీరు
- ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలతో సహా విద్య
- పీహెచ్‌సీలతో సహా వైద్యం, పారిశుద్ధ్యం
- దారిద్ర్య నిర్మూలన పథకాలు
- సామాజిక సంక్షేమం
- ఎస్సీ, ఎస్టీలు, బలహీనవర్గాల సంక్షేమం
- స్త్రీ, శిశు అభివృద్ధి

ఇంకా ఇవ్వాల్సిన 16 అధికారాలు ఇవీ..

1. సామాజిక అడవులు 2. ఇంధనం, పశుగ్రాసం 3. ఖాదీ, గ్రామీణ, కుటీర పరిశ్రమలు 4. సంప్రదాయేతర ఇంధన వనరులు 5. విద్యుత్ పంపిణీ, గ్రామీణ విద్యుదీకరణ 6. ఆహారశుద్ధి, చిన్నతరహా పరిశ్రమలు 7. వయోజన, అనియత విద్య 8. సాంస్కృతిక కార్యక్రమాలు 9. కుటుంబ సంక్షేమం 10. గ్రంథాలయాలు 11. సామాజిక ఆస్తుల నిర్వహణ 12. మార్కెట్లు, ఫెయిర్లు 13. ప్రజాపంపిణీ 14. గ్రామీణ గృహనిర్మాణం 15. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, ఫెర్రీలు, జలమార్గాలు, రవాణాకు చెందిన ఇతరత్రా 16. సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య.

- ఈనాడు, హైదరాబాద్



ఆదివారం హైదరాబాద్‌లో వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు హితేశ్. పక్కన వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి

వైకాపాలోకి దగ్గుబాటి హితేశ్

- పురందేశ్వరి భాజపాలోనే కొనసాగుతారు
- మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్పష్టీకరణ
- కుమారుడితో కలిసి జగన్‌తో భేటీ

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డితో కలిసి నడవాలని తన కుమారుడు హితేశ్ నిర్ణయించుకున్నారని మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. హితేశ్‌తో కలిసి ఆదివారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్మోహన్‌రెడ్డిని కలుసుకున్న ఆయన పార్టీలో చేరిక, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు. అనంతరం వైకాపా నేతలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పురందేశ్వరి భాజపాలోనే కొనసాగుతారని స్పష్టం చేశారు. ఎవరి ఇష్టాల ప్రకారం వారు నడుచుకోవచ్చు.. బిడ్డలతోనే ఉండాలనేం లేదన్నారు. ఒకవేళ భాజపా నుంచి బయటకొస్తే రాజకీయాల నుంచి విరమించుకుంటారని పేర్కొన్నారు. రాజకీయాల నుంచి వైదొలగడానికి ఆమె సిద్ధపడగా.. శ్రేయోభిలాషులు, రెండు పార్టీల్లోని పెద్దలు అలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించారన్నారు. పర్చూరు నుంచి హితేశ్ పోటీ చేసే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుందన్నారు. వైకాపాలో ఎప్పుడు చేరాలనే విషయమై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'రెండేళ్లుగా జగన్ ఇంటర్వ్యూలు, పాదయాత్రను గమనిస్తున్నా.. ఎన్నో కష్టాలకోర్చి ప్రజల మధ్య ఉంటూ సమస్యలను తట్టుకుంటూ పార్టీని నడపడం కష్టమైన పని.. అందుకు దేవుడు ఫలితం చూపిస్తాడని భావిస్తున్నా. అందరూ జగన్ ప్రవర్తన అలా ఉంటుంది.. ఇలా ఉంటుందనుకుంటున్నారు.. అలా నాకెప్పుడూ కన్పించలేదు' అని దగ్గుబాటి వివరించారు.

ప్రభుత్వ పనితీరు గాడి తప్పింది

రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరు గాడి తప్పిందనేది తన భావన అని దగ్గుబాటి పేర్కొన్నారు. 'ప్రభుత్వ సొమ్ముతో దీక్షలు చేయడం నలభై ఏళ్లలో ఎన్నడూ చూడలేదు. జిల్లాలో సభ పెడితే రూ.కోట్లు ఖర్చవుతోంది' అని ధ్వజమెత్తారు. రైతులకు ఇప్పటివరకు నాలుగు, అయిదో విడత రైతు రుణమాఫీకి డబ్బు ఇవ్వకపోగా.. తాజాగా డ్వాక్రా మహిళలకు పోస్టు డేటెడ్ చెక్కులు ఇవ్వబోతున్నారని మండిపడ్డారు.

పీఆర్‌టీయూ భవన మరమ్మతులకు రూ.20 లక్షలు

ఎంపీ కవిత సాయం

ఈనాడు, హైదరాబాద్: తెరాస ఎంపీ కవిత తమ పార్లమెంటరీ నియోజకవర్గ నిధి నుంచి పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర సంఘం నిజామాబాద్ జిల్లా కార్యాలయ మరమ్మతుల కోసం రూ. 20 లక్షలను మంజూరు చేశారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ఎంపీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలసి సాయం కోరగా వెంటనే స్పందించి నిధులను కేటాయించారు. ఉపాధ్యాయుల సౌకర్యార్థం రాష్ట్రంలోనే పెద్దదైన సంఘానికి సాయం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని, నిధులను సద్వినియోగం చేసుకోవాలని, సత్వరమే పనులు చేపట్టాలని ఆమె సూచించారు. నిధుల కేటాయింపుపై కమలాకర్‌రావు, సంఘం నేతలు ఇ.శంకర్, పొద్దుటూరి మోహన్‌రెడ్డిలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



సత్యవతి



రమ్య

తల్లీబిడ్డల్ని వరించిన సర్పంచి పీఠం

తల్లీ, కుమార్తె ఇద్దరూ ఒకేసారి సర్పంచి పీఠాన్ని అధిరోహించారు. భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలం మర్రిగూడెంలో తల్లి అట్టం సత్యవతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆమె కుమార్తె పోకల రమ్య సర్పంచిగా గెలిచారు. ఇద్దరూ తెరాస మద్దతుతోనే విజయం సాధించడం గమనార్హం. నామినేషన్ల చివరి రోజు రమ్య అనూహ్యంగా తెరపైకి రాగా ఆమె తల్లి సత్యవతి తొలిసారి సర్పంచి పీఠాన్ని అధిరోహించారు.

– న్యూస్‌టుడే, అశ్వారావుపేట

లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు

- అభ్యర్థుల ఎంపికపై సమాలోచనలు
- ముఖ్య నేతలతో సమావేశాలకు ప్రణాళిక
- నేతల అభిప్రాయాలు స్వీకరించాలని నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారిస్తోంది. శాసనసభ ఎన్నికల ఫలితాలు పార్టీని తీవ్ర నిరాశకు గురిచేసిన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలపై ముందస్తు కార్యాచరణకు సిద్ధమవుతోంది.

శాసనసభ ఎన్నికల్లో 19 స్థానాలకే పరిమితమైన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ సమావేశాల్లోనే పార్టీని బలోపేతం చేయడం ఎలా? అనే అంశంతో పాటు లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై చర్చించనుంది. 'ఒక్కో లోక్‌సభ స్థానం పరిధి అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యే ఈ సమావేశాల్లోనే పార్టీ అభ్యర్థుల ఎంపికపై చర్చిస్తాం. నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు, ఆయా అభ్యర్థులకున్న ప్రజాదరణపై సర్వేలు చేయించి తుది నిర్ణయానికి వస్తాం' అని ఓ ముఖ్యనేత వెల్లడించారు.

పోటీకి ఆసక్తి చూపుతున్న ఓడిన నేతలు

తెలంగాణ రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలున్నాయి. ఆయా నియోజకవర్గాల్లో బరిలో దిగేందుకు పలువురు సీనియర్ నేతలతోపాటు, ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ఓడిన నేతలూ ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో పలువురు మాజీ ఎంపీలను పార్టీ బరిలోకి దింపింది. వీరిలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మినహా మిగిలిన వాళ్లంతా ఓటమి పాలయ్యారు. తాజాగా వీరిలో కొందరు లోక్‌సభ అభ్యర్థిత్వాలపై దృష్టి సారించారు. 'పార్టీ ఆదేశాల మేరకే శాసన సభకు పోటీ చేశామని, ఇప్పుడు లోక్‌సభకు అవకాశం ఇవ్వాలని' వారంతా కోరుతున్నట్లు సమాచారం. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసేవి కావడంతో ఏ చిన్న అవకాశాన్నీ చేజార్చుకోకూడదని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. శాసనసభ ఎన్నికల్లో దారుణ ఓటమి నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో విశ్వాసం నింపాలనే దృఢ నిశ్చయంతో ఉంది. అందుకే అభ్యర్థుల ఎంపికపై ముందు నుంచే కసరత్తు ఆరంభించింది.

దిల్లీకి చేరిన డీసీసీ అధ్యక్షుల జాబితా

రాష్ట్రంలో 31 జిల్లాలు, రెండు అర్బన్ జిల్లాల డీసీసీ అధ్యక్షుల జాబితా దిల్లీకి చేరింది. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి కుంతియా జాబితా దిల్లీకి తీసుకెళ్లినా, దానిపై అధిష్ఠానం ఇంకా దృష్టిసారించలేదని సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అశోక్‌గెహ్లోత్ నుంచి కె.సి.వేణుగోపాల్‌కు బదిలీ అయిన క్రమంలో ఏఐసీసీ ఆ జాబితాను పరిశీలించలేదని తెలిసింది. ఇప్పటికే పీసీసీ పంపిన జాబితాపై రాష్ట్ర నేతలు పలువురు మార్పులు కోరుతుండటం కూడా దానికి కారణమని పార్టీ వర్గాల సమాచారం. 'ఇటీవల శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన నేతలు కూడా డీసీసీ అధ్యక్ష రేసులో ఉన్నారు. అధిష్ఠానం వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయమై స్పష్టత రాలేదు. ఆ మేరకు స్పష్టత వస్తే జాబితాలో మార్పులకు అవకాశం ఉంటుంది' అని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు.



సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి జనసంఘం ప్రతినిధులు. పక్కన నాయిని నర్సింహారెడ్డి

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాలతోనే ఏ కులానికైనా ప్రత్యేక గుర్తింపు వస్తుందని సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో 305 మంది పేద మెరిట్ విద్యార్థులకు రూ.26 లక్షల ఉపకార వేతనాలను అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సభాపతి మాట్లాడుతూ. . రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాల ద్వారా రెడ్డి సామాజిక వర్గానికి గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత లభించిందని తెలిపారు. గ్రామాల నుంచి వచ్చి నగరంలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావడం సంతోషకరమన్నారు. మాజీ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సామాజిక వర్గంతో పాటు ఎస్సీ, ఎస్టీ ఇతర వర్గాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం పోచారం, నాయిని, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలతో పాటు ఉపకార వేతనాలకు విరాళాలు ఇచ్చిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, సలహాదారులు ప్రొఫెసర్ కె.దశరథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎ.సుకన్యారెడ్డి, పి.స్వరూపారాణి, ప్రధాన కార్యదర్శి కె.పాండురంగారెడ్డి, కోశాధికారి వి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు ఉద్యోగుల సంఘం దైనందినిని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ బీబీ పాటిల్, సంఘం అధ్యక్షుడు గంధం రాములు, ఇతర నేతలు

ప్రైవేటు ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

మాజీ మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో వారి పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం- 2019 దైనందినిని ఆదివారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. మెదక్ ఎంపీ బీబీ పాటిల్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నూతనగంటి పురుషోత్తం, ఇతర నేతలు కరుణాకర్‌రెడ్డి, పత్యానాయక్, భాస్కర్, లక్ష్మణ్, కమల్, శాంతి భూషణ్ గౌడ్ పాల్గొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు ఉద్యోగులను గాలికి వదిలేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించేందుకు యాజమాన్యాలను ఆదేశించిందని తెలిపారు.

భద్రతకు భరోసా లభించేనా?

- ద.మ రైల్వే జోన్‌లో 18 వేల ఖాళీలు
- 60శాతం సేఫ్టీ విభాగంలోనే..
- పని ఒత్తిడి పెరుగుతోందని కార్మికుల ఆందోళన
- జోన్లవారీ భర్తీతో స్థానికులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్లు



దక్షిణమధ్య రైల్వేలో ఇలా..

మొత్తం ఉద్యోగాలు:	97,547
ప్రస్తుతం పనిచేస్తున్నది:	79,607
ఖాళీలు:	17,940

- రైల్వేలో భద్రత, ఇంజినీరింగ్, కమర్షియల్ వంటి వివిధ విభాగాలుంటాయి. వీటిలో ప్రయాణికుల రక్షణపరంగా అతికీలకమైంది భద్రత విభాగం. ఇందులో భారీసంఖ్యలో ఖాళీలుండటంపై కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

సేఫ్టీ విభాగంలో ఉద్యోగాలు:	60,776
ప్రస్తుతం పనిచేస్తున్నది:	49,271
ఖాళీలు:	11,505

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో భారీగా ఉన్న ఖాళీలు ఉద్యోగులపై పనిఒత్తిడి పెంచడంతోపాటు అసౌకర్యాలు సహా ప్రయాణికుల భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. దేశంలో అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే జోన్లలో ముందువరుసలో ఉండే ద.మ.రైల్వేలో దాదాపు 18వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రెండేళ్లలో మరో ఏడువేల మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతారని అంచనా. మొత్తం ఖాళీల్లో 60శాతం వరకు సేఫ్టీ విభాగంలోనే ఉండటం ఆందోళనకర పరిణామమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ రైల్వేలో మొత్తం 18 జోన్లలో కలిపి 2.30లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ చేసిన ప్రకటనను నిపుణులు, రైల్వేసంఘాలు ఆహ్వానిస్తూనే పలు సూచనలు చేస్తున్నాయి. గత అనుభవాలు, నియామక ప్రక్రియలో జాప్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, భర్తీ ప్రకటనను చిత్తశుద్ధితో అమలుచేయాలని కోరుతున్నారు. నియామక ప్రక్రియను జోన్లవారీగా చేపట్టాలన్న డిమాండ్లు సైతం మొదలయ్యాయి.

అన్ని విభాగాల్లో ఒత్తిడి

దేశవ్యాప్తంగా కొత్త రైల్వేలైన్లు అందుబాటులోకి వస్తున్నాయి. రైళ్లసంఖ్యా పెరుగుతోంది. వీటికనుగుణంగా శాంక్షన్డ్ పోస్టులు పెరగకపోగా, ఉన్న ఉద్యోగాల్లో భారీ ఖాళీలతో తీవ్రమైన పనిఒత్తిడి పెరుగుతోంది. లోకోపైలెట్లు, ఆర్పీఎఫ్ పోలీసులు, వర్క్‌షాప్ సిబ్బంది, ట్రాక్‌మన్‌పై ఎక్కువ ఒత్తిడి ఉంటుందని చెబుతున్నారు. ట్రాక్‌మన్(గ్యాంగ్‌మన్) 20-25కిలోల కిట్ భుజనా వేసుకుని రాత్రివేళ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కువ పనిగంటలు, సరైన నిద్ర లేక ఒత్తిడికి గురై, అనారోగ్యం పాలవుతున్నట్లు లోకోపైలెట్లు చెబుతున్నారు. దాదాపు అన్నివిభాగాల్లో ఇదే పరిస్థితని పేర్కొంటున్నారు. ఆర్పీఎఫ్ సిబ్బంది అరకొరగా ఉండటం, కోచ్ సహాయకులు నామమాత్రం ఉండటంతో దొంగలు మహిళల మెడలో గొలుసులు లాగి, ఇతర వస్తువులు చోరీచేస్తూ రైలు బండి చైన్ లాగి దిగి వెళ్లిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఆర్పీఎఫ్ సిబ్బంది 3,422 మంది ఉండాలి. 2,413 మందే పనిచేస్తున్నారు. నాలుగున్నరేళ్లలో తొలి మూడున్నరేళ్లపాటు రైల్వే ఉద్యోగాల భర్తీకి పోలేదని, ఏడాది క్రితం నుంచి దశలవారీగా ప్రకటించిన నోటిఫికేషన్లు, నియామకాల ప్రక్రియ నత్తనడకన సాగుతోందని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు



రైల్వే నియామకాలు జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న కారణంగా లక్షల్లో దరఖాస్తులు వస్తున్నాయి. మొత్తం ప్రక్రియ పూర్తయి ఉద్యోగంలో చేరేనాటికి ఏడాదిన్నర వరకు సమయం పడుతుంది. జోన్లవారీగా నియామకాలు చేపట్టి స్థానికులకు అవకాశాలు కల్పించాలి. దీంతో నియామక ప్రక్రియ సమయం తగ్గుతుంది. విద్యార్హతలో మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపికచేస్తే తక్కువ సమయంలో ఉద్యోగాల భర్తీ జరుగుతుంది.

– శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి, ద.మ రైల్వే మజ్దూర్ యూనియన్

సత్వరం భర్తీ చేయాలి



పెద్దసంఖ్యలో ఖాళీల కారణంగా ఉద్యోగులపై పని భారం పెరుగుతోంది. కొత్త రైళ్లు రావడం, ఉన్న రైళ్లలోనూ బోగీల సంఖ్య పెంచడంతో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. వీటికనుగుణంగా ఉద్యోగుల సంఖ్యా పెరగాలి. నియామక ప్రకటన ఆహ్వానిస్తున్నాం. నియామక ప్రక్రియ వెనువెంటనే పూర్తయితే ప్రస్తుత ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుంది.

– ఉమా నాగేంద్రమణి, సహాయ ప్రధానకార్యదర్శి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమన్

11న 'చలో దిల్లీ'

తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల

ఈనాడు, హైదరాబాద్: దేశంలో అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా జాతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో వచ్చే నెల 11న చలో దిల్లీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సమాఖ్య అధ్యక్షుడు జస్టిస్ వంగాల ఈశ్వరయ్యగౌడ్ అధ్యక్షతన జరిగే మహాధర్నాలో తెలంగాణ నుంచి పెద్దఎత్తున బీసీలు హాజరవుతారని చెప్పారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. చలో దిల్లీకి రాష్ట్రం తరపున సన్నాహక సమావేశాన్ని ఈ నెల 28న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. అన్ని బీసీ సంఘాలు దీనికి హాజరవుతాయని పేర్కొన్నారు.

వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ధర్మాసనం

- నేటి నుంచి ఫిబ్రవరి 8 వరకు కేసుల విచారణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ వినియోగదారుల కమిషన్‌లో అపరిష్కృతంగా ఉన్న కేసుల విచారణకు సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు కానుంది. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ఆధ్వర్యంలోని ఈ ధర్మాసనానికి జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, సభ్యురాలు శిరీష నేతృత్వం వహిస్తారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 8 వరకు హైదరాబాద్‌లోని ఆదర్శనగర్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ సమావేశ మందిరంలో కేసుల విచారణ జరుగనుంది. కోటి రూపాయలు, అంతకు పైబడిన ఫిర్యాదులనూ వినియోగదారులు నేరుగా బెంచ్‌కు అందజేయొచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కొత్తగా అప్పీళ్లు, రివిజన్ పిటిషన్స్‌నూ దాఖలు చేసుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణ వినియోగదారుల కమిషన్‌లో 2,685 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. కేసుల విచారణకు ఆదివారం హైదరాబాద్ వచ్చిన ఆర్‌కే అగర్వాల్ జిల్లా వినియోగదారుల ఫోరంల అధ్యక్షులతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్‌తో కలిసి జిల్లా ఫోరంల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అంతకుముందు ఆర్‌కే అగర్వాల్‌ను తెలంగాణ వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్‌సబర్వాల్ మర్యాదపూర్వకంగా కలిశారు.



జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ ఆర్‌కే అగర్వాల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అకున్ సబర్వాల్, పక్కన ఎంఎస్‌కే జైస్వాల్

కొలువై ఉన్నాడు... బాపూ దేవుడు



స్వేచ్ఛ, హక్కులు, సమానత్వం, సౌభ్రాతృత్వం... ఇంకా ఎన్నో మనకు వారసత్వంగా అందించిన మహాత్ముడికి మనం ఏం ఇవ్వగలం...?

ఆయన ఆశయాలను గుండెనిండా నింపుకోవడం తప్ప...

కానీ అది సరిపోదంటున్నారు వారు... గాంధీకి గుడి కట్టి ఆరాధిస్తున్నారు... ఆయనను భగవత్ స్వరూపుడిగా భావించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.

మరికొందరేమో ఆయన ఆశయాలకు అక్షరాలా అద్దం పట్టే గ్రామ సీమలను తీర్చిదిద్దుతున్నారు...

ఇంకా మహాత్ముడి యశస్సును చాటేలా బెంగళూరులో లక్షలాది గులాబీలతో సబర్మతీ ఆశ్రమాన్ని రూపొందించారు.

ఈనెల 30 గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ విశేషాలు తెలుసుకుందామా...

నిత్య పూజలు... నివేదనలు... స్తోత్రనామాలు... ఇదంతా ఏ రామాలయంలో, శివాలయం సంగతో కాదు... ఇవన్నీ గాంధీ ఆలయంలో కైంకర్యాలు. మన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు కారణమైన గాంధీని అందరం స్మరిస్తాం... మనసులో ఆరాధిస్తాం. కానీ వాళ్లు అలా కాదు... గుళ్లు కట్టారు. అందులో మహాత్ముడిని ప్రతిష్ఠించి పూజిస్తున్నారు...

గాంధీ పీఠం!



గుంటూరు జిల్లా తెనాలిలో బాపూజీ పేరిట ఓ పీఠాన్నే ఏర్పాటుచేశారు. ఇక్కడ గాంధీజీ, కస్తూర్బా దంపతులకు నిత్యం పూజాదికాలు నిర్వహిస్తారు.

తెనాలికి చెందిన వజ్రాల రామలింగాచారికి జాతిపిత అంటే అమిత భక్తి. ఈ ప్రభావంతో 2002లో తన ఇంటిలోనే మహాత్మాగాంధీ శాంతి పీఠం ఏర్పాటుచేశారు. ఒక గదిని గుడిగా మార్చి విగ్రహాలను నెలకొల్పారు. వాటికి రోజూ పూలమాలలు వేసి పూజలు చేస్తారు. కొబ్బరికాయలు కొడతారు. హారతి పడతారు. రామలింగాచారే స్వయంగా రచించిన స్తోత్రనామాలు రోజంతా మందిరంలో ప్రతిధ్వనిస్తుంటాయి. 2004లో ఈ ఇంటి మొత్తాన్ని శ్రీమహాత్మా శాంతి సేవాశ్రమంగా మార్చారు. 27 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించారు. ఆశ్రమమంతటా గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలు ఉంటాయి. ప్రతి గోడ ఆయన సందేశాలను బోధిస్తుంటుంది. పీఠంలో గాంధీజీ జయంతి, వర్ధంతులతో పాటు ఇతర జాతీయ నేతల జయంతి, వర్ధంతులను క్రమం తప్పక నిర్వహిస్తారు. ఏటా సెప్టెంబరు 18 నుంచి అక్టోబరు 2 వరకు జయంతి పక్షోత్సవాలు నిర్వహిస్తారు. గాంధీజీ ఆశయాల ప్రచారానికి ఒక రథాన్ని ఏర్పాటు చేశారు. గాంధీజీ ఔన్నత్యంపై రామలింగాచారి 108 నామాలతో అష్టోత్తర శతనామావళి రాశారు. 2003లో భగవాన్ శ్రీమహాత్మా గాంధీ సహస్ర స్తోత్ర నామావళి పేరుతో 1008 నామాలను రచించారు. మంగళహారతి సైతం ఇందులో ఉంది.

– వేములపల్లి వెంకట సుబ్బారావు, విజయవాడ

జాతిపిత ఆలయం

నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో జాతిపిత మహాత్మాగాంధీకి ఆలయం ఉంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో హైదరాబాద్‌కు 75 కిమీల దూరంలో ఉన్న ఈ ఆలయంలో గాంధీజీ నిత్యపూజలు అందుకుంటున్నారు. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన 'మహాత్మా ఛారిటబుల్ ట్రస్టు' పెద్ద కాపర్తి శివారులో సుమారు నాలుగు ఎకరాల స్థలంలో 2013లో దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళుతుంటే రహదారికి కుడివైపు ఆహ్లాదకరమైన పరిసరాల మధ్య రెండంతస్తులుగా ఆలయం ఉంటుంది. పై అంతస్తులో నలుపురంగు రాయితో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహం దైవస్వరూపంలా తోస్తుంది. ఇక్కడే నిత్య పూజలు జరుగుతాయి. భవనం కింది భాగంలో విశాలమైన ధ్యాన మందిరం కూడా ఉంది.



- ఆలయానికి వచ్చేవారిలో ఆసక్తి కలిగినవారికి జన్మనక్షత్రం లేదా గ్రహాల ఆధారంగా పూజలు చేయిస్తున్నారు.
- కల్పతరువు పేరుతో చేపట్టిన కార్యక్రమం కింద, ఇంట్లో వినియోగించకుండా ఉన్న దుస్తులు, చెప్పులు, ఇతర సామాన్లు తెచ్చి ఆలయ సిబ్బందికి అప్పగిస్తే వాటిని ఇక్కడకు వచ్చే పేదలకు అందుబాటులో ఉంచుతారు.
- గాంధీజీకి సంబంధించిన పుస్తకాలతో గ్రంథాలయాన్ని ప్రారంభించారు.
- దేశంలోని ప్రముఖ ప్రదేశాలనుంచి మట్టిని సేకరించి, ఆలయగోడలకు సొరుగులు ఏర్పాటుచేసి అందులో భద్రపరిచారు.

– పి.మోహనరెడ్డి, చిట్యాల

వారి ఇలవేల్పు...



ఆనాడు... స్వతంత్ర పోరాటంలో మహాత్ముని అడుగుజాడల్లో నడిచారు .. సత్యాగ్రహ సంగ్రామంలో గెలిచిన తర్వాత ఆయనే తమ దేవుడని గుడి కట్టారు. కడప ప్రజలు. జాతిపిత విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేయడం ఇక్కడ ఆనవాయితీ. కడపలోని మేదర వీధిలో శ్రీసీతారామాలయం ఉంది. ఇందులో శ్రీరాముడి విగ్రహం పక్కనే గాంధీ విగ్రపహాన్ని కూడా ప్రతిష్ఠించారు. దాదాపు 60 సంవత్సరాలు నిరాటంకంగా ఇక్కడ రాముడితో పాటు గాంధీకి కూడా పూజలు కొనసాగాయి. తరువాత రహదారుల విస్తరణలో భాగంగా ఆలయంలో కొంత భాగాన్ని కూల్చినా ఇప్పుడు కొత్త గుడిని కట్టారు. సీతారాములతో పాటు గాంధీ విగ్రహాన్ని కూడా పూజల కోసం సిద్ధం చేస్తున్నారు. వెదురుబుట్టలు అల్లి జీవనం సాగించే నిరుపేదల కృషితోనే ఇవన్నీ జరుగుతుండడం విశేషం.

– పోలిచెర్ల.రవికుమార్ కడప

వారెవ్వా!

గ్రామం... పక్కాగృహాల్లేని కుటుంబాలు... మురుగుకాల్వల్లేక కంపుకొట్టే వీధులు... చదువుకోడానికి కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లే పిల్లలు, స్వయం ఉపాధి లేక వలస వెళ్లే యువకుల కళ్లల్లో నీళ్లు... చేలల్లో కరవు మొత్తంగా బతకడానికి చస్తున్న పల్లెలు.

గాంధీ కలలుగన్న గ్రామం...
స్వగృహాలతో మనుషులకు భద్రత
ప్రణాళికతో ఊరంతా శుభ్రత
చదువుకోడానికి బడి... బతకడానికి ఉపాధి
ముఖాల్లో సంతోషం.. కళ్లలో ధీమా
మొత్తంగా స్వయం సమృద్ధ సర్వసత్తాక గ్రామం.
... ఇలాంటి ఓ గ్రామాన్నే కలగందో జంట. పన్నెండున్నర ఎకరాల్లో కళగా తీర్చిదిద్దుతోంది! చదివేద్దామా మరి..

'పల్లె'వించిన జీవన రాగం



స్వయం సమృద్ధ సర్వసత్తాక గ్రామం

ఉద్యోగం తృప్తి నివ్వలేదు. ఆరంకెల జీతంతో ఆనందం లేదు. ఉన్నఫలంగా ఉద్యోగం వదిలేశారు. దేశం మొత్తం తిరిగారు. మారుమూల పల్లెలు, గిరిజన ప్రాంతాలు చుట్టి వచ్చాడు. పతనమైన పల్లెలు... వ్యధా భరితమైన గ్రామాలు.. బాధల్లో ప్రజలు... మెదడంతా ఇవే ఆక్రమించాయి. కునుకులేకుండా చేశాయి. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఎంతదూరంలో ఉందో గ్రహించారు. ఆయన అడుగుజాడల్లో నడవాలనుకున్నారు. మహాత్ముడి కల... కలగా మిగలకుండా.. కళగా మార్చాలని సంకల్పించారు వారు.... ఇది కల్యాణ చక్రవర్తి దంపతుల కథ. కల్యాణ చక్రవర్తి తండ్రి డాక్టర్ రాజారావు హిందూపురం ఎస్‌డీజీఎస్ కళాశాలలో రిటైర్డ్ ప్రొఫెసర్. తల్లి కృష్ణకుమారి విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు. చక్రవర్తి మల్టీనేషనల్ కంపెనీలో మేనేజర్ స్థాయిలో పనిచేశారు. అమెరికా వెళ్లారు. తిరిగి వచ్చి గాంధీ కలలు నిజం చేసే పనిలో పడ్డారు. సహధర్మచారిణి శోభిత కూడా ఆయన బాటలోనే నడిచారు. 2010లో మొదలైన వీరి ప్రయాణం.... ఓ ఆదర్శ ప్రాయమైన గ్రామానికి రూపకల్పన చేస్తోంది.

ఎక్కడంటే...

అనంతపురం జిల్లాలో 166 గ్రామాలు తిరిగిన చక్రవర్తి చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామంలో ఉండాలనుకున్నారు. అక్కడ 12.50 ఎకరాలు కొన్నారు. ఈ



ప్రదేశంలో ఒక సుసంపన్నమైన నమూనా గ్రామం నిర్మించాలనుకున్నారు. భార్య శోభిత ఆయన వెంటే ఉండి సహకరించారు. చక్రవర్తి భావాలు నచ్చి 11 మంది రైతులు ఆయనతో నడవడానికి ముందుకొచ్చారు. స్నేహితులు సాయం చేశారు. మనకు ఎలాంటి ఆలోచన ఉంటే... మన చుట్టూ అలాంటి వారే చేరతారు. అది చక్రవర్తి విషయంలో మరోసారి నిజమైంది. అలా అందరూ కలసి అనతి కాలంలోనే స్వయం సమృద్ధితో అలరారే పల్లెను సృష్టించారు.

ఆదర్శంగా..

ఒక గ్రామాన్ని నిర్మించాలంటే మాటలు కాదు. అక్కడి ఇళ్ల నిర్మాణానికి సున్నపు గారను ఉపయోగించారు. మట్టిని సంచుల్లో నింపి.. ప్రకృతి హితంగా గోడలు కట్టారు. దీనివల్ల



గృహాలు ఎండాకాలంలో చల్లగా.. చలికాలంలో వెచ్చగా ఉంటాయి. నీటి నిల్వ కోసం నీటికుంటలు తవ్వుకున్నారు. రసాయనాలతో కలుషితమైపోతున్న భూమిని రక్షించడానికి సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టారు. మొత్తం కుటుంబాలకు అవసరమైన పంటలన్నీ అక్కడే సాగుచేయించే దిశగా అడుగులు వేస్తున్నారు.

– అచ్యుత పవన్‌కుమార్, చిలమత్తూరు

స్వయం ఉపాధి

గ్రామంలో ఉండేవారికి వ్యవసాయమే కాకుండా స్వయం ఉపాధి మార్గాలు నేర్పుతున్నారు. సబ్బులు, వంటనూనెలు తయారు చేస్తున్నారు. బెంగళూరుకు సరఫరా చేస్తున్నారు. స్నేహితుల సహకారంతో ప్రకృతి హితమైన శానిటరీ న్యాప్‌కిన్స్ తయారు చేయిస్తున్నారు. వీటిని గ్రామాల్లో మహిళలకు అందిస్తారు. పల్లెంటే పల్లేరు ముల్లు కాదు... పల్లెంటే... గుభాళించే మల్లె అని నిరూపిస్తూ ముందుకు సాగుతున్నారు చక్రవర్తి, శోభిత దంపతులు.




చుట్టుపక్కల వారికీ ఆదర్శగ్రామం గురించి అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నాం. వ్యవసాయంలో ప్రధాన సమస్య గిట్టుబాటు ధర... దీనికి సంబంధించి మార్కెట్ మెలకువలపై రైతులకు శిక్షణ ఇస్తున్నాం. ఎక్కడైనా మానవాళికి అవసరమైనవి నీరు, వైద్యం, భోజనం, ఇల్లు, దుస్తులు, విద్యుత్తు, సాంకేతికత, వర్తకం, విద్య, విపత్తు నిర్వహణ... ఈ పది అంశాల్లోనూ గ్రామాలు స్వయంగా ఎదగాలనేది మా లక్ష్యం. – కళ్యాణ చక్రవర్తి

ప్రయోగాల బడి

టేకులోడు గ్రామంలో 8మంది పిల్లలను తీసుకొని ప్రయోగాత్మకంగా పాఠశాల నడుపుతున్నారు. చక్రవర్తికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. వాళ్లు కూడా ఇదే పాఠశాలలో చదువుకుంటారు. ఆదర్శ గ్రామంలో మాయాబజార్ అనే ఒక ఇళ్లుంది. అదే వారి బడి. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు ఎలాంటి పనులు అయినా చేస్తూ చదువుకోవచ్చు. ఒత్తిడి ఉండదు. హోంవర్క్‌లు ఉండవు. పరీక్షలు పెట్టరు. సైన్స్, గణితం కచ్చితంగా నేర్పుతారు. వీటికంటే ముందు సమాజంలో విద్యార్థుల పాత్ర, సమాజానికి చేయాల్సిన పనుల గురించి వివరిస్తుంటారు. పౌరబాధ్యతలను చెబుతారు. ఉచితంగా విద్య బోధిస్తూ, భోజన వసతి కల్పించారు. పిల్లలతో వారంలో 498 విద్య ప్రధాన కృత్యాలు చేయిస్తారు. ప్రతి శనివారం పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారిలోని ప్రతిభను పరీక్షిస్తారు.





సబర్మతి... గులాబీల సంగతి!

నాలుగు పూలను కలిపి చూడండి... కనువిందే కదా... అదే నాలుగు లక్షల పూలను కలిపి చూస్తే... ఇక చెప్పేదేముంది... అలాంటి పూల సోయగం బెంగళూరు వాసులకు ఆశ్చర్యాన్ని పంచుతోంది. అదీ జాతిపిత నడయాడిన సబర్మతికి నమూనా కావడం మరింత ఆనందానికి కారణమవుతోంది...


భారత గణతంత్ర దినోత్సవం, మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా బెంగుళూరులో జరుగుతున్న ఫలపుష్పప్రదర్శనలో లక్షలాది గులాబి పూలతో రూపొందించిన సబర్మతి ఆశ్రమ్ సందర్శకులను కట్టిపడేస్తోంది. ఇకెబన కళలో దేశవ్యాప్తంగా పేరొందిన సత్యపాల్ అగర్వాల్ దీని రూపకర్త. బెంగళూరులో 250ఎకరాల లాల్‌బాగ్ ఉద్యానవనం టిప్పుసుల్తాన్ కాలంనాటిది. ఈ విశాల ఉద్యానంలో ఏటా గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ఫలపుష్ప ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఏడాది గాంధీ 150వ జయంతి వత్సరం కూడా కావడంతో గాంధీ మహాత్ముడు జీవితాన్ని గడిపిన సబర్మతి ఆశ్రమాన్ని రూపొందించారు. దీనికోసం 3.80 లక్షల గులాబీలను ఉపయోగించారు. ఎరుపు, తెలుపు, నారింజ రంగుల రోజా పువ్వులను ఏర్చికూర్చారు. కొన్నిచోట్ల చామంతి పూలను కూడా వాడారు.



- 400 మంది పనివాళ్లు, కళాకారులు 15 రోజులు శ్రమించి ఈ ఆశ్రమాన్ని రూపొందించారు.
- దీని అంతర్భాగానికి స్టీల్, వెదురు ఉపయోగించారు. దీనిపై గులాబీలను ఓసిస్‌తో అతికించారు.
- నాణ్యమైన గులాబీ పూలను సాగు చేస్తున్న రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేశారు. కేవలం పుష్పాలేకాక వివిధరంగుల ఆకులను కూడా ఉపయోగించారు.
- ఆశ్రమం ముందు గాంధీ విగ్రహం, బాలలతో మహాత్ముడు, చెడువినవద్దు, చెడు చూడొద్దు, చెడు మాట్లాడొద్దు అని చెప్పే మూడు కోతుల బొమ్మలను కూడా ఉంచారు.
- సత్యపాల్ అగర్వాల్ గతంలో ఇదే మైదానంలో భాతరదేశ పార్లమెంట్ భవనం, బెంగుళూరు ప్యాలెస్, ట్రీహౌస్, పూలతో రోడ్లు, ఝురులు, దేవస్థానాలు ఇలా అనేకానేకం రూపొందించారు.
- పూల అందాలను ఒకచోట చేర్చే కళనే ఇకెబనా అంటారు. ఈ కళ జపాన్‌నుంచి ప్రపంచవ్యాప్తమైంది.

– జి.జగదీశ్వరి, బెంగుళూరు

మట్టి పాత్రలతో నివాళి



అచంచలమైన పట్టుదలతో దేశ ప్రజలను ఒక్కతాటిపైకి నడిపించిన మహాత్ముడు గాంధీ. అలుపెరుగని పోరాటంతో దేశాన్ని బ్రిటీష్ దాస్య శృంఖలాల నుంచి విముక్తం చేసిన పోరాట యోధుడాయన. జాతిపిత 71వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ). దీనికోసం దేశం నలుమూలల నుంచి 150 మంది మట్టి శిల్పులను గుజరాత్‌లోని మోర్బీకి ఆహ్వానం పలికింది. ఆ శిల్పులు తమ ప్రాంతం నుంచి సేకరించి తీసుకొచ్చిన మట్టితో చిన్నచిన్న మట్టి కప్పులు తయారు చేస్తారు. ఆ కప్పులను దిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌కి తీసుకెళ్లి వాటితో అక్కడ మహాత్మా గాంధీ రూపం వచ్చేలా 150 చదరపు అడుగుల భారీ గోడ నిర్మిస్తారు. గాంధీ పరమపదించిన జనవరి 30న ఈ చిత్రరాజం ఆవిష్కరించడానికి విస్తృతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఈనాడు సినిమా



అనుష్క

సమంత

నాయికా నామ సంవత్సరం

కథ గొప్పది.
ఎంత గొప్పదంటే ఒక్కోసారి కథే
విలన్‌ని హీరోని చేస్తుంది.
హాస్య నటుణ్ని కథానాయకుడిగా
మారుస్తుంది.
అప్పటివరకూ పాటలకూ, రొమాంటిక్ సన్నివేశా
లకూ పరిమితమైన కథానాయికలోని 'హీరోయిజాన్ని'
ఒక్కసారిగా బయటకు తీసుకొచ్చేస్తుంది.
అంటే కథే కథానాయకుడన్నమాట.
అది కథానాయకుడివైపు ఉంటే 'హీరో
యిజం' బయటకు వస్తుంది. కథానాయిక
వైపు ఉంటే 'హీరోయినిజం' చూపిస్తుంది.
2019లో కొన్ని కథలు కథానాయిక వైపు
నడుస్తున్నాయి. లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు
దారి చూపిస్తున్నాయి. ఆ లెక్కన
2019 నాయికా నామ
సంవత్సరం అని
చెప్పుకోవచ్చు.



తమన్నా



కీర్తి సురేష్



అంజలి

కథానాయికల్లో కొంత మంది గ్లామర్ పాత్రల వైపు మొగ్గు చూపిస్తుంటారు. ఇంకొంతమంది 'నా పాత్రకు ప్రాధాన్యం ఎంత?' అంటూ ఆరాలు తీసి మరీ సినిమాలను అంగీకరిస్తుంటారు. ఇంకో వర్గం ఉంటారు. రెండు రకాల కథలకూ అందుబాటులో ఉంటారు. అలాంటివాళ్లే టాలీవుడ్‌లో ఎక్కువగా కనిపిస్తుంటారు. అనుష్క, నయనతార, సమంత, తమన్నా లాంటి అగ్ర తారలు ఎలాగైనా ప్రయాణం చేయగలరు. అటు కమర్షియల్ చిత్రాల్లో మెరుస్తూనే, ఇటు కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమాల్ని ఎంపిక చేసుకుంటున్నారు.

అనుష్క ప్రస్తుతం మాధవన్‌తో ఓ సినిమా చేస్తోంది. ఇది తమిళ చిత్రమే. కానీ తెలుగులోనూ విడుదల కానుంది. కథానాయకుడు మాధవన్ కంటే నాయిక అనుష్క పాత్రకే ఎక్కువ ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. ఇక తమన్నా 'దటీజ్ మహాలక్ష్మి'గా ముస్తాబవుతోంది. బాలీవుడ్ చిత్రం 'క్వీన్'కి ఇది రీమేక్. సినిమా అంతా మహాలక్ష్మి పాత్ర చుట్టూనే నడుస్తుంది. సమంత పెళ్లయ్యాక హీరోయిన్ ఓరియెంటెడ్ కథల వైపు దృష్టి పెట్టింది. 'యూటర్న్' అలాంటి కథే. ఇప్పుడు నందినిరెడ్డి దర్శకత్వంలో నటిస్తోంది. ఈ చిత్రానికి 'ఓ బేబీ' అనే పేరు పరిశీలిస్తున్నారు. ఇది కూడా నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రమే. నిత్య మేనన్, అంజలి లాంటివాళ్లు ఎప్పుడో ఇలాంటి కథలకు షిఫ్ట్ అయిపోయారు. నిత్య మేనన్ మలయాళంలో 'ప్రాణ' అనే సినిమా చేసింది. అది తెలుగులో విడుదల కానుంది. 'గీతాంజలి 2' కోసం అంజలి సిద్ధమవుతోంది. హారర్, థ్రిల్లర్ తరహా కథలు కొన్ని అంజలి కోసం సిద్ధమవుతున్నట్లు టాక్.

'మహానటి'తో కీర్తి సురేష్ స్థాయి పెరిగింది. ఓ కథని తన భుజాల మీద వేసుకుని నడిపించగలదని అర్థమైంది. అందుకే ఇప్పుడు మరో చిత్రాన్ని పట్టాలెక్కించింది. కీర్తి కథానాయికగా నరేంద్ర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇదీ నాయిక కథే. నయనతార తెలుగులో పెద్దగా నటించడం లేదు కానీ, ఆమెతో తమిళంలోనూ, మలయాళంలోనూ కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. దాదాపుగా అవన్నీ తెలుగులో అనువాదాల రూపంలో విడుదల అవుతున్నాయి. వాటికి తెలుగులోనూ మంచి మార్కెట్ ఏర్పడింది. 'ఎఫ్2'తో వరుసగా నాలుగో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న అనిల్ రావిపూడి ప్రస్తుతం నాయికా ప్రాధాన్యం ఉన్న ఓ కథని సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. అందులో కథానాయిక ఎవరన్నది త్వరలో తెలుస్తుంది.

కథానాయకులకే కాదు, కథానాయికల చిత్రాలకూ ఓ మార్కెట్ ఉంది. స్టార్ హీరోయిన్‌తో సినిమా తీస్తే శాటిలైట్ హక్కులకు ఎలాంటి ఢోకా ఉండదు. ప్రచార చిత్రాలు బాగుండి, ప్రచారం బాగా చేసుకోగలిగితే, విడుదలకు ముందే మంచి రేటుకి సినిమా అమ్ముకోవచ్చు. పైగా ఇలాంటి కథలకు పెద్దగా బడ్జెట్ అవసరం ఉండదు. పక్కా ప్రణాళికతో తీస్తే సినిమా ఫలితంతో సంబంధం లేకుండా నిర్మాతలు గట్టెక్కొచ్చు. అందుకే ఈ తరహా కథలు విరివిగా రూపొందుతున్నాయి. అటు కమర్షియల్ చిత్రాలు చేస్తూనే, వీలైనప్పుడు తమలోని ప్రతిభని నూటికి నూరుశాతం బయట పెట్టుకునేందుకు కథానాయికలకు ఈ తరహా చిత్రాలు ఓ మార్గంగా కనిపిస్తున్నాయి.

ఈ వాల్మీకి ఏం చెప్పాడు



వరుణ్ తేజ్‌పై క్లాప్‌నిస్తున్న నిహారిక

ఆనాటి వాల్మీకి రామాయణం రాశాడు. రామ చరితను రసరమ్యంగా తీర్చిదిద్దాడు. ఇప్పుడు మరో వాల్మీకి బయల్దేరాడు. మరి ఈ నయా వాల్మీకి ఏం చేశాడు? ఎవరి చరితను రాశాడో తెలియాలంటే మా సినిమా చూడండి అంటున్నారు హరీష్ శంకర్. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'వాల్మీకి'. తమిళంలో విజయం సాధించిన 'జిగర్తాండ'కి రీమేక్ ఇది. వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మాతలు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిహారిక క్లాప్‌నిచ్చారు. రామ్ బొబ్బ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. సుకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. "స్క్రిప్టు పక్కాగా సిద్ధమైంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలెడతాం. మిగిలిన నటీనటుల వివరాలు కొద్ది రోజుల్లో వెల్లడిస్తామ"ని చిత్రబృందం తెలిపింది. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఛాయాగ్రహణం: బోస్, కూర్పు: చోటా కె.ప్రసాద్.



విద్యాబాలన్



సన్యా మల్హోత్రా


వెండితెరకు మానవ కంప్యూటర్ కథ

బాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన బయోపిక్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. తన మేధస్సుతో ప్రపంచాన్ని అబ్బురపరచి మానవ కంప్యూటర్‌గా పేరొందిన ప్రసిద్ధ గణిత మేధావి, రచయిత్రి శకుంతలా దేవి జీవితకథతో ఓ చిత్రం రూపొందనున్నట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన దర్శకురాలు అను మేనన్ తెరకెక్కించబోయే ఈ చిత్రాన్ని రోనీ స్క్రూవాలా నిర్మించనున్నారట. విద్యాబాలన్ ప్రధాన పాత్రలో నటిస్తారని వినిపిస్తోంది. మరో కీలక పాత్ర కోసం 'దంగల్' నటి సన్యా మల్హోత్రాను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. తన ప్రతిభతో గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకున్న శకుంతలా దేవి బహుముఖ ప్రజ్ఞాశాలి. గణితంతో పాటు జ్యోతిషంలోనూ ప్రావీణ్యం ఉంది. రచయిత్రిగా నవలలు రాశారు. స్వలింగ సంపర్కులపై 'ది వరల్డ్ ఆఫ్ హోమో సెక్సువల్స్' పుస్తకాన్ని రచించారు. ఆ పార్శ్వాలను ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది.

'చంద్రోదయం' పాటలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'చంద్రోదయం'. పి.వెంకటరమణ దర్శకుడు. జి.జె.రాజేంద్ర నిర్మాత. ఈ నెల 31న పాటల విడుదల వేడుకని నిర్వహిస్తారు. దర్శకుడు మాట్లాడుతూ "చంద్రబాబు నాయుడు దేశం గర్వించదగ్గ నాయకుడు. 68 ఏళ్ల వయసులోనూ తెలుగు ప్రజల కోసం శ్రమిస్తున్నారు. అలాంటి నాయకుడి కష్టాన్ని తెలుగువాళ్లందరికీ తెలియజేయడానికే ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అన్నారు. వినోద్ నువ్వుల, శివానీచౌదరి, మౌనిక, భాస్కర్ తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: కార్తీక్ ముకుందన్, సంగీతం: రాజ్‌కిరణ్.

గోవిందుని దొంగాట



సప్తగిరి

సప్తగిరి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వజ్ర కవచధర గోవింద'. అరుణ్ పవార్ దర్శకుడు. వైభవీ జోషీ కథానాయిక. నరేంద్ర, జీవీఎన్ రెడ్డి నిర్మాతలు. ఆదివారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ "గోవింద్ అనే అల్లరి దొంగ కథ ఇది. అతను దొంగ అయినా తనకంటూ ఓ లక్ష్యం ఉంటుంది. అదేంటన్నది ఆసక్తికరం" అన్నారు. "ఇప్పటికి 80 శాతం చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన సన్నివేశాల్ని కర్ణాటకలోని ఓ ఆలయంలో చిత్రీకరిస్తామ"న్నారు. అర్చన, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్ తదితరులు నటించారు. సంగీతం: విజయ్ బుల్గానిన్.

రెండు మనసులు



ఆది పినిశెట్టి, చంద్రశేఖర్, రవిచంద్ర

రవిచంద్ర, సుమయ నాయకా నాయికలుగా పరిచయమవుతున్న చిత్రం 'ఈ 2 మనసులు'. ఆది పినిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. చంద్రశేఖర్.ఎస్ నిర్మాత. హైదరాబాద్‌లో టీజర్‌ని, పాటని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇదొక ప్రేమకథ. రెండు మనసుల మధ్య ప్రేమ ఎలా చిగురించిందన్నది తెరపైనే చూడాలి" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కొత్త తరం నటీనటులతో తెరకెక్కిన చిత్రమిది. ఈ కథతో పేరున్న నటులను సంప్రదిస్తే మా సంస్థపై సందేహంతో, సినిమా విడుదలవుతుందో లేదో అని చేయడానికి ఆసక్తి చూపలేదు. అందుకే కొత్త వాళ్లని ఎంపిక చేసుకొన్నాం. మాలాంటి చిన్న నిర్మాతల్ని ప్రోత్సహిస్తేనే మంచి కథలతో సినిమాలొస్తాయి. కథా బలమున్న ఈ చిత్రం చాలా బాగుంటుంది. ఫిబ్రవరిలో చిత్రాన్ని పూర్తి చేసి వేసవిలో విడుదల చేస్తాం" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఇటీవల వచ్చిన ప్రేమకథలకి భిన్నంగా ఉంటుందీ చిత్రం" అన్నారు.



రణ్‌వీర్ సింగ్

తెలుగులోనూ '83' విజయగాథ

రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం '83'. భారత క్రికెట్ జట్టు 1983లో ప్రపంచ కప్ విజేతగా నిలిచిన చారిత్రక ఘట్టం నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. అప్పటి జట్టుకు సారథ్యం వహించిన కెప్టెన్ కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ నటిస్తున్నారు. కబీర్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికరమైన విషయం వెల్లడైంది. ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ తెరకెక్కించబోతున్నారు. భారత జట్టు సాధించిన చారిత్రక విజయం భాషలకతీతంగా దేశవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులందరూ తెలుసుకోవాల్సిన కథ అని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చిత్రబృందం తెలిపింది. దీంతో ఇది రణ్‌వీర్ సింగ్‌కు తొలి త్రిభాషా చిత్రంగా నిలిచింది. తన పాత్రకు సంబంధించి రణ్‌వీర్ కసరత్తులు మొదలుపెట్టారు. క్రికెట్‌లో మెలకువల కోసం శిక్షణ తీసుకుంటున్నారు.

ఎన్టీఆర్‌తో సినిమా చేయాలని ఉంది

నటుడిగా ప్రయాణం మొదలు పెట్టిన వెంకీ అట్లూరి 'తొలిప్రేమ'తో దర్శకుడిగా మారారు. తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకొన్నారు. తనలో ఎంత మంచి దర్శకుడు ఉన్నాడో, అంత మంచి రచయిత ఉన్నాడని ఆ చిత్రంతో చాటి చెప్పారు వెంకీ. తన రెండో ప్రయత్నంగా 'మిస్టర్ మజ్ను' తెరకెక్కించారు. అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటించిన ఆ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



"అఖిల్‌తోనే తీయాలనుకొన్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. 'ప్రేమ్‌నగర్'లో ఏయన్నార్ పాత్ర ఆధారంగానే ఇందులో అఖిల్ పాత్రని తీర్చిదిద్దా. నేను అఖిల్‌కి కథ చెప్పాక తను వరుసగా రెండు సినిమాలతో బిజీ అయ్యారు. నేనూ 'తొలిప్రేమ'పై దృష్టిపెట్టడంతో ఈ చిత్రం కాస్త ఆలస్యమైంది. మజ్ను అంటే ప్రేక్షకులను ముగ్ధులను చేసే పాత్ర. అందులో ఓ కవితాత్మకత ఉంటుంది. అయితే ఆ పాత్ర విషాదంతో ముగిసింది. ఇందులో అలా ఉండదని చెప్పడానికే 'మిస్టర్ మజ్ను' అని పేరు పెట్టాం".

- "ఈ కథని ముందు దిల్‌రాజుకి చెప్పా. ఆయన కాస్త అనుభవం వచ్చాక తీస్తే బాగుంటుందని చెప్పారు. కథ పరంగా కొన్ని సలహాలూ ఇచ్చారు. ఆయన జడ్జిమెంట్ బాగుంటుంది. అందుకే నా సినిమాల విషయంలో ఆయన సలహాలు తీసుకుంటుంటా. ఈ చిత్రానికి తొలి ప్రేక్షకుడు నాగార్జునగారు. ఆయన కథ విన్న తర్వాత మళ్లీ ఎప్పుడూ సినిమా గురించి ఏమీ అడగలేదు. సినిమా పూర్తయిన తర్వాత చూసి రిలాక్స్‌గా ఫీల్ అయ్యారు. కొన్ని సన్నివేశాల్ని మాత్రం మళ్లీ తీయమని సలహా ఇచ్చారు. అది మాకు మేలు చేసింది. అఖిల్, నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు సంగీతదర్శకుడు తమన్, ఛాయాగ్రాహకుడు జార్జ్ ఈ కథని వందశాతం నమ్మి చేశారు. అఖిల్ నేను అనుకున్న దానికంటే యాభై శాతం ఎక్కువే పాత్రలో ఒదిగిపోయారు. నిధి అగర్వాల్ తెలుగు అర్థం చేసుకొని నటించింది".

- "దర్శకుడిగా ఇది నాకు రెండో సినిమా కాబట్టి ద్వితీయ విఘ్నం అనే సెంటిమెంట్‌తో మొదట్లో కాస్త భయం ఉండేది. తొలి ఆట ఖతార్‌లో ప్రదర్శితమైంది. అక్కడ నుంచి సినిమా బాగుందనే టాక్ రావడంతో ఒత్తిడి పోయింది. ఆ తర్వాత ప్రేక్షకులతో కలసి సినిమా చూశా. వాళ్ల స్పందన సంతృప్తినిచ్చింది. కొన్ని సమీక్షల్లో సినిమాని విమర్శిస్తూ రాశారు. కానీ సామాన్య ప్రేక్షకులకి మా సినిమా బాగా నచ్చింది. కుటుంబ నేపథ్యంలోని భావోద్వేగాలతో పాటు కొండబాబు కామెడీని ఆస్వాదిస్తున్నారు. దిల్‌రాజు మనవడు ఆరాన్ష్‌ను చూసి కొండబాబు పాత్రకి బాగుంటాడనిపించింది. ఆరాన్ష్ చలాకీగా నటించాడు".

- "నాకు నటన అంత సౌకర్యంగా అనిపించేది కాదు. రెండో టేక్ చేయాలంటే తలనొప్పిగా అనిపించేది. అదే రచయితగా ఒక సన్నివేశం కోసం ఎన్ని వెర్షన్లు రాయాలన్నా ఇబ్బందిగా అనిపించదు. రచయితగా మొదలై దర్శకుడిగా మారా. త్రివిక్రమ్ స్ఫూర్తితో రచనని మొదలుపెట్టా. తివిక్రమ్ తర్వాత మణిరత్నం ఇష్టం. మూడు కథల్ని సిద్ధం చేస్తున్నా. మైత్రీ మూవీస్‌లో ఓ సినిమా, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌తో మరోటి చేయాల్సి ఉంది. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలని ఉంది. ఆ స్థాయి నటుడితో సినిమా అంటే అన్నీ పక్కాగా కుదరాలి. ఇంకాస్త అనుభవమూ రావాలి. అన్నీ కుదిరితే ఆయనతో తప్పక సినిమా చేస్తా".

వసుంధర



❖ శ్వేత ఓ ప్రయివేటు సంస్థలో క్లర్క్. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదింటి వరకు దించిన తల ఎత్తకుండా పని చేస్తుంది. మధ్యలో లేచి కాసేపు నడవాలన్నా.. పని ఒత్తిడితో సాధ్యం కాదు. దాంతో చిన్నవయసులోనే మోకాళ్ల నొప్పులు, ఊబకాయం వంటి సమస్యలతో బాధపడుతోంది.

❖ రాధ పదేళ్లుగా ఓ ఫైనాన్స్ సంస్థలో అకౌంటెంట్‌గా చేస్తోంది. ఆఫీసులో చేరిన కొత్తలో సన్నగా ఉన్న ఆమె... క్రమంగా బరువు పెరిగిపోయింది. అంతేకాదు అదేపనిగా కూర్చోవడం వల్ల నడుము నొప్పి, మధుమేహం బారిన పడింది.

వీళ్లిద్దరి పనులు వేరైనా... కూర్చునే సమయం, తీరు ఒకటే. ఇలా ఉద్యోగాలు చేసే మహిళలే కాదు... ఇంటిపట్టున ఉండే గృహిణులు, యువత ఎవరైనా సరే! ఈవిధంగా ఎక్కువ సేపు కదలకుండా కూర్చుంటే ఇటువంటి ఇబ్బందులే ఎదురవుతాయి. మరేం చేయాలి?

ఓ పది నిమిషాలు నిలబడితే కాళ్లు లాగేస్తాయి... కాసేపైనా చతికిలపడాల్సిందే! ఆహారం తినేటప్పుడు, టీవీ చూసేటప్పుడే కాదు...ఫోన్ మాట్లాడుతున్నా, మరే పనిచేసినా...గంటలు గంటలు కూర్చునే చేస్తున్నాం. ఇక నేటితరం ఉద్యోగినులయితే కదలకుండా ఎక్కువ గంటలు కూర్చుని పనిచేయడం సర్వసాధారణం అయిపోయింది. అయితే ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే బరువు పెరగడమే కాదు మరెన్నో అనారోగ్య సమస్యలూ ఇబ్బందిపెట్టొచ్చు. అవేంటో తెలుసుకుందామా!

అలా... కూర్చుంటే ఎలా..!

ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల సమస్యలు అని మనకి తెలుసు. అందుకే ఎన్నిగంటలు పనిచేయాల్సి ఉన్నా, ఏ పనిచేసినా....సరే! ఆ విషయాన్ని మరిచిపోవద్దు. మధ్యమధ్యలో లేచి నడవడం, చిన్న చిన్న స్ట్రెచెస్ చేయడం వంటివన్నీ బాధ్యతలా పెట్టుకోవాలి. ఇది ఆరోగ్యానికి సంబంధించిన విషయం కాబట్టి పనితో పాటు చిన్న చిన్న వ్యాయామాలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం ఇలా చేయండి.

కాసేపు నడిస్తే...

❖ గంటకోసారైనా కూర్చున్న చోటు నుంచి లేచి అటూ ఇటూ నాలుగడుగులు వేయాలి. ఇలా ఓ అయిదు నిమిషాలపాటు చేస్తే మేలు. అందుకోసమే ఈ మధ్య కొన్ని సంస్థలు స్టాండింగ్ డెస్క్‌లు రూపొందిస్తున్నాయి.

❖ ఇక ఫోను మాట్లాడేటప్పుడు సోఫాలోనో, కుర్చీలోనో కూర్చోవడం కంటే నడుస్తూ మాట్లాడటం మంచిది. టీ తాగాక, మధ్యాహ్నం భోజనం చేశాక, సాయంత్రం అల్పాహారం తీసుకున్నాక నేరుగా వచ్చి సీట్లో కూర్చోవద్దు. ఓ పదినిమిషాలైనా అటూ ఇటూ తిరగండి. దీనివల్ల జీర్ణశక్తి మందగించకుండా ఉంటుంది.

❖ ఇంట్లో ఉన్నా, ఆఫీసుకి వెళ్లినప్పుడైనా లిఫ్ట్‌కు బదులుగా మెట్లెక్కేయండి. అలానే బయట ఏ చిన్నపని ఉన్నా...బండిని వాడేబదులు నడిచి వెళ్లడానికే ప్రాధాన్యం ఇవ్వండి.

ఎక్కువ సేపు కూర్చుంటే...!

- రక్తపోటు పెరుగుతుంది.
- నడుము, పొట్ట, తొడలు, పిరుదల దగ్గర కొవ్వు పేరుకుపోతుంది.
- చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోతాయి.
- గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటివి వచ్చే ప్రమాదముంది.
- జీవక్రియల వేగం మందగిస్తుంది.
- అలసట, బడలికలతో శరీరం నిస్సత్తువగా మారుతుంది.
- శరీరాకృతిలో కూడా స్పష్టమైన మార్పు వస్తుంది.
- నడుము, వెన్ను సమస్యలు బాధిస్తాయి.
- ఒంటరితనం, ఆందోళన వంటి మానసిక సమస్యలు దరి చేరతాయి.

కుర్చీలో ఉండే చేయొచ్చు...


ఎక్కువ సేపు కూర్చుని పనిచేసేవారు ముందు కుర్చీలో నిటారుగా కూర్చోవడం అలవాటు చేసుకోండి. వెన్నెముక నిటారుగా లేకపోతే పొట్ట వస్తుంది. ఇక ఎక్కువగంటలు కూర్చోవలసి వచ్చినప్పుడు కొంత విరామం తీసుకుని కాళ్లు, చేతులు, మెడను సవ్య అపసవ్య దిశలో నెమ్మదిగా తిప్పాలి. ఇలా ఓ పది నుంచి పదిహేనుసార్లు చేస్తే సరి. ఇదే విధంగా భుజాలు, చేతుల్ని కూడా పైకి, కిందకు గుండ్రంగా, వ్యతిరేక దిశలో తిప్పడమూ చక్కటి వ్యాయామమే అవుతుంది.

◆ కుర్చీలో నిటారుగా కూర్చుని కుడి కాలుని నేల మీద ఆనించాలి. ఎడమ కాలి పాదాన్ని కుడి మోకాలికి ఆనించాలి. ఆ స్థితిలోనే ఉండి రెండు చేతులతో మోకాలిని, మడమని పట్టుకుని ముందుకి, వెనక్కి వంగాలి. ఇలా రెండు నిమిషాలు చేసి చేతులను పైకి ఎత్తాలి. కాసేపయ్యాక రెండో కాలిని కూడా కింద పెట్టి రెండు చేతులతో నేలను తాకే ప్రయత్నం చేయాలి. దీన్ని పీజియన్ పోశ్చర్ అంటారు. నడుం నొప్పి తగ్గుతుంది. వెన్ను గట్టిపడుతుంది. ఒత్తిడి వంటివి దూరం అవుతాయి. మూత్ర సంబంధ సమస్యలు అదుపులోకి వస్తాయి.

◆ కుర్చీలో కూర్చుని కాళ్లను ఏటవాలుగా చాపండి. ఆ తరువాత చేతులతో కాలి వేళ్లను పట్టుకునేందుకు ప్రయత్నించండి. ఇది తొడలకు చక్కటి వ్యాయామం. అయితే పొట్ట, తొడలకు సంబంధించిన వ్యాయామాల్ని చాలా జాగ్రత్తగా చేయాలి. లేదంటే మోకాళ్లనొప్పులతోపాటు ఇతర సమస్యలు ఎదురవుతాయి.

ఇవీ ముఖ్యమే..


పనిచేసేటప్పుడు నడుస్తున్నాం కదా అని దానికే పరిమితం అవ్వొద్దు. కేవలం అరగంటా, గంటకోసారి అటూ ఇటూ నడవడం వల్ల పూర్తి ప్రయోజనం ఉండదు. మీ దినచర్యలో ఇతర పనుల మాదిరిగానే వ్యాయామానికి కనీసం ఓ అరగంటైనా సమయం కేటాయించుకోవాలి. అలాని జిమ్‌కే వెళ్లక్కర్లేదు. ముందు నడకతో మొదలుపెట్టండి. కాస్త అలవాటు అయ్యాక వ్యాయామాలు చేయొచ్చు. మీ చుట్టూ ఉన్న వస్తువుల్నే వ్యాయామ సాధనాలుగా అంటే... నీళ్లసీసాలు, కర్ర, చున్నీ, తాడు... వంటివాటితోనూ రకరకాల వ్యాయామాలు చేయొచ్చు. ఉదాహరణకు చున్నీ లేదా తాడు వంటివాటి చివర్లు పట్టుకుని చేతుల్ని చాచడం, ఒకవైపు వంగి లేవడం వంటివి సులువుగా చేయొచ్చు. వాటిని కాళ్లకు ఆధారంగా చేసుకుని ఓ క్రమపద్ధతిలో పడుకోవడం, లేవడం వల్ల చేతులతోపాటు పొట్టకూ వ్యాయామం అందుతుంది. పొత్తికడుపు దగ్గర ఉన్న కండరాలు దృఢంగా మారతాయి. అలానే తాడాటా ఆడొచ్చు. దీనివల్ల బోలెడు కెలొరీలు కరుగుతాయి.



అభిమానికా యాదవ్
ఫిట్‌నెస్ నిపుణురాలు

● ఉదయం లేవగానే పడుకున్న చోటే ఉండి కొన్ని రకాల స్ట్రెచెస్, స్క్వాట్స్ ప్రయత్నించొచ్చు. వీటివల్ల విశ్రాంత స్థితిలో ఉన్న కండరాలు శక్తిని పొందుతాయి. శరీరం చురుగ్గా మారుతుంది. రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చు.

గృహిణులయితే పనులన్నీ అయ్యాక టీవీ ముందు కూర్చుంటారు. ఉద్యోగినులైతే అటు ఆఫీసులో ఎక్కువ సమయం పనితోనూ, ఇంటికి వచ్చాక ఫోన్లతోనూ కూర్చుంటారు. ఇలా ఎక్కువ సమయం కదలకుండా ఉండటం, శారీరక శ్రమ లేకుండా ఉన్నప్పుడూ ఊబకాయం ఎదురవుతుంది. దానివల్ల అనారోగ్య సమస్యలు తప్పకపోవచ్చుట. పైగా రోజులో ఎనిమిది గంటలకు పైగా కూర్చుని పనిచేసేవారి జీవితకాలం తగ్గుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆ లెక్కన పొగతాగడం వల్ల మరణించేవారితో పోలిస్తే ఊబకాయుల్లోనే మరణ రేటు ఎక్కువని పరిశోధనలు తేల్చాయి.



కళ్ల మేకప్ కనికట్టు చేసేలా...!



ముఖ అందాన్ని రెట్టింపు చేయడంలో కళ్లే కీలకం. అది సాధ్యం కావాలంటే కొద్దిపాటి అలంకరణ తప్పనిసరి. అలాంటి చిట్కాలే ఇవి.

● కళ్లు చిన్నగా ఉన్నా, పెద్దగా ఉన్నా అందాన్ని తెచ్చిపెట్టాలంటే కాటుక పెట్టుకోవాల్సిందే. అందుకోసం నాణ్యమైన ఐలైనర్‌ని ఎంచుకోవాలి. దీన్ని వాడేముందు కళ్ల చుట్టూ టిష్యూతో ఓసారి తుడవాలి. ఆపై ఐలైనర్‌తో అవుట్‌లైన్ గీసుకోవాలి. అలాని మరీ దూరంగా కాకుండా వీలైనంత వరకూ కనురెప్పలకు దగ్గరగా గీయడం వల్ల సహజంగా కనిపించొచ్చు. మీ వయసు, రంగుని బట్టి నలుపు, బ్రౌన్, గ్రే రంగుల్లో ఉండే ఐలైనర్‌లను ఎంచుకోవచ్చు.

● కళ్లకు మస్కారా వేసుకునేటప్పుడు కనురెప్పల కొలను నుంచి కొనల వరకూ గీయండి. అది ఆరక ముందే ఐలాష్ కర్లర్‌ని ఉపయోగించి వంపు తిప్పండి. పూర్తిగా ఆరిన తరవాత అలా చేస్తే కనురెప్పలకున్న వెంట్రుకలు రాలిపోతాయి.

● అలంకరణ అంతా అయ్యాకే ఐషాడో వాడాలి. ఇలా చేయడం వల్ల కళ్లు తాజాగా కనిపిస్తాయి. కళ్లు కలువ రేకుల్లా కనిపించాలంటే లేత రంగుల్లో ఉండే ఐషాడోని ఎంచుకోవాలి. కొన్నిసార్లు ముదురు రంగులు కూడా బాగుంటాయి. కళ్లను మరింత హైలైట్ చేస్తాయి.

....

అదేపనిగా... ఫోన్ చూస్తోంది!

? మా పాప ఎనిమిదో తరగతి చదువుతోంది. మంచి మార్కులే వస్తాయి కానీ... ఇప్పుడిప్పుడే తనలో కొన్ని మార్పులు చూస్తున్నా. అదేపనిగా ఫోన్ పట్టుకుంటుంది. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా, పండగా, ఫంక్షన్... ఎప్పుడయినా, ఎక్కడైనా ఫోన్‌లోనే మునిగిపోతుంది. దాన్ని పక్కనపెట్టమని చెప్పి, కోప్పడితే అలుగుతుంది. గట్టిగా అరిస్తే ఏడుస్తుంది. ఈ ఫోన్ ఛాటింగ్ నుంచి తనని ఎలా బయటపడేయాలో చెప్పండి.

- ఓ సోదరి



✔ పిల్లలకు, పెద్దలకు సమానంగా అలవాటవుతోన్న సరికొత్త వ్యసనమిది. చాలామటుకు పిల్లలు, యువత దీనికి బానిసలవుతున్నారు. రాన్రాను మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి. అమ్మానాన్నలిద్దరూ ఉద్యోగస్థులు కావడం, ఎప్పుడూ బిజీగా ఉండటం, అమ్మ ఇంట్లో ఉన్నా తన పనుల్లో తలమునకలై ఉండటం... లాంటి కారణాలతో తమని తాము ఒంటరిగా భావిస్తుంటారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్... ఇలా సోషల్ మీడియా ఏదైనా వాటితో కాలక్షేపం చేస్తున్నారు. కాబట్టి దాని వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి చెప్పి వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండాలి. ఫోన్, ఇంటర్నెట్, ఫేస్‌బుక్... పాస్‌వర్డ్‌లను ఎవరికీ ఇవ్వొద్దని చెప్పాలి. ఎవరైనా ఖాతాలో డబ్బులు వేయమని అడిగితే వేయకూడదని చెప్పాలి. ఫేస్‌బుక్ స్నేహితులుగా పరిచయమైన వ్యక్తులు బయట కలుస్తామంటే వెళ్లకూడదని చెప్పాలి. అసభ్యమైన ఫొటోలు పంపమని అడుగుతుంటే వారి నంబరును బ్లాక్ చేయమనాలి లేదా అమ్మానాన్నలకు చెప్పమనాలి. దీన్ని ఇంటర్నెట్ సభ్యత అంటారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎవరైనా ఏమైనా అంటారని దాచిపెట్టొద్దని చెప్పండి. మీరు కూడా ఎప్పటికప్పుడు వారిని గమనిస్తూ ఉండాలి. నిజం చెప్పాలంటే పిల్లలు పెద్దవారిని చూస్తూ నేర్చుకుంటారు. అందుకే ముందు మార్పు మీ నుంచే మొదలవ్వాలి.

ప్రతిరోజూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక అందరూ కలిసి కాసేపు కబుర్లు చెప్పుకోండి. మీరంతా కలిసి ఉన్నప్పుడు ఎవరూ ఫోన్ వాడొద్దనే నిబంధన పెట్టండి. వీలైతే ఇంటిల్లిపాదీ దగ్గర్లోని పార్కుకో, మరేదైనా ప్రాంతానికో వెళ్లండి. ఇలా అందరూ కలిసి ఉంటే మానవసంబంధాలు, అమ్మానాన్నలపై ప్రేమాభిమానాలతోపాటు గౌరవం కూడా పెరుగుతాయి. క్రమశిక్షణ అనేది ప్రతి విషయంలో అలవాటు చేయాలి. అది లేనప్పుడే రకరకాల దురలవాట్లకు లోనవుతుంటారు.

పిల్లలు అదేపనిగా ఫోన్‌ను చూస్తుంటే వారిని గట్టిగా అరవడం, కొట్టడం చేయవద్దు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు టీవీ/ఇంటర్నెట్ చూస్తున్నారనో వైర్ లేదా ఫోను లాగేయడం చేస్తుంటారు. ఇది సరికాదు. ఒక వయసు వచ్చాక పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి. ఫోన్ మాట్లాడనివ్వాలి. అయితే దానికంటూ ఓ కచ్చితంగా ఓ సమయం పెట్టాలి. టీనేజ్ అనేది కొంచెం పెంకిగా ఉండే వయసు. కాబట్టి మీ అమ్మాయితో ఓ స్నేహితురాలిగా మెలగండి. తల్లిగా మీరు చెప్పిన మాటే వినాలని అనుకోవద్దు. లౌక్యంగా వ్యవహరించాలి. సహనం అలవరుచుకోవాలి. మీ పాప చెప్పిన వెంటనే ఫోన్ వాడటం మానేస్తుందని ఆశించొద్దు. కొంచెం సమయం పడుతుంది.

డియర్ వసుంధర



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

నజరానా

ఆవాల పొడిని మొక్కల మొదళ్లలో వేస్తే తెగుళ్లు ఆశించకుండా ఉంటాయి.



పట్టుదలే పద్మ పెట్టుబడి

ఒకప్పుడు ఆమె కుట్టుపని నేర్చుకోవాలనుకుంది. అది నెరవేరకపోవడంతో గ్యాస్ పొయ్యి మరమ్మతు చేయడంలో శిక్షణ తీసుకుంది. సిలిండర్ రెగ్యులేటర్‌ను తీసి పెట్టాలంటేనే ఒకప్పుడు భయపడిన ఆమె... ఇప్పుడు ప్రముఖుల ఇళ్లల్లోనూ గ్యాస్ రిపేర్లు చేసే స్థాయికి ఎదిగింది. మహిళలు చాలా తక్కువగా అడుగుపెట్టే ఈ రంగంలోకి తోట పద్మ ఎందుకు, ఎలా వచ్చిందో తెలుసుకుందామా...

పద్మది గుంటూరు జిల్లా కేంద్రంలోని అరండల్‌పేట. కుట్టు మిషన్ నేర్చుకోవాలన్న తపనతో 1996లో అక్కడి శ్రామిక విద్యాపీఠంలో చేరింది. తీరా అక్కడికి వెళ్లాక... 'గుండీలు కుట్టాలి.. చేతి పని చేయాలి' అని చెప్పారు. అది ఆమెకు నచ్చలేదు. అదే కేంద్రంలో పురుషులకు గ్యాస్ పొయ్యి మరమ్మతు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. అది చూసి తానూ శిక్షణ పొందాలనుకుంది. ఆ నిర్వాహకులను అదే అడిగితే అక్కడున్న ఒక పెద్దాయన 'ఆడవాళ్లు విమానాలే నడుపుతున్నారు. గ్యాస్ స్టౌలను రిపేర్ చేయడం ఓ లెక్కా. ప్రయత్నించు...' అని ప్రోత్సహించారు. అలా ఆరునెలల పాటు శిక్షణ తీసుకుంది. కొన్నిరోజులకు స్థానికంగా ఉండే చర్చిలో పొయ్యి పాడయ్యిందని, బాగు చేయాలని పద్మను పిలిచారు. శిక్షణలో ఒక రకమైన పొయ్యిని బాగుచేయడం మాత్రమే నేర్పించారు. తీరా చర్చికి వెళ్తే మరో రకమైన పొయ్యి ఉండటంతో అయోమయానికి గురైంది. వెంటనే శిక్షణ ఇచ్చిన వ్యక్తికి ఫోన్ చేసి వెనక్కి వచ్చేసింది. అలా దాదాపు ఏడాదిన్నరపాటు ఆయన దగ్గర పూర్తిస్థాయిలో పనినేర్చుకుంది.

పని ఇవ్వమన్నారు...

పూర్తిస్థాయిలో మెలకువలు నేర్చుకున్నాక పద్మ చాలాచోట్ల పనికోసం ప్రయత్నించింది. ఎవరికి తన గురించి చెప్పినా 'నువ్వు ఆడపిల్లవు కదా.. ఏం చేస్తావులే' అని పని ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న బంధువు సహాయంతో నగరానికి వచ్చింది. అప్పటికే పద్మ భర్త ఫరూక్ హైదరాబాద్‌లో లారీ ట్రాన్స్‌పోర్టులో ఉద్యోగి. ఇక్కడకు వచ్చాక ఇద్దరు అమ్మాయిల్ని సహాయకులుగా పెట్టుకుని గ్యాస్‌స్టౌ ఫిర్యాదులు తీసుకునేది. సమస్య ఉందంటే తానే వెళ్లి బాగుచేసేది. అలా క్రమంగా వినియోగదారులు పెరిగారు. సినీ ప్రముఖులు మురళీమోహన్, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, ఈవీవీ సత్యనారాయణ, రాజశేఖర్ వంటివారి ఇళ్లల్లో గ్యాస్‌పొయ్యిలను రిపేర్ చేసింది. ఇలా నాలుగేళ్లు గడిచాయి. ఈలోగా అత్తయ్య బీబీలమ్మకు ఒంట్లో బాగోలేకపోవడంతో గుంటూరుకు వెళ్లింది. అక్కడ కొన్నాళ్లు ఉండాల్సి రావడంతో ఈ పనే అక్కడా చేయడం మొదలుపెట్టింది. తరువాత భారత్ గ్యాస్ ఏజెన్సీ వారు మహిళా మెకానిక్‌లు కావాలని పత్రికలో ప్రకటన ఇవ్వడంతో అందులో చేరింది. జీతం నెలకు రూ.2 వేలు. అయితే పిల్లల చదువును దృష్టిలో ఉంచుకొని మళ్లీ హైదరాబాద్ రావలసి వచ్చింది. తిరిగి వచ్చాక కొన్ని రోజులు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేసింది. ప్రస్తుతం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో మెకానిక్‌గా చేస్తోంది.



భయమే నేర్చుకునేలా చేసింది - పద్మ

ఒకప్పుడు గ్యాస్ రెగ్యులేటర్ తీసి పెట్టాలంటేనే భయపడేదాన్ని. గ్యాస్ మెకానిక్ పని నేర్చుకుంటానని చెప్పినప్పుడు ఇంట్లో వాళ్లు కూడా అడ్డు చెప్పలేదు. నేను నేర్చుకున్నాక చాలా మంది అమ్మాయిలకు తర్ఫీదు ఇస్తానని చెప్పినా ఎవరూ ముందుకు రావట్లేదు. సాధారణంగా ఈ పనిలో పురుషులే ఎక్కువ. నేను మహిళను కావడంతో చాలామంది సౌకర్యంగా భావిస్తుంటారు. నేను ఇరవై ఒక్కేళ్లుగా ఈ పని చేస్తున్నా. రోజూ సుమారుగా పది నుంచి పన్నెండు స్టౌలను మరమ్మతు చేస్తుంటా. ఇప్పుడు నా ఆదాయం కూడా కొంత పెరిగింది.

రఫుల్స్ అదుర్స్!

రఫుల్స్...
ఇప్పుడు అమ్మాయిల మనసు దోచుకుంటోన్న నయాట్రెండ్. అలాని ఇది దుస్తులకే పరిమితం అయిందనుకుంటే పొరబాటు. తాజాగా చెప్పుల్లోనూ ఈ రఫుల్స్ డిజైన్స్ సందడి చేస్తోంది. జీన్స్, జెగ్గింగ్, స్కర్ట్, ఫ్రాక్... ఇలా దేనిమీదకు ఎంచుకున్నా ఇవి స్టైలిష్ లుక్ తెచ్చిపెడతాయి. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని...



చదువు

విద్యార్థుల జీవితంలో పదో తరగతి పరీక్షలు చాలా ముఖ్యమైనవి. వీటిలో 10/10 జి.పి.ఎ. లక్ష్యంగా పెట్టుకుని చాలామంది కష్టపడి చదువుతున్నారు. శ్రద్ధగా పునశ్చరణ చేస్తున్నారు. ఈ లక్ష్యసాధన కష్టమనే అభిప్రాయం కొందరిలో ఉంది. ఇది అపోహ మాత్రమే. ప్రణాళిక ప్రకారం చదువుతూ.. విషయం అర్థం చేసుకుంటూ... దానిపై పట్టు సాధించటం దీనికి మొదటి మెట్టు. అలాగే రాయబోయే పరీక్షావిధానంపై అవగాహన పెంచుకోవాలి. ఆపై ఆత్మవిశ్వాసంతో, విజయంపై నమ్మకంతో పరీక్షలు రాస్తే అనుకూల ఫలితం తప్పకుండా సిద్ధిస్తుంది!



నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీ అగ్నిమాపకశాఖలో డ్రైవర్లు

ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖలో కింది పోస్టుల భర్తీకి రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: డ్రైవర్ ఆపరేటర్ **ఖాళీలు:** 85

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత. హెవీ మోటారు వాహన లైసెన్సు, నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి. **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: ఫిజికల్ మెజర్‌మెంట్స్, డ్రైవింగ్ టెస్టుల ఆధారంగా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్. దరఖాస్తులను సంబంధిత జిల్లా ఎస్పీ కార్యాలయాల నుంచి పొందవచ్చు.

దరఖాస్తుల విక్రయం: జనవరి 29 నుంచి ఫిబ్రవరి 6 వరకు.

దరఖాస్తుల స్వీకరణ: జనవరి 29 నుంచి ఫిబ్రవరి 7 వరకు.

వెబ్‌సైట్: http://slprb.ap.gov.in/

జమ్మూ సెంట్రల్ వర్సిటీ

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జమ్మూ కింది నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అసిస్టెంట్ ఇంజినీర్, లోయర్ డివిజన్ క్లర్క్, లైబ్రరీ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 19

అర్హత: పదో తరగతి, పన్నెండో తరగతి, సర్టిఫికెట్, ఐటీఐ, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, టైపింగ్ సామర్థ్యాలు, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్/ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **ఫీజు:** రూ.1,000.

చివరితేది: ఫిబ్రవరి 14 **వెబ్‌సైట్:** http://cujammu.ac.in/

ఎన్‌పీసీఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)... కర్ణాటక కైగా సైట్‌లో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అసిస్టెంట్, స్టెనో, సైంటిఫిక్ అసిస్టెంట్, సబ్ ఆఫీసర్ తదితరాలు.

పోస్టులు-ఖాళీలు: అసిస్టెంట్ (గ్రేడ్ 1)-13, స్టెనో (గ్రేడ్ 1)-07, స్టైపెండరీ ట్రైనీ-డెంటల్ టెక్నీషియన్-01, సైంటిఫిక్ అసిస్టెంట్ (మెకానికల్)-01, స్టైపెండరీ ట్రైనీ/ సైంటిఫిక్ అసిస్టెంట్-01, సబ్ ఆఫీసర్-బి-01. **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఫిబ్రవరి 4 నుంచి 19 వరకు. https://npcilcareers.co.in/

ప్రవేశాలు

పాండిచ్చేరి యూనివర్సిటీ

పాండిచ్చేరి యూనివర్సిటీ ఎంబీఏ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

➤ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్
1) ఎంబీఏ-118 సీట్లు 2) ఎంబీఏ (బిజినెస్ అనలిటిక్స్)-30 సీట్లు

➤ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ 3) ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్)-72 సీట్లు **దరఖాస్తుకు చివరితేది:** ఫిబ్రవరి 25 **గమనిక:** పూర్తి వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు. http://www.pondiuni.edu.in/

ఐఐఎఫ్‌ఎం, భోపాల్

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం) కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

1) పీజీ డిప్లొమా ఇన్ ఫారెస్ట్రీ మేనేజ్‌మెంట్ (పీజీడీఎఫ్ఎం)
2) పీజీ డిప్లొమా ఇన్ సస్టయినబిలిటీ మేనేజ్‌మెంట్ (పీజీడీఎస్ఎం) **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. క్యాట్-2018/ గ్జాట్-2019 స్కోరు ఉండాలి. **ఎంపిక:** క్యాట్-2018/ గ్జాట్-2019 స్కోరు, రాత ఆప్టిట్యూడ్ టెస్ట్ (డబ్ల్యూఏటీ), పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 20

వెబ్‌సైట్: http://iifm.ac.in/

నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్

హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్... కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **కోర్సు:** ఐవోటీ టెక్నీషియన్ (స్మార్ట్ అగ్రికల్చర్) **కాల వ్యవధి:** ఏడాది. **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 9

చిరునామా: ప్రిన్సిపల్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ విమెన్, విద్యానగర్, హైదరాబాద్-500 007.

వెబ్‌సైట్: http://atihyderabad.ap.nic.in/

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.netలో

నేటి ప్రతిభ పేజీల్లో

ఏపీపీఎస్సీ, ఎస్ఐ & కానిస్టేబుల్స్ పోటీ పరీక్షార్థులకు

■ కరెంట్ అఫైర్స్ ■ అరిథ్‌మెటిక్

పదిలో పదికి పది!

పరీక్షలు దగ్గరపడుతున్నపుడు ఏం చదవాలి? ఎలా చదవాలి? అనే సందేహాలు పదో తరగతి విద్యార్థులను ఆందోళనలకు గురిచేస్తుంటాయి. తగిన మెళకువలు పాటిస్తే వాటిని అధిగమించవచ్చు. శ్రమించే తత్వం, సన్నద్ధత చాలా ముఖ్యం. చదివేటప్పుడూ, రాసేటప్పుడూ 'ఇక చాలు' అనుకోకూడదు. ఇంకాస్త చదివితే మార్కులు పెరుగుతాయి, కొంచెం ఆలోచించి రాస్తే అర మార్కు సంపాదించవచ్చనే భావన పెంచుకోవాలి.

ప్రణాళిక: ఏ పని చేపట్టినా ఒక పద్ధతిని ఆచరిస్తే ఫలితం బాగుంటుంది. ప్రతి సబ్జెక్టుకూ కొంత సమయం కేటాయించాలి. ముఖ్యమైన ప్రశ్నలను గుర్తించి, వాటిని బాగా చదివి, చూడకుండా రాయాలి. రాని ప్రశ్నలను వదిలివేయకుండా మళ్ళీ ప్రయత్నించాలి.

ప్రశాంతత: పరీక్షలంటే భయపడితే చదివింది కూడా మర్చిపోయే ప్రమాదం ఉంది. వాటి గురించి భయపడాల్సిన అవసరమే లేదు. సన్నద్ధమయ్యేటప్పుడూ, పరీక్షలు రాసేటప్పుడూ కూడా ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండటం ఎంతో అవసరం. 'తప్పక సాధిస్తాను' అనుకోవాలి.

పునశ్చరణ: పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ ఇంతకుముందు చదివిన ప్రశ్నలనే పునశ్చరణచేస్తూ అవగాహన పెంచుకోవాలి. పరీక్షకు ముందు సబ్ హెడ్డింగ్స్, ముఖ్యమైన పాయింట్లు మాత్రమే చదవాలి. 1, 2, 4 మార్కుల ప్రశ్నలు, బహుళైచ్ఛిక ప్రశ్నలపై పట్టు సాధించాలి. ఛాయిస్ లేని 1/2, 1, 2 మార్కుల ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. రోజూ ఒకటి లేదా రెండు వ్యాసరూప ప్రశ్నలు రాయడాన్ని సాధన చేస్తే పరీక్షలో వేగంగా, తప్పులు లేకుండా విషయాన్ని వివరించవచ్చు. స్టడీ మెటీరియల్‌లోని ప్రశ్నలను ఇప్పటికే చాలావరకు చదివిఉంటారు. వాటిని మినహాయించి మిగతావాటిపై దృష్టి పెట్టండి. జవాబులను చదివేసమయంలో బిట్లుగా వచ్చే పాయింట్లను అండర్‌లైన్ చేసి ఉంచుకోండి. పరీక్షలు సమీపించినప్పుడు వాటిని పునశ్చరణ చేయండి.

చేతిరాత: పరీక్షల్లో చేతిరాతకు ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల దీనిపై శ్రద్ధ వహించాలి. ఒకవేళ మీ చేతిరాత బాగుండకపోతే ఆందోళన చెందాల్సిన పనిలేదు. దస్తూరి అందంగా ఉండటం ముఖ్యం కాదు; మీరు రాసింది దిద్దేవారికి అర్థం కావాలి. అందుకు పదానికీ పదానికీ మధ్య కాస్త ఖాళీ ఇవ్వండి. అలాగే ప్రతి రెండు వాక్యాల మధ్యా కొంచెం దూరం పాటించండి. అంతే!

ప్రశ్నపత్రం చదవాలి: పరీక్షల్లో విద్యార్థులంతా సాధారణంగా చేసే పొరపాటు- ప్రశ్నపత్రాన్ని సరిగా చదవకపోవడం. క్షుణ్ణంగా చదివితే ఎలా రాయాలి అనేదానిపై స్పష్టత ఏర్పడుతుంది. సమయపాలన తేలికవుతుంది.

మార్కులకు అనుగుణంగా: ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు ఏయే అంశాలను తప్పనిసరిగా రాయాలి అనే దానిపై విద్యార్థులకు స్పష్టత అవసరం. అడిగిన ప్రశ్నకు ఏ పాయింట్లు ఉంటే పూర్తి మార్కులు పొందుతారో తెలుసుకొని ఉండాలి. మొదట ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కులకు అనుగుణంగా తప్పనిసరిగా రాయాల్సిన అంశాల తర్వాతే, మిగతావి రాయటం మేలు.

అవసరముంటేనే అడిషనల్స్: అదనపు జవాబుపత్రాలను (అడిషనల్స్) అవసరంమేరకే తీసుకోండి. ఎక్కువ పేజీల్లో సమాచారం ఉంటే మంచి మార్కులు సాధించవచ్చుననేది అపోహే. జవాబు పత్రాల్లో అవసరానికి మించి ఖాళీలు వదిలి ఎక్కువ అడిషనల్స్ తీసుకోవద్దు. ఇలా చేస్తే మీ జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేవారికి విసుగ్గా అనిపించడంతోపాటు మీపై చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. ఎక్కువ పేజీలుంటే ఎక్కువ మార్కులు ఇస్తారని రాసిన జవాబునే మళ్లీ రాయవద్దు.

సమయ సద్వినియోగం: కొందరు పరీక్షలో సమయం చూసుకోకుండా రాస్తూనే ఉంటారు. ఇలాంటివారు తెలిసిన జవాబులు రాయకుండానే పేపర్ ఇచ్చేయాల్సి వస్తుంటుంది. అందుకని ఆయా ప్రశ్నలకు నిర్దేశిత సమయాన్ని మాత్రమే కేటాయించండి. మొదట మీకు వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి. మరిచిపోయిన జవాబులను చివరిలో ప్రయత్నించండి. ప్రశ్నల నంబరు వేయడం మరవకండి. జవాబుల్లో ఉపశీర్షికలు (సబ్‌హెడ్డింగ్స్) ఉంటే వాటిని అండర్‌లైన్ చేయాలి. ఉపశీర్షికలు లేని సమాధానాల్లోని పాయింట్స్‌లో ముఖ్యపదాలను అండర్‌లైన్ చేయండి. అదనపు (ఛాయిస్) ప్రశ్నలను ముందే రాయకండి. చివరిలో సమయం ఉంటేనే రాయండి.

అర్థమయ్యే చేతిరాత, క్రమబద్ధంగా రాసిన జవాబులు, ఉప విభాగాలు, ముఖ్యమైన పదాలను అండర్‌లైన్ చేయడం, మార్జిన్ వదలడం, ప్రశ్నపత్రం దిద్దేవారిని ఆకట్టుకుంటాయి. అన్ని జవాబులూ రాసిన తర్వాత, జవాబు పత్రాన్ని అంతా చదివి తప్పులుంటే సరిచేయండి.

సాంఘికశాస్త్రం




భూగోళశాస్త్ర పాఠ్యాంశాలను చదివేటప్పుడు భారతదేశ పటాన్నీ, చరిత్ర పాఠ్యాంశాలను చదివేటప్పుడు ప్రపంచపటాన్నీ దగ్గర పెట్టుకుని వాటికి సంబంధించిన అంశాలు వచ్చినప్పుడు పటాలను చూస్తూ చదవండి. ఒకసారి చదివితే ఏదీ రాదు. వచ్చేవరకూ చదవండి. బిట్స్ (బహుళైచ్ఛిక ప్రశ్నలు) బట్టీ పట్టవద్దు. డ్రిల్లింగ్ (ఒకరిని ఒకరు అడగటం) చేస్తే మేలు.

వ్యాఖ్యానించడం: 'ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి వ్యాఖ్యానించడం' అనే నైపుణ్యంలో ఇచ్చే పేరాను కొంతమంది ఉన్నది ఉన్నట్లు రాస్తున్నారు. ఇలా చేయకూడదు. పేరాను పూర్తిగా చదవండి. ప్రశ్నను అర్థం చేసుకోండి. దానికి సంబంధించిన అంశాలు మాత్రమే రాయండి. అభిప్రాయాలు అడిగినప్పుడు ఆ పేరాలోని అంశాలను ఆధారంగా చేసుకొని రాయండి. దీనికోసం పాఠ్యపుస్తకంలోని రెండు పేరాలను తీసుకుని సాధన చేయండి.

పట్టికలు, గ్రాఫ్‌లు, పటాలు: పాఠ్యపుస్తకంలో ఉన్న పట్టికలు, గ్రాఫ్‌లు, పటాలను పరిశీలించండి. ఆ పట్టిక మనకు ఏమి తెలియచేస్తుంది? సమాచారంలో మొదటి, చివరి స్థానంలో ఏం ఉన్నాయి? వాటి మధ్య తేడా ఏమిటి? ప్రత్యేకత ఏమిటి? పటాలైతే ఏ దిక్కులో ఏ దేశాలున్నాయి? భారతదేశపటంలో ఏ వైపు ఏ రాష్ట్రాలున్నాయి? మొదలైన ప్రశ్నలతో వాటిని పరిశీలనాత్మక ధోరణిలో చూడండి.

పట నైపుణ్యాలపై అవగాహన ఉంటే తక్కువ సమయంలోనే ఎక్కువ మార్కులు పొందవచ్చు. ఈ నైపుణ్యంలో మూడు విధాలుగా ప్రశ్నలు వస్తాయి. రాష్ట్రాలను, భారతదేశ చిత్తుపటాలను గీయమనడం; ప్రాంతాలను, దేశాలను గుర్తించమనడం; గుర్తించిన పటాన్నిచ్చి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయమనడం. ఈ మూడింటినీ సాధన చేయండి. ఈ సాధన ద్వారా సాంఘికశాస్త్ర పాఠ్యాంశాలను బట్టీపట్టకుండా అర్థం చేసుకోవచ్చు. దేశాలు, దీవులు, ఇతర ప్రాంతాలను కొన్ని ఆకారాల్లో (జంతువులు, పక్షులు, అక్షరాలు, అంకెలు) గుర్తుపెట్టుకుంటే వాటిని సులభంగా గుర్తించవచ్చు. మ్యాప్‌ను గుర్తించేటప్పుడు ప్రశ్న సంఖ్యను అక్కడ వేయకూడదు. గుర్తించిన చోట పేరు మాత్రమే రాయాలి. ఒకవేళ స్థలం లేకపోతే బాణం గుర్తువేసి రాయాలి. లేదా గుర్తించాల్సిన ప్రదేశంలో మ్యాప్‌పై సంఖ్యవేసి, ఎదురుగా పేరు రాయాలి.



సమకాలీన అంశాలు: ఈ నైపుణ్యంలో పాఠ్యపుస్తకంలో ఉన్న పాఠ్యాంశాలకు సంబంధించిన సమకాలీన అంశాలపై మాత్రమే ప్రశ్నలు వస్తాయి. ❖ మొదటి పేపర్‌లో- పాఠశాల విద్య, భ్రూణహత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, లింగ వివక్ష, మధ్యాహ్న భోజన పథకం, మురికి వాడలు, చౌకధరల దుకాణాలు, నీరు- అమ్మకాలు, నీటి కాలుష్యం, భూగర్భజలాలు, ప్రపంచీకరణ, పోషకాహారం, భూగోళం వేడెక్కడం, పర్యావరణ పరిరక్షణ, ఓజోన్‌పొర. ❖ రెండో పేపర్‌లో- ప్రపంచయుద్ధాలు, భారతదేశంతో ఇతర దేశాల సంబంధాలు, ప్రాజెక్టులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జాతీయ, ప్రాంతీయ పార్టీలు, నూతన రాష్ట్రాలు, జిల్లాల ఏర్పాటు, రాజ్యాంగ సవరణలు, సామాజిక ఉద్యమాలపై దృష్టిపెట్టండి.


బిట్‌పేపర్ రాసేటప్పుడు: బిట్‌పేపర్ ఇచ్చిన వెంటనే మెయిన్ పేపర్ రాయడం ఆపి బిట్‌పేపర్ పూర్తి చేయాలి. సమయం ఉంటే ఆ తర్వాత మెయిన్ పేపర్ రాయాలి. ❖ A, B, C, D లు బ్రాకెట్టులో రాసేటప్పుడు సరిగా రాయండి. జవాబులు తప్పు రాశామనుకుంటే దానిపై దిద్దవద్దు. తప్పు అనుకున్న దాన్ని పూర్తిగా కొట్టివేసి, అప్పుడు సరైన సమాధానం రాయాలి. అన్ని బిట్లనూ పూరించండి. ఒక్కోసారి ఏదైనా బిట్ తప్పుగా రావచ్చు. ఇలాంటివి అటెమ్ట్ చేస్తే మార్కు వస్తుందని మర్చిపోవద్దు.

- బొమ్మిడి నారాయణరావు

గణిత శాస్త్రం

నూరుశాతం మార్కులను కచ్చితంగా సాధించగలిగే సబ్జెక్టు గణితశాస్త్రం. దీనిలో విజయానికి వేగం, కచ్చితత్వం రెండూ తప్పనిసరి. ప్రశ్నలు పుస్తకంలోవి యథాతథంగా ఇవ్వకున్నా కొంత మార్పుచేసి ఇస్తారు. కాబట్టి లెక్కను ఒక్కటికి రెండుసార్లు చదివితే సమాధానం లభిస్తుంది. మల్టిపుల్ ఛాయిస్‌లో ఏ ఒక్క ప్రశ్ననూ వదిలిపెట్టకూడదు.

సమస్యలు సాధించేటపుడు ప్రతి ప్రశ్నకూ దత్తాంశం తప్పనిసరిగా రాయాలి. గ్రాఫ్ గీసేటపుడు పెన్సిల్‌తో గీయాలి. స్కేలు రాయాలి. నిర్మాణం చేసేటపుడు చిత్తుపటం గీయాలి. నిర్మాణక్రమం పూర్తిగా రాయాలి. ఈ విధంగా చేసేటప్పుడు 3 మార్కులలోపు సంపాదించుకోకపోయినా 10 జీపీఏ వస్తుంది. సెక్షన్, ప్రశ్న నంబరు స్పష్టంగా వేయాలి. ప్రతి ప్రశ్న పూర్తి కాగానే కింద మార్జిన్ కొట్టాలి.



★ మొదట 1 మార్కు ప్రశ్నలు 7 ఇస్తారు. వీటిని వరసగా రాస్తే బాగుంటుంది. ★ 2 మార్కుల ప్రశ్నల్లో సులభంగా ఉండే 3 ప్రశ్నలు మొదట ఎంచుకోవాలి. ★ 4 మార్కుల 4 ప్రశ్నలను అంతర్గత ఎంపిక ద్వారా ఇస్తారు. కనీసం 2 ప్రశ్నలను మొదటగా ప్రయత్నించి రాయాలి. ★ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల జవాబుల్లో కొట్టివేతలు, దిద్దివేతలు, రెండు సమాధానాలూ రాయకూడదు.

పేపర్-Iలో

■ మంచి మార్కులు సాధించాలంటే రెండు చరరాశులలో రేఖీయ సమీకరణాలు, సంగత సమీకరణాలు, అసంగత సమీకరణాలు, పరస్పర ఆధారిత రేఖీయ సమీకరణాలు, జతకు సంబంధించిన సమస్యలు, (గ్రాఫ్స్) బాగా సాధన చేయాలి. ■ సమితులు అధ్యాయం నుంచి 4 మార్కుల ప్రశ్న ప్రతిసారీ వస్తోంది. ముఖ్యంగా ఏ చాప్టర్‌కూ మార్కుల వెయిటేజి ఇవ్వడం లేదు. ఏ అధ్యాయంనుంచైనా విద్యాప్రమాణాల ఆధారంగా వెయిటేజి ఇస్తారు.

పేపర్-IIలో

మంచి మార్కులు సాధించాలంటే మొట్టమొదటిగా త్రికోణమితి అధ్యాయాన్ని బాగా సాధన చేయాలి. త్రికోణమితీయ నిష్పత్తులు, త్రికోణమితీయ సర్వసమీకరణాలకు సంబంధించిన సమస్యలు అభ్యాసం చేయాలి. ✦ తేలిగ్గా మార్కులు సాధించగలిగే సంభావ్యతలో పేకముక్కలు - సంభావ్యత, సంభావ్యత అనువర్తనాలకు సంబంధించిన సమస్యలు సాధన చేయాలి. ✦ సులువుగా ఉండే సాంఖ్యకశాస్త్రంలో 4 మార్కుల సమస్య తప్పకుండా వస్తుంది.

- పి.వేణుగోపాల్

పదోతరగతి సోషల్, మ్యాథ్స్ పరీక్షల్లో ముఖ్యమైన ప్రశ్నల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.



ఇది చర్చను రేపిన బడ్జెట్టు..

ఆర్థిక వ్యవస్థను కుంగదీస్తున్న కొన్ని సమస్యల్ని పరిష్కరించాల్సి ఉంది. దేశ విశాల హితం దృష్ట్యా- ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్ 'ఓట్ ఆన్ అకౌంట్'కు మించి ఉండొచ్చు

- అరుణ్‌జైట్లీ సంకేతాలు

మోదీ సర్కారు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడితే.. అది ఏడు దశాబ్దాలుగా పాటిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయాలు, నిబంధనల్ని దారుణంగా ఉల్లంఘించడమే. ఐదేళ్ల పదవీ కాలానికి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆరో ఏడాది పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎలా ప్రవేశపెడుతుంది?

- కాంగ్రెస్ మండిపాటు



- ఓట్ ఆన్ అకౌంటా? అంతకుమించా?
- జైట్లీ వ్యాఖ్యలతో విపక్షాలకు అనుమానం



బడ్జెట్ వచ్చేస్తోంది. ఇది 'తాత్కాలికానికి మించి' ఉండొచ్చన్న అరుణ్‌జైట్లీ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. 'బడ్జెట్ ఏడాది' మొత్తం అధికారంలో ఉండని ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను కాకుండా.. రెండు మూణ్నెల్ల కాలానికి ప్రభుత్వ ఖర్చుల కోసం 'ఓట్ ఆన్ అకౌంట్'ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. భారీ పథకాల ప్రకటన, పన్నుల్లో మార్పుల్లాంటివి ఓట్ ఆన్ అకౌంట్‌లో ఉండవు. ఆ సంప్రదాయానికి భిన్నంగా.. బడ్జెట్‌లో 'ఎన్నికల తాయిలాల'కు భాజపా సర్కారు ప్రణాళికలు వేస్తోందని విపక్షాలు మండిపడుతున్నాయి. నరేంద్రమోదీ సర్కారు ఇప్పటికే ఐదుసార్లు సాధారణ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, ఆరోసారి పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పణకు ఈ సర్కారుకు ప్రజామోదం లేదనేది విపక్షాల వాదన. ..ఇంతకీ ఈ చర్చకు కారణమైన 'ఓట్ ఆన్ అకౌంట్' అంటే ఏమిటి? దేన్ని తాత్కాలిక బడ్జెట్ అంటారు? పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎప్పుడు ప్రవేశపెడతారు? అనేవి ఆసక్తికర అంశాలు.

సంచిత నిధి అంటే...

ప్రభుత్వ రాబడుల మొత్తాల్ని జమచేసే నిధిని సంచిత నిధి అంటారు. సంచిత నిధి నుంచి ప్రభుత్వం డబ్బును వినియోగించుకోవాలంటే పార్లమెంటు ఆమోదం ఉండాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 266 నిర్దేశిస్తోంది.

తాత్కాలిక బడ్జెట్‌లో ప్రోత్సాహకాలు ఇవ్వొచ్చా?



ప్రత్యక్ష పన్నుల్లో ఏవైనా మార్పులు చేయాలంటే అది ఆర్థిక బిల్లు ద్వారా మాత్రమే సాధ్యం. ఆ మేరకు ఫైనాన్స్ బిల్లులో కేటాయింపుల్ని చూపాల్సి ఉంటుంది. ఆర్థిక బిల్లును తాత్కాలిక బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం కుదరదని, కొత్త పథకాలను వ్యయాల ప్రకటనలో చూపలేమని మాజీ ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హాలాంటి వారు అంటున్నారు. ఆర్థిక బిల్లులో పన్ను మార్పులు లేదా కొత్త పథకాల్ని ప్రవేశపెట్టడం ద్వారా వ్యయ ప్రకటనలు చేస్తే అది రాజ్యాంగ విరుద్ధమని సిన్హా అంటున్నారు. కేటాయింపుల్లేకుండా బడ్జెట్‌లో ప్రోత్సాహక ప్రకటనలు చేస్తే అది ఎన్నికల మేనిఫెస్టోలాగా ఉంటుందని చెబుతున్నారు. ప్రత్యక్ష పన్నుల్లో మార్పులుండవు కాబట్టి.. ఆదాయపు పన్నులో మినహాయింపులాంటి ఊరటను సగటు జీవి ఆశించడం వృథా. అయితే తాత్కాలిక బడ్జెట్‌లో పరోక్ష పన్నుల్లో స్వల్ప మార్పులు చేసే వెసులుబాటు ఉంటుంది. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి వచ్చిన తర్వాత- దీనికీ ప్రాధాన్యం లేకుండా పోయింది.

సంప్రదాయాన్ని ఆర్థికమంత్రి ఉల్లంఘిస్తారా?

ఎన్నికలకు వెళుతున్న ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్‌ను మాత్రమే ప్రవేశపెట్టడం రివాజు. కానీ అరుణ్‌జైట్లీ ప్రకటన తర్వాత- ఈ బడ్జెట్‌ను ఎన్నికల తాయిలాలకు వేదికగా ప్రభుత్వం మలుచుకుంటోందని, రైతులకు వరాలు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం అమలు, వేతన జీవికి పన్ను ఊరటలాంటి కొన్ని ప్రకటనల్ని చేయొచ్చని విపక్షాలు అనుమానిస్తున్నాయి. ఫిబ్రవరి 28వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్ సంప్రదాయాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీకి మార్చిన ఈ సర్కారు- ఓట్ ఆన్ అకౌంట్ సంప్రదాయాన్నీ ఉల్లంఘించొచ్చని విపక్షాలు అనుమానిస్తున్నాయి.

తాత్కాలిక బడ్జెట్ అంటే..



తాత్కాలిక బడ్జెను పూర్తిస్థాయి/తాత్కాలిక ప్రభుత్వం.. ఇలా ఎవరైనా ప్రవేశపెట్టొచ్చు. అయితే సాధారణ ఎన్నికలకు వెళుతున్న ఏడాదిలో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా ఒనగూడే రాబడులు, వ్యయాల పూర్తిస్థాయి సమాచారాన్ని ఈ తాత్కాలిక పద్దులో పొందుపరుస్తారు. అతిపెద్ద విధాన నిర్ణయాలు ఇందులో ఉండవు.

ఓట్ ఆన్ అకౌంట్ అంటే...

దీన్నీ తాత్కాలిక బడ్జెట్‌గానే పిలవొచ్చు. కాకపోతే చిన్నపాటి సాంకేతిక తేడా ఉంటుంది. తాత్కాలిక బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాలు.. ఈ రెండింటి ప్రస్తావన ఉంటుంది. 'ఓట్ అన్ అకౌంట్'లో ప్రభుత్వ ఖర్చుల గురించిన ప్రతిపాదనలు మాత్రమే ఉంటాయి. ప్రభుత్వం ఎన్నికలకు వెళుతున్న సంధి సమయంలో- తాత్కాలిక ఖర్చుల కోసం సంచిత నిధి నుంచి డబ్బును విత్‌డ్రా చేయడానికి పార్లమెంటు ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతిని 'ఓట్ ఆన్ అకౌంట్' అంటారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, రుణాలపై వడ్డీ చెల్లింపులు, రాయితీలు, పింఛన్లు.. ఇత్యాది ఖర్చుల కోసం ప్రభుత్వానికి పార్లమెంటు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. సహజంగా మూణ్నెల్ల కాలానికి అంటే కొత్త ప్రభుత్వం ఏర్పడి, పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు ఈ ఓట్ ఆన్ అకౌంట్ అమల్లో ఉంటుంది. ప్రత్యక్ష పన్నుల్లో మార్పులు చేసే అధికారం ఓట్ ఆన్ అకౌంట్‌కు ఉండదు. అందుకే కొత్త పథకాలు, పన్నుల్లో మార్పుల్లాంటి వాటిని ఓట్ అన్ అకౌంట్‌లో ప్రస్తావించరు. పైపెచ్చు ఎన్నికలకు ముందున్న ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆ తర్వాత ఏర్పడే ప్రభుత్వ ప్రాధాన్యతలు మరోలా ఉండొచ్చు. మొత్తం ఆర్థిక సంవత్సరం ఆదాయ వ్యయాల్ని ఎన్నికల కన్నా ముందుగానే అంచనావేసి.. దానిని బడ్జెట్‌లో చూపడం అసంబద్ధమవుతుంది.



పూర్తిస్థాయి బడ్జెట్ అంటే..

ఇది కేంద్ర ప్రభుత్వ వార్షిక ఆర్థిక పత్రం. రాజ్యాంగంలోని 112వ అధికరణం ప్రకారం ఏటా ఆదాయ, వ్యయాల అంచనా పత్రాన్ని పార్లమెంటుకు ఆర్థిక మంత్రి సమర్పించాల్సి ఉంటుంది. దీనినే వార్షిక ఆదాయ వ్యయ పత్రం(యాన్యువల్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్) అంటారు. సాధారణ బడ్జెట్ అని కూడా దీనిని పిలుస్తారు. మొత్తం వ్యయాన్ని ప్రభుత్వం ప్రణాళిక, ప్రణాళికేతర అని రెండు పద్దుల కింద విభజిస్తుంది. ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ ఒకటోతేదీలోగా ఫైనాన్స్ బిల్లు, అనుబంధ పద్దుల బిల్లును పార్లమెంటు ఆమోదించాల్సి ఉంటుంది.

- ఈనాడు ప్రత్యేక కథనం



దిల్లీలో ఆదివారం ఆంధ్ర అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, పక్కన సీవీసీ కేవీ చౌదరి

మాతృభాషను విస్మరిస్తే ఉనికి కోల్పోతారు

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: మాతృభాషను విస్మరిస్తే ఉనికి కోల్పోతారని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు భాషను భవిష్యత్తు తరాల కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. భాషను కాపాడుకోవడానికి సేవా సంస్థలు ముందుకు రావాలని సూచించారు. ఆదివారమిక్కడ ఆంధ్ర అసోసియేషన్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు హాజరైన ఆయన గోదావరి సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎక్కడికి వెళ్లినా మాతృభాషను విస్మరించకూడదని.. అలాగని భాషోన్మాదం ఉండకూడదన్నారు. వేషం, భాష వేరైనా మనమంతా భారతీయులం అని గుర్తుంచుకోవాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్, పళనిస్వామి, కుమారస్వామి, తాను.. ఎవరు కూడా చిన్నతనంలో కాన్వెంట్‌కు వెళ్లి చదువుకోలేదని పేర్కొన్నారు. ఆంగ్ల భాష వస్తేనే ప్రయోజకులవుతారన్న అజ్ఞానం వీడాలన్నారు. ఆంధ్ర అసోసియేషన్ స్థానికంగా ఉన్న తెలుగువారికే కాకుండా ఇతర భాష ప్రజలకు కూడా ఉపయోగపడుతోందన్నారు. మాతృభాషను వ్యాప్తి చేయడంలోనూ సంస్థ కృషి చేయాలన్నారు. ఆంధ్ర అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మణినాయుడు, కోటగిరి సత్యనారాయణ, సంస్థ కార్యనిర్వాహక సభ్యుల్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ కె.వి.చౌదరి మాట్లాడుతూ.. తెలుగు వారి సంస్కృతిని చాటి చెప్పడానికి ఆంధ్ర అసోసియేషన్ వేదికగా అనేక అభినందనీయ కార్యక్రమాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మట్టా పశుపతి, సలహా కమిటీ ఛైర్మన్ ఆలపాటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ సేనాని.. కాకి లక్ష్మారెడ్డి

సంతాప సభలో వక్తలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాటాన్ని సూర్యాపేట కేంద్రంగా మార్చటంలో కీలకపాత్ర పోషించిన గొప్ప వ్యక్తి కాకి లక్ష్మారెడ్డి అని అరుణోదయ సాంస్కృతిక మండలి, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ), సీపీఎం, విరసం నాయకులు విమలక్క, రంగారావు, జూలకంటి రంగారెడ్డి, పెద్ద విమల కొనియాడారు. దున్నేవానికే భూమి ఇవ్వాలని, సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని నిరంతరం పోరాడిన విప్లవ సేనాని లక్ష్మారెడ్డి అని పేర్కొన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ సమీపంలోని అమర్‌నగర్ గ్రామంలో కాకి లక్ష్మారెడ్డి సంతాప సభ నిర్వహించారు. కాకి లక్ష్మారెడ్డి ఆశయ సాధనకు కృషి చేసినపుడే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రజాగాయకుడు పైలం సంతోష్ రాసిన 'కత్తుల వంతెనపై కవాతు చేసిన లక్ష్మారెడ్డి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అయేషా కేసులో పోలీసులపై సీబీఐ దృష్టి

ఈనాడు, హైదరాబాద్: అయేషా మీరా కేసులో నిజాలు వెలికితీసేందుకు సీబీఐ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఈ కేసు దర్యాప్తు చేసిన పోలీసులను విచారించబోతోంది. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న బీఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా 2007 డిసెంబరు 26వ తేదీన హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసిన సత్యంబాబుకు స్థానిక న్యాయస్థానం జైలుశిక్ష విధించగా హైకోర్టు కొట్టివేసింది. నిందితుడిపై పోలీసులు మోపిన అభియోగాలపై పలు అనుమానాలు వ్యక్తం చేసింది. అసలు నిందితులను పట్టుకోవాలంటూ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఈ మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసిన సీబీఐ అధికారులు.. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే సత్యంబాబును సుదీర్ఘంగా విచారించారు. హత్యజరిగిన ప్రదేశాన్ని పరిశీలించడంతోపాటు సంబంధిత దస్త్రాలను సేకరిస్తున్నారు. ప్రజలు తమవద్ద ఉన్న సమాచారాన్ని పంచుకోవాలంటూ బహిరంగ ప్రకటన కూడా జారీ చేశారు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని, పోలీసులు కావాలని తనను ఇరికించారని సత్యంబాబు మొదటి నుంచీ ఆరోపిస్తున్నాడు. ఇటీవల తనను విచారించిన సీబీఐ అధికారులకు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాడు. దీంతో ఈ మొత్తం వ్యవహారంలో నిజానిజాలు తెలియాలంటే అప్పట్లో ఈ కేసు దర్యాప్తు నిర్వహించిన పోలీసులను విచారించాలని సీబీఐ అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఒక జాబితా సిద్ధం చేస్తున్నారు. ఘటన జరిగి దాదాపు 11 సంవత్సరాలు కావడంతో కొత్తగా ఆధారాలు సేకరించడం సీబీఐకి కష్టంగా మారింది. పైగా అప్పట్లో సేకరించిన ఆధారాలను ధ్వంసం చేయడంతో కేసు మరింత క్లిష్టంగా మారింది.

'తిరుమల'ను ఆదాయ వనరుగా చూడొద్దు

ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ ఐవైఆర్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తిరుమల పుణ్యక్షేత్రాన్ని ఆదాయ వనరుగా చూస్తున్నారని, ఆ ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. తిరుమల దేవుడు ప్రపంచ దైవమని, స్థానికతను ఆపాదించొద్దన్నారు. కాగా తొలుత స్థానిక దైవం కనుక వారినీ గౌరవించాలని, అందుకోసం అక్కడి ఆచార వ్యవహారాలపై చర్చ జరగాలన్నారు. రచయిత డా.దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి రాసిన 'గాడ్స్‌ఆన్ అర్త్ తిరుమల చరిత్ర' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐవైఆర్ కృష్ణారావు సభాధ్యక్షత వహించగా సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కృష్ణారావు మాట్లాడుతూ.. ఈ పుస్తకం చరిత్రగా రాశారని, దీన్ని ప్రామాణికంగా తీసుకొని ఇంకెవరైనా కొనసాగింపు చేస్తే అవి గొప్ప వారసత్వ సంపదగా ఉంటాయన్నారు. రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ఈ పుస్తకం భక్తి పారవశ్యంతో రాసింది కాదని శ్రీవారి పూర్వాపరాలు, దేవాలయ విశిష్టత, ఆలయం కట్టిన నాటి పరిస్థితులను క్లుప్తంగా రాశారని వివరించారు. ఆలిండియా రేడియో డైరెక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ పుస్తకాన్ని ఆంగ్లంలోనూ తర్జుమా చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. డా.దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ..తిరుమల విశిష్టతలను తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు.

ఎమ్మెల్సీనా.. ఎంపీనా..!

- స్వామిగౌడ్ పయనమెటు?
- 2నెలల్లో ముగియనున్న పదవీకాలం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై అస్పష్టత
- సీఎం నిర్ణయం కోసం ఎదురుచూపు
- మండలి ఛైర్మన్ పదవి పైనా చర్చ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ రాజకీయ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. వచ్చే మార్చిలో ఆయన ఎమ్మెల్సీగా పదవీ విరమణ పొందనుండగా మళ్లీ ఆ పదవి వరిస్తుందా? మరో ప్రత్యామ్నాయం ఉంటుందా అనే దానిపై అస్పష్టత నెలకొంది. 2013లో శాసనసమండలి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన 2014లో తెరాస అధికారంలోకి వచ్చిన తర్వాత శాసనమండలి ఛైర్మన్ పదవి పొందారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా ఆయన రాజేంద్రనగర్ టికెట్‌ను ఆశించినా దక్కలేదు. ప్రస్తుతం స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టభద్ర నియోజకవర్గానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. నాలుగు జిల్లాల్లో విస్తరించిన ఈ ఎన్నికల్లో పోటీ చేస్తే అంతటా తిరిగి ప్రచారం చేసి విజయం సాధించాలి. మండలి ఛైర్మన్ హోదాలో పనిచేసి అలా కష్టపడతారా అనేది సందేహంగా మారింది. ఆయన అభ్యర్థిత్వంపై చర్చ జరుగుతుండగా.. మరోవైపు ఈ ఎమ్మెల్సీ స్థానం కోసం పలువురు అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, కరీంనగర్ మేయరు రవీందర్‌సింగ్, గ్రూపు-1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, సరోజినిదేవి కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంటు రవీందర్‌గౌడ్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. స్వామిగౌడ్ మళ్లీ ఎమ్మెల్సీ కాకపోతే ఆయన ఛైర్మన్ పదవిలో కొనసాగే అవకాశం ఉండదు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల నుంచి ఎంపీగా పోటీ చేయాలని ఆయన అభిమానులు ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే భువనగిరిలో ఇదే సామాజిక వర్గానికి చెందిన బూర నర్సయ్యగౌడ్ ఎంపీగా ఉన్నారు. మళ్లీ ఆయనకే టికెట్ వచ్చే అవకాశం ఉంది. చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో గతంలో ఓసీ అభ్యర్థులు గెలిచారు. ఈసారి తెరాస తరఫున మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేశ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్వామిగౌడ్‌కు టికెట్ రావడంపైనా అనుమానాలు నెలకొన్నాయి.



సీఎం నిర్ణయమెలా ఉంటుందో

స్వామిగౌడ్ భవిష్యత్తును బట్టి శాసనమండలి ఛైర్మన్ పదవి ఆధారపడి ఉంది. స్వామిగౌడ్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి మళ్లీ పోటీ చేసినా లేదా గవర్నర్ కోటా లేదా శాసనసభ్యుల కోటా కింద ఎంపికైనా మండలి ఛైర్మన్‌గా కొనసాగుతారు. లేని పక్షంలో మరొకరు మండలి ఛైర్మన్ అవుతారు. ఇప్పటికే శాసనసభ మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డి పేరు పరిశీలిస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి తెరాసలో చేరిన ఆయన సీఎంకు సన్నిహితులయ్యారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మండలి ఛైర్మన్ చేయాలనుకున్నారు. ఇటీవల శాసనసభ స్పీకర్‌గా నిజామాబాద్ జిల్లాకు చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో అదే జిల్లాకు, అదే సామాజిక వర్గానికి చెందిన సురేశ్‌రెడ్డికి మండలి ఛైర్మన్ పదవి దక్కడం కష్టమయ్యే అవకాశం ఉంది. మరొకరిని మండలి ఛైర్మన్‌ను చేయడం కంటే స్వామిగౌడ్‌ను కొనసాగించాలనుకుంటే ఆయనను మళ్లీ ఎమ్మెల్సీ చేయాల్సి ఉంటుంది. చేవెళ్ల లేదా మల్కాజిగిరి ఎంపీ స్థానాల్లో ఒకదానికి బీసీ అభ్యర్థిని నిలపాలని సీఎం భావిస్తే స్వామిగౌడ్ పేరు పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది.



ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్నాతకోత్సవంలో డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ, సైయంట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

నాణ్యత, విలువలతోనే వ్యాపార వృద్ధి

- సైయంట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి

రాయదుర్గం, న్యూస్‌టుడే: వ్యాపారంలో విలువలు, నాణ్యత పాటించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సైయంట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆవిష్కరణలు సంస్థలకు డీఎన్ఏ లాంటివన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో అందుబాటులోకి వస్తున్న అవకాశాలను సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పీజీపీ మ్యాక్స్, పీజీపీ ప్రో, పీజీపీ ఎంఫ్యాబ్ కోర్సులు పూర్తిచేసుకున్న 222 మంది విద్యార్థుల స్నాతకోత్సవం ఆదివారం గచ్చిబౌలి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో నిర్వహించారు. మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. వ్యాపారాభివృద్ధి, సాంకేతికత ప్రాధాన్యం, ఆవిష్కరణలు, సైయంట్ సంస్థ ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు. 1990లో నలుగురు ఇంజినీర్లతో తన ఇంట్లోని డైనింగ్‌హాల్‌లో సంస్థ మొగ్గతొడిగిందని తెలిపారు. తమ సంస్థలో 1997లో పెట్టిన ఒక రూపాయి పెట్టుబడి ప్రస్తుతం 500 రెట్లకు పెరిగిందని చెప్పారు. విలువలు, ప్రమాణాలు, నాణ్యతే పునాదిగా సంస్థను ఏర్పాటు చేశామన్నారు. ఐఎస్‌బీ డీన్ రాజేంద్ర శ్రీవాత్సవ మాట్లాడుతూ.. యువత సవాళ్లను స్వీకరించేందుకు వెనుకంజ వేయకూడదని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సలహాదారు, ఐఎస్‌బీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రహ్మణియన్ మాట్లాడుతూ.. బోధించడం ద్వారా విద్యార్థుల నుంచి గురువులూ ఎంతో నేర్చుకుంటారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన పలువురికి పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి విద్యార్థులు కుటుంబసభ్యులతో హాజరై సందడి చేశారు.

మత ఘర్షణలు పోయి.. మంచి రోజులొస్తాయ్

- స్త్రీ, పురుషులు అందరూ సమానమే
- ప్రముఖ నటి, రచయిత షబానా అజ్మీ
- ముగిసిన హైదరాబాద్ సాహిత్య పండుగ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దేశంలో మత, వర్గ ఘర్షణలు పోయి త్వరలోనే మంచి రోజులు వస్తాయని ప్రముఖ నటి, రచయిత షబానా అజ్మీ పేర్కొన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కొందరు ఇలాంటి గొడవలు సృష్టిస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా చీకటి పోయాక.. వెలుగు రాక తప్పదని స్పష్టం చేశారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 9వ హైదరాబాద్ సాహిత్య పండుగ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో షబానా తనతండ్రి, ప్రముఖ రచయిత కైఫీ అజ్మీపై రాసిన "కైఫీయాత్" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సామాజిక సమస్యలపై అవగాహన ఉన్న కైఫీఅజ్మీ 11 సంవత్సరాల వయసులోనే కవితలు రాయడం మొదలు పెట్టారన్నారు. ఆయన, తల్లి షౌకత్ అజ్మీ(నటి) స్ఫూర్తితోనే తానీ స్థాయికి ఎదిగానని, సమాజసేవలోనూ వారినే ఆదర్శంగా తీసుకున్నానని వివరించారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు సరికాదని, సమాజంలో అందరినీ సమానంగా చూసే రోజులు రావాలన్నారు. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సాగుతున్న 'మీటూ' ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. అంతకు ముందు "మన డబ్బు ఎంత వరకు సురక్షితం" అనే అంశంపై రచయిత, ఆర్థికవేత్త వివేక్‌కౌల్ మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకుల్లో జమ చేసిన సొమ్ముకు ఆర్‌బీఐ రక్షణ ఉంటుందన్నారు. పాలసీలు, డబ్బును పొదుపు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నోట్లరద్దు విఫల చర్య అని, మోదీ తనకు ఎదురుపడితే దానిపై నిలదీస్తానన్నారు. అనంతరం ప్రముఖ రచయిత గురుచరణ్ దాస్ తాను రచించిన "కామా:ద రైడిల్ ఆఫ్ డిసైర్" అనే పుస్తకం గురించి వివరించారు. మనం సంతోషంగా ఉండాలంటే చేసే పనిని, మనతో ఉండే వ్యక్తులను ప్రేమించాలన్నారు. భారతీయులకు చాలా లక్ష్యాలు ఉంటాయని, వాటన్నింటినీ సమత్యులంగా చూసినప్పుడే ఆనందంగా ఉండగలమని.. దీనిని అలవర్చుకోవాలని సూచించారు. తన రచనలలో ధర్మ, అర్థ, కామ, మోక్షాల గురించి, వాటి ప్రాధాన్యాన్ని వివరించానన్నారు.




హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సాహితీ ఉత్సవంలో ప్రముఖ రచయిత్రి షబానా అజ్మీతో సెల్ఫీ తీసుకుంటున్న మహిళలు

పీవీది రాజకీయ చాతుర్యం..


మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాజకీయ చాతుర్యం తెలిసిన నేత అని పీవీ జీవితంపై పుస్తకం రాసిన వినయ్ సీతాపతి పేర్కొన్నారు. "ద అన్‌లైక్లీ ప్రైమ్ మినిస్టర్" అంశంపై ఆయన మాట్లాడారు. బాబ్రీ మసీదు దుర్ఘటన సమయంలో దేశ ప్రధానిగా ఉన్న పీవీ నిస్సహాయ స్థితిలో ఉన్నారే తప్పితే.. విధి నిర్వహణలో విఫలం కాలేదన్నారు. ఆయన తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు భారత దేశ చరిత్రలో మైలురాళ్లుగా మిగిలిపోయాయన్నారు. నెహ్రూ, గాంధీ కుటుంబం ఆయన్ని రాష్ట్ర నేతగానే పరిగణించిందే తప్ప ఏనాడూ జాతీయ స్థాయి గౌరవం ఇవ్వలేదన్నారు.

ప్రశ్నిస్తేనే.. మార్పు సాధ్యం: మల్లికా సారాబాయ్



ప్రజలు కలసికట్టుగా గొంతెత్తి ప్రశ్నించినప్పుడే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమవుతుందని ప్రముఖ నృత్యకారిణి, కొరియోగ్రాఫర్ మల్లికా సారాబాయ్ అన్నారు. ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య పండుగ ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలో ఏ మార్పయినా ప్రజలు కలసి ఉన్నప్పుడు వచ్చిందేనన్నారు. కానీ నేటి సమాజంలో స్వార్థప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ.. మానవత్వాన్ని మరిచిపోతున్నామని వాపోయారు. ఉపకారం ఆశించకుండా ఇతరులకు సాయం చేసినప్పుడే మనసుకు తృప్తి లభిస్తుందనే విషయాన్ని ప్రజలుగుర్తించాలన్నారు. పిల్లలను విధేయంగా పెంచాలనే ఉద్దేశంతో వారిలో ప్రశ్నించే గుణాన్ని అణచివేయడం సరికాదన్నారు. స్త్రీ పురుషుల్లో సమానత్వం రావాలన్నా, ప్రజల బతుకులు మారాలన్నా కలసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

35650 కింద మరిన్ని నష్టాలు



సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్లలో అప్రమత్తత, పెద్ద కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆకట్టుకోకపోవడంతో గత వారం సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా చూస్తే. . అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నిలిపివేసున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ప్రపంచ మార్కెట్లు రాణించాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ వృద్ధి అంచనాలను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తగ్గించడం, అమెరికా- చైనా వృద్ధి భయాలకు వెనెజులా సంక్షోభం తోడవ్వడం ప్రతికూల ప్రభావం చూపాయి. వచ్చే రెండేళ్లు ప్రపంచంలో వేగవంతమైన వృద్ధి సాధించే దేశంగా భారత్ నిలుస్తుందని ఐఎఫ్ఎం ఆశాభావం వ్యక్తం చేసింది. నగదు లభ్యత పెంచేందుకు రూ.10,000 కోట్ల విలువైన బాండ్ల బైబ్యాక్ చేపట్టనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1 శాతం తగ్గి 36,026 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 1.2 శాతం నష్టంతో 10,781 పాయింట్ల దగ్గర స్థిరపడింది. వాహన, విద్యుత్, లోహ షేర్లు డీలాపడగా, చమురు- గ్యాస్, ఆరోగ్య సంరక్షణ, ఐటీ స్క్రిప్‌లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.559 కోట్ల షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.1263 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:7గా నమోదు కావడం.. చిన్న, మధ్య శ్రేణి షేర్లలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } 36750- 37150 పాయింట్ల శ్రేణిలో బలమైన నిరోధం కావడంతో గత వారం మార్కెట్లు నష్టపోయాయి. సమీపకాలంలో ఈ శ్రేణి గట్టి నిరోధంగా నిలవనుంది. మార్కెట్లు 35650- 35750 పాయింట్ల శ్రేణి దిగువకు చేరితే.. స్వల్పకాలంలో మరింత దిద్దుబాటుకు గురికావొచ్చు.


ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, సాధారణ బడ్జెట్, కంపెనీల త్రైమాసిక ఫలితాలు, జనవరి డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. ఫిబ్రవరి 1న వెలువడనున్న బడ్జెట్ సమీపకాలంలో మార్కెట్లకు దిశానిర్దేశం చేయనుంది. బడ్జెట్‌లో నిర్ణయాలకు అనుగుణంగా రంగాలు, షేరు ఆధారిత కదలికలు చోటుచేసుకోవచ్చు. మూడో త్రైమాసిక కంపెనీల ఫలితాలు, సమీపకాలంలో మార్కెట్లకు కీలకం కానున్నాయి. ఈ వారం ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ, భారతీ ఎయిర్‌టెల్, హీరో, దివీస్ ల్యాబ్స్, టైటన్, బజాజ్ ఆటో, బీఓబీ, ఎల్ఐసీ హౌసింగ్, డాక్టర్ రెడ్డీస్ వంటి దిగ్గజ సంస్థలు త్రైమాసిక ఫలితాలు వెలువరించనున్నాయి. 31న డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కోవచ్చు. ముడిచమురు ధరలు, డాలర్‌తో రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. ముందస్తు ఎన్నికల సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ప్రభావంతో మార్కెట్లకు హెచ్చుతగ్గులు తప్పకపోవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా- చైనా వాణిజ్య పరిణామాలు, వెనెజులా సంక్షోభం, బ్రిటన్ రాజకీయ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపొచ్చు. చైనా, భారత్, అమెరికా, జపాన్ పీఎంఐ తయారీ గణాంకాల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,691, 35,382, 35010;
తక్షణ నిరోధ స్థాయిలు: 36,280, 36,521, 36,750

మార్కెట్లు 35650- 35750 పాయింట్ల శ్రేణి దిగువకు చేరితే.. స్వల్పకాలంలో బలహీనతలు కొనసాగే అవకాశం ఉంది.

– *సతీశ్ కంతేటి, జెన్ మనీ*

ఈనాడు బిజినెస్



కోడిగుడ్లు

27న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)			
హైదరాబాద్	402	వరంగల్	404
చిల్లరగా (ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	410
బెంగళూరు	425	చెన్నై	430
28వ తేదీకి...		చిత్తూరు	423
విజయవాడ/గోదావరి	408	నమక్కల్	420

బడ్జెట్‌తో పాటే మార్కెట్టూ!

- డెరివేటివ్ కాంట్రాక్టుల గడువూ కీలకమే • ఊగిసలాటలు తప్పవు • 17 నిఫ్టీ కంపెనీల ఫలితాలు ఈ వారమే
- ఔషధ షేర్లు రాణించొచ్చు • వాహన స్క్రిప్‌లు నష్టపోవచ్చు • ఆర్థిక మంత్రితో నేడు బ్యాంక్ అధిపతుల సమావేశం

స్టాక్ మార్కెట్ ఈ వారం

రాబోయే కొద్ది రోజుల పాటు మార్కెట్లు ఊగిసలాటకు గురవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కార్పొరేట్ ఫలితాలు, ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌తో పాటు జనవరి డెరివేటివ్ కాంట్రాక్టుల సిరీస్‌లకు గురువారం గడువు కావడమూ ఇందుకు కారణమవుతాయని చెబుతున్నారు. నిఫ్టీ-50లో భాగమైన జీ ఎంటర్‌టైన్‌మెంట్‌లో కార్పొరేట్ పాలనా సమస్యలు తలెత్తడం మార్కెట్‌పై ప్రభావం చూపొచ్చు. నిఫ్టీ-50కి 10,850 పాయింట్ల వద్ద నిరోధం ఎదురుకావొచ్చని; 10600 పాయింట్ల వద్ద మద్దతు లభించవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. నిఫ్టీ సూచీలోని 17 కంపెనీలు ఈ వారమే ఫలితాలు వెల్లడించనున్నాయి. రైతులను సంతృప్తి పరచడానికి ఎన్నికల ముందు ప్రధాని మోదీ ముందున్న 'చివరి అవకాశం' ఈ బడ్జెట్టే కనుక, మార్కెట్ సునిశితంగా పరిశీలించనుంది. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు, బ్రెగ్జిట్, అమెరికా ప్రభుత్వ కార్యకలాపాల పరిణామాల నుంచి కూడా సూచీలు సంకేతాలందుకోవచ్చు.

- **బ్యాంకు**లకు బడ్జెట్‌లో పథకాలు కానీ మూలధనం కానీ లభించవచ్చన్న అంచనాలున్నాయి. ఈ వారం ప్రకటించబోయే 11 బ్యాంకుల ఫలితాలూ కీలకం కానున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఫలితాలు సానుకూలంగా నమోదు కావొచ్చు. అయితే చందాకొచ్చర్‌పై సీబీఐ కేసు నమోదు కావడంపై మదుపర్లు దృష్టి సారించే అవకాశం లేకపోలేదు. నేడు (సోమవారం) ప్రభుత్వ రంగ బ్యాంకులతో ఆర్థిక మంత్రి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం తీసుకునే నిర్ణయాలు కూడా ప్రభావం చూపుతాయి.
- పర్సిస్టెంట్ సిస్టమ్స్(సోమ), హెక్సావేర్ టెక్నాలజీస్(బుధ) ఫలితాలపై **ఐటీ** రంగం కన్నేయవచ్చు. శుక్రవారం నాటి బడ్జెట్ ప్రభావం ఐటీ షేర్లపై పెద్దగా ఉండకపోవచ్చు.
- **సిమెంటు** కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి కదలాడొచ్చు. బడ్జెట్, ఫలితాలను బట్టి ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కనిపించొచ్చు. జనవరి-మార్చి; ఏప్రిల్-జూన్‌లలో సిమెంటు గిరాకీ స్తబ్దుగా ఉండొచ్చన్న అంచనాలున్నాయి. రామ్‌కో సిమెంట్స్ ఫలితాలను మదుపర్లు గమనించవచ్చు.
- **యంత్ర పరికరాల** రంగ షేర్లు చాలా వరకు లాభాలు అందుకోవచ్చు. ఎల్ అండ్ టీ బలమైన ఫలితాలకు తోడు, ఆర్డర్లపై ఆ కంపెనీ ఆశావహ దృక్పథం ఇందుకు దోహదం చేయవచ్చు. బడ్జెట్ ప్రకటనలు కూడా ఈ రంగ షేర్ల చలనాలకు కారణం కావొచ్చు.
- **వాహన** రంగ షేర్లు ఈ వారం నష్టాల పాలయ్యే అవకాశం ఉంది. మారుతీ సుజుకీ బలహీన ఫలితాలు ఇందుకు నేపథ్యం. హీరో మోటోకార్ప్ ఫలితాల నుంచి ద్విచక్ర వాహన తయారీ కంపెనీల షేర్లు సంకేతాలు అందుకుని రాణించొచ్చు. జనవరి విక్రయ గణాంకాలు, ఫిబ్రవరి 1న వెలువడతాయి.
- గురువారం వెలువడే భారతీ ఎయిర్‌టెల్ ఫలితాలు **టెలికాం** రంగ షేర్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. ముఖ్యంగా టారిఫ్‌లపై కంపెనీ చేసే వ్యాఖ్యలు కీలకం కానున్నాయి.
- అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కంపెనీల షేర్లన్నీ చాలా తక్కువ శ్రేణికి లోబడి చలించొచ్చు. బుధవారం ఫలితాలను ప్రకటించబోయే ఐఓసీపై మార్కెట్ దృష్టి సారించవచ్చు. **చమురు** రంగ షేర్ల కదలికల కోసం ముడి చమురు ధరలు, రూపాయి కదలికలను గమనించొచ్చు.
- **ఔషధ** రంగ కంపెనీల షేర్లు ఈ వారం లాభాలు కొనసాగించొచ్చు. మదుపర్లు ఎంపిక చేసిన షేర్ల ఆధారంగా ట్రేడింగ్ చేయొచ్చు.
- ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో రైతుల కోసం ప్రోత్సాహకాలు ఇస్తుందన్న అంచనాల మధ్య **ఎఫ్‌ఎమ్‌సీజీ** షేర్లు రాణించే అవకాశం ఉంది.
- **లోహ, గనుల** కంపెనీల షేర్లలో ప్రతికూలతలు కొనసాగొచ్చు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు ఇందుకు నేపథ్యం.

ఫార్మా	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	786.15	801.60	772.30
సిప్లా	507.65	513.10	498.60
డాక్టర్ రెడ్డీస్	2672.40	2715.10	2624.10
గ్లెన్‌మార్క్ ఫార్మా	646.90	663.20	632.50
లుపిన్	865.05	890.80	842.20
సన్‌ఫార్మా	422.40	434.20	413.40

ఎఫ్‌ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా	3206.65	3300.20	3146.30
కోల్గేట్ పామోలివ్	1288.30	1346.60	1249.80
డాబర్ ఇండియా	430.00	442.50	422.00
హెచ్‌యూఎల్	1756.80	1790.60	1733.10
ఐటీసీ	279.20	284.30	275.90
మారికో	369.90	379.50	362.90

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	204.45	209.90	200.50
హిందుస్థాన్ కాపర్	46.25	48.40	44.80
హిందుస్థాన్ జింక్	250.40	263.30	241.60
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	274.65	290.10	265.60
టాటా స్టీల్	452.90	471.20	442.00
వేదాంతా	194.70	198.40	190.70

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2096.00	2118.70	2078.70
ఐసీఐసీఐ బ్యాంక్	357.20	368.90	348.70
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	47.05	47.60	46.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1484.90	1526.00	1457.70
పీఎన్‌బీ	76.60	82.20	73.10
ఎస్‌బీఐ	285.40	294.30	278.70

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	969.40	993.30	934.10
ఇన్ఫోసిస్	730.35	744.50	717.20
టీసీఎస్	1920.80	1952.90	1884.90
టెక్ మహీంద్రా	729.05	740.60	718.20
విప్రో	353.45	363.60	342.90

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	66.40	70.80	63.90
సీజీ పవర్	37.50	41.20	34.40
ఎల్ అండ్ టీ	1285.45	1326.30	1261.10
థెర్మాక్స్	1130.55	1165.10	1081.80
సీమెన్స్	1029.75	1056.90	1005.90

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హీరో మోటోకార్ప్	2670.15	2839.90	2567.80
ఎం అండ్ ఎం	683.50	711.80	666.80
మారుతీ సుజుకీ	6513.40	7408.50	5962.50
టాటా మోటార్స్	173.25	181.70	167.80
టీవీఎస్ మోటార్	496.10	530.20	475.60

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	307.50	317.20	297.20
ఆర్‌కామ్	12.45	13.20	12.00
రిలయన్స్ ఇండస్ట్రీస్	1,246.00	1,167.20	1,120.50
వొడాఫోన్ ఐడియా	32.85	35.10	31.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	357.45	363.00	352.30
హెచ్‌పీసీఎల్	241.80	251.30	235.70
ఇండియన్ ఆయిల్	137.75	139.80	135.80
ఓఎన్‌జీసీ	142.00	145.50	139.90
ఆయిల్ ఇండియా	171.85	175.80	168.40

ఈ వారం బోర్డు సమావేశాలు

నేడు: టాటా పవర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, సియట్, సెంచురీ టెక్స్‌టైల్స్, చెన్నై పెట్రో, ఎస్కార్ట్స్, గోద్రెజ్ ప్రాపర్టీస్, ఆర్‌బీఎల్ బ్యాంక్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్, వొకార్డ్ ఫార్మా

రేపు: హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా కాఫీ, భారత్ ఫైనాన్షియల్, సెరా, గ్రాన్యూల్స్, ఓబీసీ, రామ్‌కో సిమెంట్, రామ్‌కో ఇండస్ట్రీస్, టీమ్‌లీజ్ సర్వీసెస్

30న: ఐఓసీ, ఎన్‌టీపీసీ, బజాజ్ ఆటో, బజాజ్ హోల్డింగ్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, క్యాస్ట్రాల్ ఇండియా, బ్లూడార్ట్, ధమ్‌పూర్ షుగర్స్, హెరిటేజ్ ఫుడ్స్, హెక్సావేర్ టెక్నాలజీస్, ఐసీఐసీఐ బ్యాంక్, జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్, కోల్టే-పాటిల్ డెవలపర్స్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, టాటా కమ్యూనికేషన్స్

31న: హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, వేదాంతా, యూపీఎల్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, ఎన్ఎండీసీ, చంబల్ ఫెర్టిలైజర్స్, డాబర్, దేనా బ్యాంక్, ఇమామి, లారస్ ల్యాబ్స్, పెట్రోనెట్, వీగార్డ్

1న: ఎస్‌బీఐ, డాక్టర్ రెడ్డీస్, టైటన్, బర్జర్ పెయింట్స్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, ఈఐడీ ప్యారీ, ఈక్విటాస్ హోల్డింగ్స్, జీఐసీ హౌసింగ్ ఫైనాన్స్, జుబిలెంట్ లైఫ్‌సైన్సెస్, సుందరం ఫాజనర్స్, థామస్‌కుక్

2న: దివీస్ ల్యాబ్స్, జిందాల్ స్టీల్, బీఈఎంఎల్, సెంట్రల్ బ్యాంక్, జేకే సిమెంట్, పరాగ్ మిల్క్ ఫుడ్స్

రూ.3.73 లక్షల కోట్లకు మీడియా, వినోద పరిశ్రమ

- 2022 నాటికి: అసోచామ్-పీడబ్ల్యూసీ



దిల్లీ: దేశీయ మీడియా, వినోద పరిశ్రమ 2022 నాటికి 52,683 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3.73 లక్షల కోట్లు) స్థాయికి చేరొచ్చని అసోచామ్-పీడబ్ల్యూసీ సంయుక్తంగా రూపొందించిన నివేదిక అంచనా వేసింది. ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరగడం, జనాభా అధికమవడం, వివిధ విభాగాల్లో కంటెంట్ వినియోగం ఎక్కువవడంతో మీడియా, వినోద పరిశ్రమ మంచి వృద్ధి సాధించొచ్చని పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం..

- సంప్రదాయ టీవీ, సినిమా మీడియాతో పాటు కొత్త తరం ఓటీటీ (ఓవర్-ది-టాప్) డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల సేవలు ఈ రంగం వృద్ధికి ఎంతో తోడ్పడతాయి. 2022 నాటికి భారతీయ వీడియో ఓటీటీ మార్కెట్ 823 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,363 కోట్లు) స్థాయికి చేరుకుని అంతర్జాతీయంగా, తొలి 10 స్థానాల్లో నిలుస్తుంది.
- 2017లో మీడియా, వినోద రంగం 30,364 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. అక్కడి నుంచి 11.7 శాతం వార్షిక వృద్ధితో 2022 నాటికి 52,683 మిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుంది. ఈ క్రమంలో టీవీ, సినిమా, ఓటీటీ నుంచే 46 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. సంప్రదాయ మీడియా రంగం, ఓటీటీ సంస్థలు రాబోయే కాలంలో ఆకర్షణీయ వృద్ధి నమోదు చేస్తాయి.
- ఓటీటీ సేవలను ప్రవేశపెట్టడంతో వీడియో ఆన్ డిమాండ్ (వీఓడీ) అనేది మీడియా పరిశ్రమలో విధ్వంసకారిగా మారనుంది. సంప్రదాయ స్టూడియోల బడ్జెట్‌తో పోటీ పడుతూ నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వంటివి భారీ పెట్టుబడులు పెడతాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఓటీటీ మార్కెట్ 2017-22 మధ్యకాలంలో 10.1 శాతం వార్షిక వృద్ధి నమోదు చేయనుంది. ఇదే సమయంలో దేశీయంగా 22.6 శాతం వృద్ధి సాధించనుంది. 2017లో దీని విలువ 297 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,932 కోట్లు) కాగా 2022కు 823 మిలియన్ డాలర్ల (సుమారు 5,363 కోట్లు) కు చేరుతుందని అంచనా. ఇందులో ప్రధానంగా వీడియో ఆన్ డిమాండ్ (వీఓడీ)కు చందాల రూపంలో వచ్చే మొత్తమే అధికంగా ఉంటుంది.
- గత దశాబ్ద కాలంలో వీఓడీ మార్కెట్ ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతూ వస్తోంది. ఇటీవల ఇక్కడ స్మార్ట్‌ఫోన్ల వినియోగం బాగా పెరగడంతోపాటు అతి తక్కువ ధరకే డేటా దొరుకుతుండటంతో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది.
- ఇంటర్నెట్ ప్రకటనల మార్కెట్‌లో ప్రధానంగా మొబైల్ వీడియో ప్రకటనల మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. 2022 నాటికి ఇది 32.8 శాతం వార్షిక వృద్ధితో 317 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,064 కోట్లు) స్థాయికి చేరుకుంటుంది. ఇదే సమయంలో డేటా వినియోగం కూడా 71,67,103 మిలియన్ ఎంబీల నుంచి 10,96,58,793 మిలియన్ ఎంబీలకు చేరుతుంది.
- సాంకేతికతను బాగా వినియోగించుకోవడం ద్వారా వినియోగదారుల్ని దృష్టిలో ఉంచుకొని ప్రాంతీయ, నాణ్యమైన సమాచారాన్ని అందిస్తుండటం వీఓడీ సేవల ప్రొవైడర్ల విజయానికి కారణమవుతోంది.
- 2021 నాటికి మన మీడియా, వినోద పరిశ్రమపై తలసరి వ్యయం 32 డాలర్లుగా నమోదు కానుంది. అయితే ఇది చైనా (222 డాలర్లు), అమెరికా (2,260 డాలర్లు)లతో పోలిస్తే బాగా తక్కువే.

షేర్లు భారీగా పతనమైనా ఎగవేతదారుగా ప్రకటించరు

రుణదాతలు అంగీకరించారు: ఎస్సెల్ గ్రూపు

దిల్లీ: సుభాష్ చంద్ర నేతృత్వంలోని ఎస్సెల్ గ్రూపు, రుణదాతలతో ఒక అవగాహనకు వచ్చినట్లు వెల్లడించింది. ఒకవేళ తమ గ్రూపులోని జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీ తదితర కంపెనీల షేర్లు భారీగా పతనమైనా, ఎస్సెల్ గ్రూపును 'ఎగవేతదారు'గా ప్రకటించవద్దని కోరగా, రుణదాతలు అందుకు అంగీకరించినట్లు తెలిపింది. ఎస్సెల్ గ్రూపు ప్రమోటర్లు తమ షేర్లను తనఖా పెట్టి మ్యూచువల్ ఫండ్లు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, బ్యాంకుల వద్ద నుంచి రుణాల్ని తీసుకువచ్చారు. అందుకే ఆర్థిక సంస్థల ప్రతినిధులతో వివరణాత్మక సమావేశం నిర్వహించి సంస్థ పరిస్థితిని వారికి వివరించినట్లు తెలుస్తోంది. గత శుక్రవారం జీ గ్రూపు కంపెనీల షేర్లలో భారీగా విక్రయాల ఒత్తిడి తలెత్తి, గ్రూప్ సంస్థల మార్కెట్ విలువ సుమారు రూ.13,352 కోట్ల తరిగిపోయిన నేపథ్యంలో ఈ సమావేశం కీలకంగా మారింది. రుణదాతలు తమ గ్రూపు సంస్థలైన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీలపై ఎంతో నమ్మకంగా ఉన్నారని ఎస్సెల్ గ్రూప్ చెబుతోంది.

నిత్యాంక్ ఇన్‌ఫ్రాతో సంబంధం లేదు

మనీలాండరింగ్ ఆరోపణలను సుభాష్ చంద్ర నేతృత్వంలోని ఎస్సెల్ గ్రూప్‌నకు చెందిన జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజ్, డిష్ టీవీలు ఖండించాయి. పెద్ద నోట్ల రద్దు సమయంలో అనుమానాస్పదంగా భారీ మొత్తం డిపాజిట్లు చేసినట్లు నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్ అండ్ మల్టీవెంచర్స్ ఆరోపణలు ఎదుర్కొంటోంది. దీనిపై తీవ్ర నేరాల దర్యాప్తు సంస్థ (ఎస్ఎఫ్ఐఓ) దర్యాప్తు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. నిత్యాంక్ ఇన్‌ఫ్రా స్వతంత్ర సంస్థ అని, ఎస్సెల్ గ్రూప్‌తో ఎటువంటి సంబంధం లేదని జీ ఎంటర్‌టైన్‌మెంట్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో పేర్కొంది. నిత్యాంక్ ఇన్‌ఫ్రాకు సంబంధించి ఎస్సెల్ గ్రూప్ సంస్థలను ఎస్ఎఫ్ఐఓ కేవలం అనుమానంతోనే దర్యాప్తు చేసిందని, దీనిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని వెల్లడించింది. దీనికి సంబంధించి ఒక వెబ్‌సైట్‌లో ప్రచురించిన వార్తలో ఎటువంటి నిజం లేదని జీ ఎంటర్‌టైన్‌మెంట్ పునరుద్ఘాటించింది.

అల్యూమినియం సానుకూలమే!

కమొడిటీస్ ఈ వారం

బంగారం, వెండి



పసిడి డిసెంబరు కాంట్రాక్టు వరుసగా మూడో వారం సానుకూలంగా ముగిసింది. గత సోమవారం రూ.32,044 వద్ద కాంట్రాక్టు ఆరంభమైంది. అనంతరం కాస్త తగ్గి రూ.31,957 స్థాయికి దిగివచ్చింది. కీలక మద్దతు స్థాయైన రూ.31,888కి దరిదాపులో కాంట్రాక్టు నిలదొక్కుకోవడంతో తిరిగి కొనుగోళ్ల మద్దతు లభించింది. శుక్రవారం కీలక మద్దతు స్థాయైన రూ.32,161ని అధిగమించింది. అదే రోజు రూ.32,358 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 0.98% లాభంతో రూ.32,358 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఈవారం కాంట్రాక్టుకు ప్రధానంగా దిశానిర్దేశం చేస్తాయి. అమెరికా ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ తీసుకునే నిర్ణయాలపై ట్రేడర్లు కన్నేసి ఉంచుతారు. అమెరికా- చైనా మధ్య చర్చలు, అమెరికాలో ప్రభుత్వ తాత్కాలిక మూసివేత సంబంధిత పరిణామాలను గమనిస్తారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే ఈవారం కాంట్రాక్టుకు రూ.32,450- 32,587 మధ్య కొంత నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ స్థాయిలను అధిగమించకుంటే కాంట్రాక్టు అమ్మకాల ఒత్తిడికి లోనుకావచ్చు. వెండి మార్చి కాంట్రాక్టు గతవారం రూ.39,155 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.38,733 స్థాయికి దిగివచ్చింది. అనంతరం కొనుగోళ్ల దన్నుతో రూ.39,720 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. ఆఖరుకు 1.32% లాభంతో రూ.39,670 వద్ద ముగిసింది. ఈవారం రూ.39,028 కంటే దిగువకు రాకుంటే లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. అదే సమయంలో లాంగ్ పొజిషన్లు ఉన్న ట్రేడర్లు రూ.39,984- 40,361 మధ్య లాభాలు స్వీకరించడం మంచిది. షార్ట్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.40,361 వరకు వేచిఉండటం మేలు.

ప్రాథమిక లోహాలు



రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగానే కనిపిస్తోంది. అందువల్ల ప్రస్తుత లాంగ్ పొజిషన్లను రూ.435 వరకు అట్టేపెట్టుకోవచ్చు. కొత్తగా లాంగ్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.426 స్థాయికి దిగివచ్చేవరకు వేచి ఉండటం మంచిది. గతవారం తీసుకున్న లాంగ్ పొజిషన్లకు రూ.419.60 దిగువన స్టాప్‌లాస్‌ని సవరించుకోవడం తప్పనిసరి. సీసం జనవరి కాంట్రాక్టు గడువు తీరిపోతున్నందున, రూ.153కి దరిదాపులో లాభాలు స్వీకరించడం మేలు. లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.146 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి. జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టును ఈవారం కూడా కొనుగోలు చేయడం మంచిదే. రూ.187.55 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని ప్రస్తుత లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అలాగే రూ.194.05 స్థాయికి చేరాక లాభాలు స్వీకరించాలి. అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం కూడా కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే రూ.130.05 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి. నికెల్ ఫిబ్రవరి కాంట్రాక్టు ఓవర్‌సోల్డ్ పరిధిలో ఉన్నందున, రూ.832 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని కొనుగోళ్లకు మొగ్గుచూపొచ్చు.

ఇంధన రంగం



ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.3956 స్థాయిని నిలబెట్టుకోకుంటే, సెంటిమెంటు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈవారం కూడా షార్ట్‌సెల్లింగ్ చేయొచ్చు. సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం కూడా వాతావరణ అంచనాలు దిశానిర్దేశం చేస్తాయి. వాతావరణ అంచనాల్లో ఏమైనా మార్పులు చోటుచేసుకుంటే స్వల్పకాలంలో కాంట్రాక్టు ఒడుదొడుకులకు లోనుకావచ్చు. సాంకేతికంగా ఓవర్‌సోల్డ్ పరిధిలో ఉన్నందున ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లొచ్చు. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కదలాడే అవకాశం ఉంది. అయితే అధిక స్థాయిల వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉన్నందున లాభాలు స్వీకరించడం మంచిది.

– *ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్*

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	428.45	428.70	0.06
సీసం (ఫిబ్రవరి)	143.35	150.10	4.71
జింక్ (ఫిబ్రవరి)	185.50	191.30	3.13
అల్యూమినియం (ఫిబ్రవరి)	134	135.31	1.31
నికెల్ (ఫిబ్రవరి)	844.60	848.10	0.41
ముడి చమురు (ఫిబ్రవరి)	3,875	3,816	(1.52)
సహజ వాయువు (ఫిబ్రవరి)	224	218.20	(2.59)
సీపీఓ (ఫిబ్రవరి)	561	569.90	1.59

విపక్షం ఏమన్నా.. పేదల పక్షానే

- తమిళనాడు పర్యటనలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

మదురై, ఈనాడు డిజిటల్-చెన్నై: ప్రజలకు కాపలాదారునిగా వ్యవహరిస్తున్న తనను తప్పించేందుకే విపక్షాలన్నీ ఒక్కటయ్యాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. విభేదాలను పక్కన పెట్టి వారెన్ని ప్రయత్నాలు చేస్తున్నా తాను పేదల పక్షానే నిలబడతానని చెప్పారు. తమిళనాడులోని మదురై సమీపంలో రూ.1264 కోట్ల వ్యయంతో నిర్మించబోయే 'అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ' (ఎయిమ్స్)కి ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి, బహిరంగ సభలో మాట్లాడారు. 'అవినీతికి వ్యతిరేకంగా కేంద్రం చేపట్టిన చర్యలతో చెన్నై నుంచి దిల్లీ వరకు వణుకు పుట్టింది. ప్రభుత్వ పనుల్లో, సంక్షేమ చర్యల పేరుతో సొమ్ము చేసుకున్నవారంతా చేతులు కలుపుతున్నారు. మిగతా అభ్యంతరాలన్నింటినీ పక్కన పెట్టి నాపై పోరాటానికి ఏకమవుతున్నారు' అని ఉద్ఘాటించారు. మదురై-చెన్నై నగరాలను తేజస్ రైళ్లతో అనుసంధానించబోతున్నట్లు ప్రధాని చెప్పారు.

ఎండీఎంకే నిరసన సెగ

ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మద్దతుదారులు మదురైలో నల్లజెండాలు, బెలూన్లతో నిరసన తెలపడం కలకలం రేపింది. వంద మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



రిమోట్ ద్వారా ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పక్కన తమిళనాడు ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, తంబిదురై, బన్వారీలాల్ పురోహిత్, సీఎం ఎడప్పాడి పళనిస్వామి, కేంద్ర మంత్రి పొన్ రాధాకృష్ణన్

వామపక్ష సర్కారు తీరు బయటపడింది

కొచ్చి: కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిని, భక్తుల విశ్వాసాలను ఎలా అవమానించాలని ప్రయత్నించిందో శబరిమల అంశం ద్వారా యావద్దేశం చూసిందని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. కొచ్చిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)కు చెందిన చమురు శుద్ధి కర్మాగారంలో విస్తరించిన పనుల్ని దేశ ప్రజలకు ఆదివారం ఆయన అంకితం చేశారు. ఐవోసీకి చెందిన ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంటులో అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసే రీతిలో ముడి చమురు దిగుమతిని 10% మేర తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయాత్మకంగా అడుగులు వేస్తోందని చెప్పారు. త్రిశ్శూర్‌లో భాజపా యువమోర్చా బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు.

నంబినారాయణన్‌కు పద్మ పురస్కారం మాకు గౌరవం

దేశభక్తుడైన ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబినారాయణన్‌ను కొంతమంది నేతలు రాజకీయ కక్షలతో గూఢచర్యం కేసులో ఇరికించారని, ఆయనకు పద్మభూషణ్‌ను ఇచ్చే అవకాశం లభించడం తమ సర్కారుకు దక్కిన గౌరవమని ప్రధాని చెప్పారు. దేశాన్ని బలోపేతం చేసే ప్రతిఒక్కరికీ తాము విలువనిస్తామన్నారు.

ఓటు వేయడం వ్యక్తిగత సంస్కారం

దిల్లీ: దేశం కోసం కలలు కనాల్సిన సమయం నవయువతకు ఆసన్నమయిందని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం ఈ సంవత్సరపు తొలి 'మన్ కీ బాత్'లో ఆయన ప్రసంగిస్తూ రానున్న ఎన్నికల ప్రాధాన్యాన్ని కొత్త తరానికి వివరించారు. 18 ఏళ్లు నిండి తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్న యువతను ఉద్దేశిస్తూ "21వ శతాబ్దంలో జన్మించిన వీరికి దేశ బాధ్యతలు తీసుకొనే సమయం వచ్చింది. దేశం కోసం నిర్ణయం తీసుకునే సుదీర్ఘ ప్రక్రియలో వీరు భాగస్వాములు అవుతారు. మీ సొంత కలలను భారత్‌ను గొప్ప దేశంగా తయారు చేయాలన్న జాతి స్వప్నాలకు జత చేయండి. అర్హులంతా ఓటర్లుగా నమోదు చేసుకోండి. ఓటు వేయడాన్ని 'జాతీయ కర్తవ్యం'గా భావించండి. అది వ్యక్తిగత సంస్కారంగా మారాలి" అని హితవు పలికారు.

ఎన్నికల సంఘం.. అందరికీ గర్వకారణం

ఉన్నత ప్రమాణాల్లో ఎన్నికలను నిర్వహిస్తున్నందుకు ఎన్నికల సంఘాన్ని ప్రధాని మోదీ అభినందించారు. హిమాచల్ ప్రదేశ్‌లో సముద్ర మట్టానికి 15వేల అడుగుల ఎత్తులో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తోంది. అండమాన్-నికోబార్ దీవుల్లోని మారుమూల ప్రాంతంలోనూ బూత్‌ను ఏర్పాటు చేసినట్టు మనం విన్నాం. గుజరాత్‌లోని గిర్ అడవుల్లో అయితే కేవలం ఒకే ఒక్క ఓటరు కోసం పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తోందని ప్రశంసించారు. అంతరిక్ష ప్రయోగాల్లో యువత విజయాలు సాధిస్తున్నందుకు మోదీ అభినందించారు.

శివకుమార స్వామికి శ్రద్ధాంజలి

ఇటీవల అస్తమించిన కర్ణాటకకు చెందిన శివకుమార స్వామికి శ్రద్ధాంజలి ఘటించారు. 101 ఏళ్ల జీవిత కాలంలో స్వామీజీ ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేశారని పేర్కొన్నారు. సిద్ధగంగ మఠంలో తరచు వ్యవసాయ, పశు ప్రదర్శనలను నిర్వహించేవారని గుర్తుచేశారు. ఆయన గౌరవార్థం కలాం రాసిన కవితను చదివి వినిపించారు. సుభాష్ చంద్రబోస్, సంత్ రవిదాస్‌ల జయంతిని పురస్కరించుకొని వారి సేవలను స్మరించారు. ఎర్రకోటలో నేతాజీ మ్యూజియం ఏర్పాటు చేశామని చెప్పారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌తో పాటు ఇతర ప్రముఖ చిత్రకారుల చిత్రాలను మరో ప్రదర్శనశాలలో ఉంచామన్నారు.

ఆనకట్ట దుర్ఘటనలో మృతులు వందల్లోనే!

ప్రమాదకర స్థాయిలో మరో డ్యాం

బ్రుమాడినో: బ్రెజిల్ దేశంలో ఆనకట్ట కూలిన దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. 9 మంది మృతి చెందినట్లు తొలుత చెప్పినా ఇప్పుడు 34 మంది మరణించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ సంఖ్య వందల్లో ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు బ్రుమాడినో నగరానికి సమీపంలోని కొర్రేగో డి ఫెయిజియో గనుల వద్ద 'వలే' కంపెనీకి చెందిన మరో ఆనకట్టలో కూడా నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో ఆ కంపెనీ దిగువన ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి, ఇళ్లు ఖాళీ చేయాలని కోరింది. శుక్రవారం ఆనకట్ట కూలిన కారణంగా నేలంతా బురదతో నిండిపోవడంతో పాటు వర్షం కురుస్తుండడంతో సహాయ చర్యలు చేపట్టడం సాధ్యం కావడం లేదు. దీంతో హెలికాప్టర్లను రంగంలోకి దింపి కొంత మందిని కాపాడారు. ఇంతవరకు 192 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బురదలో చిక్కుకున్నవారిని అత్యాధునిక సాంకేతిక పరికరాల సాయంతో గుర్తించడానికి ఇజ్రాయెల్‌కు చెందిన 130 మంది సైనికుల బృందం చేరుకుంది. 42 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆనకట్ట కూలిపోవడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. ఇది కూలిపోయిన అనంతరం కింద నున్న మరో ఆనకట్ట నీటితో నిండిపోయింది. దాంతో బ్రుమాడినో పరిసర ప్రాంతాలను వరద ముంచెత్తడంతో ఇళ్లు, రహదారులు, పొలాలు దెబ్బతిన్నాయి.

ఐసీఐసీఐ రుణాల కేసులో సీబీఐ ఎస్పీ బదిలీ

- సోదాల సమాచారం లీకు చేశారని అనుమానాలు

దిల్లీ: వీడియోకాన్ కంపెనీకి ఐసీఐసీఐ బ్యాంకు రుణాల మంజూరు చేసిన వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఎస్పీ సుధాంశు ధర్ మిశ్రను బదిలీ చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. సోదాలు జరుగుతాయన్న సమాచారాన్ని ఆయన లీక్ చేసినట్టు తేలిందని ఆదివారం ఆ వర్గాలు వెల్లడించాయి. కొత్తగా మోహిత్ గుప్తాకు బాధ్యతలు అప్పగించారని, ఆయన ఆధ్వర్యంలో పలు చోట్ల సోదాలు జరిగాయని తెలిపాయి. మిశ్రను రాంచీ బదిలీ చేసినట్టు పేర్కొన్నాయి. ఆయన కారణం లేకుండానే ప్రాథమిక దర్యాప్తు నివేదికను తొక్కిపెట్టారని, అధికారులు దీనిపై సమీక్ష జరపడంతో అనంతరం కేసు నమోదు చేశారని తెలిపాయి. కేసు నమోదు చేసిన వెంటనే సోదాలు చేశారని, అయితే వీటి సమాచారం లీకు చేశారనడానికి గట్టి అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఇది తీవ్రమైన అంశం కావడంతో తొలుత బదిలీ చేసి అనంతరం దర్యాప్తు చేయనున్నట్టు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్, వీడియోకాన్ గ్రూపు ఎం.డి. వేణుగోపాల్ ధూత్‌లపై 22న కేసులు నమోదు కాగా, మరుసటి రోజునే ఎస్పీ బదిలీ జరిగింది.

చిదంబరం ధ్వజం

సీబీఐ విచక్షణారహితంగా వ్యవహరిస్తూ బ్యాంకర్లను లక్ష్యంగా చేసుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆరోపించారు. ఇందుకు కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ట్వీటే నిదర్శనమని తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు కేసులో ప్రముఖ బ్యాంకర్ కె.వి.కామత్ సహా మరికొందరు ప్రముఖులపై కేసు పెట్టడంపై జైట్లీ స్పందించారు. సీబీఐకి వృత్తిపరమైన దర్యాప్తు చేయడం కన్నా; ఆధిక్యత కనబరచడం, దర్యాప్తులో సాహసాలు ప్రదర్శించడంపై ఆసక్తి ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. జైట్లీ చేసిన ఈ వ్యాఖ్యలపై చిదంబరం స్పందిస్తూ సీబీఐ పనితీరుకు ఇదే ధ్రువపత్రమని అన్నారు. ప్రముఖ ఐఏఎస్ అధికారులపై సీబీఐ కేసులు నమోదు చేసినప్పుడు ప్రభుత్వం గాఢనిద్రలో ఉందని ఆరోపించారు.

సీవీసీ మీద అవినీతి ఫిర్యాదులపై స్పందించడానికి మార్గదర్శకాల్లేవు!

దిల్లీ: 'కేంద్ర విజిలెన్స్ కమిషనర్'(సీవీసీ)/విజిలెన్స్ కమిషనర్లపై వచ్చే అవినీతి ఫిర్యాదులను కేంద్రప్రభుత్వం స్వీకరించి చేపట్టడానికి వీలుకల్పించే నిర్దేశిత మార్గదర్శకాలంటూ ఏమీ లేవు. ఇదే విషయాన్ని కేంద్ర సిబ్బంది మంత్రిత్వశాఖ.. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన ఒక దరఖాస్తుకు స్పందనగా స్పష్టం చేసింది. రెండేళ్ల క్రితం సీవీసీ కేవీ చౌదరిపై వచ్చిన రెండు ఫిర్యాదులపై కేంద్రం ఏమీ చేయడానికి వీలుకాదని ఉద్ఘాటించింది. ఇలాంటి ఫిర్యాదుల కోసం మార్గదర్శకాల రూపకల్పనకు కేంద్రప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలిపింది.

అయోధ్య కేసు విచారణ వాయిదా

దిల్లీ: 'అయోధ్య' కేసు మరోసారి వాయిదాపడింది. ఇదివరకటి షెడ్యూలు ప్రకారం మంగళవారం(29వ తేదీ) భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయి సారథ్యంలోని ధర్మాసనం ఈ కేసులో వాదనలు వినాల్సి ఉంది. అయితే, న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే అందుబాటులో లేకపోవడంతో విచారణ వాయిదా పడింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదివారం ఓ నోటీసు విడుదల చేసింది. సంబంధిత ధర్మాసనం తిరిగి ఎప్పుడు విచారణ చేపడుతుందన్న విషయాన్ని మాత్రం ఆ ప్రకటనలో ప్రస్తావించలేదు. రామజన్మభూమి-బాబరీ మసీదు వివాదాన్ని విచారించాల్సి ఉన్న ధర్మాసనాన్ని జస్టిస్ రంజన్ గొగొయి శుక్రవారం పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే, జస్టిస్ అశోక్‌భూషణ్, జస్టిస్ అబ్దుల్ నజీర్ సభ్యులు.

'ట్రైన్ 18' కాదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్

త్వరలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

దిల్లీ: మనదేశంలో తొలి ఇంజిన్‌రహిత రైలుగా గుర్తింపు పొందిన 'ట్రైన్ 18' పేరు మారింది. స్వదేశీ ఇంజినీర్లు పూర్తిగా స్వదేశంలోనే తయారు చేసిన నేపథ్యంలో ఇకపై ఈ రైలును 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'గా పిలవబోతున్నట్లు రైల్వేమంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ప్రకటించారు. పార్లమెంటులో బడ్జెట్ సమర్పణ అనంతరం ఆయన చేతులమీదుగా ప్రారంభోత్సవం ఉండొచ్చునని పేర్కొన్నారు. 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్'లో 16 బోగీలుంటాయి. రూ.97 కోట్ల వ్యయంతో చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో దాన్ని నిర్మించారు. దిల్లీ-వారణాసి మధ్య ఈ రైలు ప్రయాణిస్తుంది. మొత్తం 755 కిలోమీటర్ల ప్రయాణాన్ని దాదాపు 8 గంటల్లో పూర్తిచేస్తుంది. శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌తో పోలిస్తే ఈ రైల్లో టికెట్ ధరలు 40-50 శాతం ఎక్కువగా ఉండే అవకాశముందని అధికారులు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ తరగతి ధరలు రూ.2,800-2,900 మధ్య, చైర్ కార్ తరగతి ధరలు రూ.1,600-1,700 మధ్య ఉండొచ్చు.

మోదీ బహుమతుల వేలం



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి బహూకరించిన జ్ఞాపికలు, పురస్కారాలు, బహుమతుల వేలం ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. దిల్లీలోని నేషనల్ గ్యాలంటరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ (ఎన్‌జీఎంఏ) భవనంలో రెండు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. తొలి రోజు మహారాజా ఛత్రపతి శివాజీ విగ్రహం రూ.22,000 పలికింది. వేలంలో సమకూరిన నిధులను కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'నమామీ గంగే' ప్రాజెక్టు కోసం వెచ్చించనున్నారు. మొత్తంగా 1900 వరకు బహుమతులను వేలం వేయనున్నట్లు కేంద్ర మంత్రి మహేశ్ శర్మ తెలిపారు.

ఫిలిప్పీన్స్‌లో ఉగ్రదాడి

- 20 మంది మృతి, 111 మందికి గాయాలు

జోలో (ఫిలిప్పీన్స్): దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఒక చర్చిపై ఉగ్రవాదులు బాంబు దాడికి తెగబడ్డారు. ఇందులో కనీసం 20 మంది చనిపోగా, 111 మంది గాయపడ్డారు. ఆదివారపు ప్రార్థనలు జరుగుతున్న సమయంలో ఈ ఘాతుకం జరిగింది. నిమిషాల వ్యవధిలో రెండు పేలుళ్లు జరిగాయని అధికారులు తెలిపారు.

సులు ప్రావిన్స్‌లోని జోలో పట్టణంలో ఈ దుశ్చర్య చోటుచేసుకుంది. మొదటి పేలుడు చర్చిలోని ప్రధాన మందిరంలో చోటుచేసుకుంది. ఇందులో పలువురు చనిపోయారు. భయాందోళనకు గురైన ప్రజలు ప్రధాన ద్వారం గుండా బయటకు వచ్చేందుకు పరుగులు తీశారు. అదే సమయంలో చర్చి వెలుపల ఉన్న సైనికులు, పోలీసులు లోపలికి పరుగులు తీశారు. ఇంతలో ప్రధాన ద్వారం వద్ద రెండో బాంబు పేలింది. దీంతో మరిన్ని మరణాలు చోటుచేసుకున్నాయి. రెండో బాంబును ఓ మోటారు సైకిల్‌లో అమర్చారన్న వార్తలు వచ్చాయి. బాంబు పేలుళ్ల తర్వాత సెల్‌ఫోన్ సంకేతాలను నిలిపివేశారు. మృతుల్లో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. ఘటన అనంతరం సాయుధ శకటాల్లో భద్రతా దళాలు రంగ ప్రవేశం చేశాయి. చర్చికి దారితీసే ప్రధాన రోడ్డును మూసేశాయి. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని పట్టుకునేందుకు అన్ని చర్యలూ చేపడతామని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డుటెర్టె కార్యాలయం పేర్కొంది. ఈ దాడికి ఎవరూ బాధ్యత వహించలేదు.



ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి మృతదేహాలను తరలిస్తున్న జవాన్లు

రోమన్ క్యాథలిక్‌లు ఎక్కువగా ఉన్న ఫిలిప్పీన్స్‌లో ముస్లింలు మైనార్టీలుగా ఉన్నారు. గత ఐదు దశాబ్దాల్లో 1.5 లక్షల మందిని బలిగొన్న వేర్పాటువాద ఉద్యమానికి ముగింపు పలికే ఉద్దేశంతో ఇటీవల దక్షిణ ఫిలిప్పీన్స్‌లో మైనార్టీల కోసం స్వయం ప్రతిపత్తి ప్రాంతాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి చాలావరకూ ముస్లిం ప్రాంతాలు ఆమోదం తెలిపినప్పటికీ సులు ప్రావిన్స్ మాత్రం తిరస్కరించింది.

హోటల్‌పై విరిగిపడిన కొండచరియలు: 15 మంది మృతి

లిమా: వివాహ వేడుకలు జరుగుతున్న ఓ హోటల్ భవనంపై మట్టి, కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో కనీసం 15 మంది మరణించారు. ఆదివారం పెరూలో జరిగిన ఈ ఘటనలో 34 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. విపరీతమైన వేగంతో విరిగిపడిన కొండచరియలు హోటలు గోడలను కుప్పకూల్చేశాయని తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో రోడ్డు ప్రమాదం

ఎనిమిది మంది మృతి

దెహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో ఆదివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. మరో పది మంది క్షతగాత్రులయ్యారు. చంపావత్ జిల్లాలోని లోహాఘాట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఓ వృద్ధురాలి మృతదేహాన్ని అంతిమ సంస్కారాల కోసం తీసుకువెళ్తున్న వాహనం ప్రమాదవశాత్తు 300 మీటర్ల లోతు లోయలో పడిపోయింది. ప్రమాదస్థలంలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. వర్షం కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని చెప్పారు.

ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య

కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లోని బలరామ్‌పుర్ జిల్లాలో ఏడేళ్ల చిన్నారిపై పద్నాలుగేళ్ల బాలుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. అనంతరం ఆమెను పెద్ద బండరాయితో కొట్టి హత్య చేశాడు. బల్‌రామ్‌పుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. చిన్నారిని ఆమె ఇంటి వద్ద నుంచి గ్రామ శివార్లలోని ఓ కాలువ వద్దకు తీసుకువెళ్లి నిందితుడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు వివరించారు. బాధితురాలి మృతదేహం కనిపించడంతో స్థానికులు తమకు సమాచారం అందించారని పేర్కొన్నారు.



గణతంత్ర దినోత్సవంలో భాగంగా దేశ రాజధానిలోని ఎర్రకోట వద్ద ఆదివారం 'భారత్ పర్వ్' వేడుకలు నిర్వహించారు. దీనిలో కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

30, 31 తేదీల్లో అఖిలపక్ష సమావేశాలు

దిల్లీ: బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31న ప్రారంభం కానున్న నేపథ్యంలో రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ విడివిడిగా అఖిలపక్ష సమావేశాలకు పిలుపునిచ్చారు. ఈ నెల 30న మహాజన్, 31వ తేదీన పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు వెంకయ్యనాయుడు అఖిల పక్ష భేటీ నిర్వహించనున్నట్లు అధికారవర్గాలు ఆదివారం వెల్లడించాయి. బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేలా సహకరించడంపై ఈ భేటీల్లో చర్చించనున్నారు. వచ్చే నెల 1న లోక్‌సభలో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది.

భాజపాలో చేరిన నటి ఇషా కొప్పికర్

ముంబయి: బాలీవుడ్ నటి ఇషా కొప్పికర్ ఆదివారం భాజపాలో చేరారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో భాజపాలో చేరిన ఆమెకు పార్టీలో రవాణా వ్యవహారాలు చూసే మహిళా విభాగానికి కార్యనిర్వాహక అధ్యక్షురాలి బాధ్యతలను అప్పగించారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ చిత్రం 'కంపెనీ'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఇషా పలు తమిళ, తెలుగు, మరాఠీ, కన్నడ చిత్రాల్లో నటించారు.

కేంద్ర సంస్థల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

- ఫిబ్రవరి 1 నుంచి అమలు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో వచ్చే శుక్రవారం నుంచి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లు అమలు కానున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి వీటిలో జారీ అయ్యే అన్ని ప్రత్యక్ష నియామకాల నోటిఫికేషన్లకు చట్ట ప్రకారం పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటా వర్తించనుంది. ఈ మేరకు తమ పరిధుల్లోని పీఎస్‌యూలకు సూచనలు చేయాలని వివిధ కేంద్ర శాఖలు, విభాగాలకు ప్రభుత్వ రంగ పరిశ్రమల విభాగం (డీపీఈ) మార్గదర్శకాలు జారీ చేసింది.



దేశవ్యాప్తంగా 330కుపైగా కేంద్ర పీఎస్‌యూలు ఉన్నాయి. సుమారు 10.88 లక్షల మంది శాశ్వత ఉద్యోగులు ప్రస్తుతం వీటిలో పనిచేస్తున్నారు. కుటుంబ ఆదాయం రూ.8లక్షల కన్నా తక్కువ ఉన్నవారికి రిజర్వేషన్లు కల్పించిన విషయం తెలిసిందే.

హిందూ సాధువులకు ఏదీ భారతరత్న?: రాందేవ్

దిల్లీ: సమాజానికి ఎన్నోరకాలుగా సేవలందించిన కనీసం ఒక్క సాధువుకు కూడా ఇన్నేళ్లలో 'భారతరత్న' పురస్కారం ఎందుకు లభించలేదో అర్థం కావడం లేదని బాబా రామ్‌దేవ్ అన్నారు. మదర్‌థెరిస్సా క్రిస్టియన్ కాబట్టి ఆమెకు భారతరత్నను ఇచ్చారని, హిందువులు కాబట్టి సాధువులెవ్వరికీ కూడా ఈ పురస్కారం దక్కలేదని విమర్శించారు. మహర్షి దయానంద, స్వామివివేకానంద వంటి వారి సేవలు చిరస్మరణీయమని, రాజకీయనాయకులు, క్రీడాకారుల కంటే వారి సేవలు అనుపమానమైనవి అని వ్యాఖ్యానించారు.

ఖర్గే, జుబీన్‌గార్గ్‌లపై కేసు

మోరీగావ్/గువాహటీ: ఇటీవల ప్రభుత్వం దివంగత గాయకుడు భూపేన్ హజారికాకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై విమర్శలు చేసిన కాంగ్రెస్‌నేత మల్లికార్జున ఖర్గే, అసోమీ గాయకుడు జుబీన్‌గార్గ్‌లపై కేసులు నమోదయ్యాయి.

త్వరలో రైతులకు ప్యాకేజీ!

ఆమోదముద్ర వేయనున్న కేంద్ర మంత్రివర్గం

దిల్లీ: తగ్గిపోతున్న పంట ఉత్పత్తుల ధరలు, వ్యవసాయ రంగంలో సంక్షోభం సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం త్వరలో ఒక ఉపశమన ప్యాకేజీని ప్రకటించనుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్నదాతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు ఈ చర్యను చేపట్టనుంది. "చిన్న, సన్నకారు రైతులకున్న ఆదాయ లోటు సమస్యను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ తెచ్చిన ప్రతిపాదనలు కేంద్ర మంత్రివర్గ సమావేశ ఎజెండాలో ఉంది" అని వివరించాయి. నిజానికి కేబినెట్ సమావేశం సోమవారమే జరగాల్సిందని, అయితే వాయిదా పడిందని తెలిపాయి. ఈ వర్గాల కథనం ప్రకారం.. వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు స్వల్ప, దీర్ఘకాల పరిష్కారాలు సూచిస్తూ పలు ప్రతిపాదనలను వ్యవసాయ శాఖ చేసింది. వీటికి భారీగా నిధులు అవసరమవుతున్నందువల్ల కేబినెట్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. సకాలంలో పంట రుణాలను చెల్లించిన రైతులకు వడ్డీని మాఫీ చేసే ప్రతిపాదన ఒకటి ఇందులో ఉంది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.15వేల కోట్ల భారం పడుతుంది. ఆహార పంటలకు తీసుకున్న బీమాపై ప్రీమియాన్ని పూర్తిగా ఎత్తివేయాలన్న మరో ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నిర్దిష్ట మొత్తంలో సొమ్మును బదిలీ చేసేందుకు తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను కూడా కేంద్రం పరిశీలిస్తోంది.



2019-20 బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టడానికి ముందే వ్యవసాయానికి ఒక ప్యాకేజీని అమలు చేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ ఇటీవల చెప్పారు. అయితే కొత్త పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వానికి చాలా తక్కువ సమయం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా ప్రయోజనం పొందాలంటే వేగంగా అమలు చేయగలిగేలా ఈ పథకం ఉండాలంటున్నారు.

గొంతు కోసి ఇద్దరు హోంగార్డుల హత్య

- బిహార్‌లో ఘాతుకం

బగహా: బిహార్‌లోని పశ్చిమ చంపారణ్ జిల్లాలో కలప అక్రమరవాణాదారులు దారుణ అకృత్యానికి తెగబడ్డారు. ఇద్దరు హోంగార్డులను ఆదివారం కిరాతకంగా గొంతు కోసి హత్య చేశారు. భారత్-నేపాల్ సరిహద్దుల్లోని వాల్మీకి పులుల అభయారణ్యంలో దట్టమైన అటవీ ప్రాంతంలోకి దాదాపు 25-30 మంది కలప అక్రమరవాణాదారులు ఆయుధాలతో ప్రవేశించినట్లు బగహా ఎస్పీ అరవింద్ కుమార్ గుప్తా తెలిపారు. వారిని అడ్డుకునేందుకు వెళ్లిన హోంగార్డుల్లో ఇద్దరిని గొంతు కోసి చంపేశారని, మరొకరిని గాయపర్చారని వెల్లడించారు. మృతులను అర్జున్ యాదవ్(35), లాలా కుశ్వాహా(38)గా గుర్తించారు. హత్యల అనంతరం కలప అక్రమరవాణాదారులు నేపాల్‌లోకి జారుకొని ఉండొచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

నిందితుడి ఇంట్లో పోలీసు అధికారి ఫోన్

లఖ్‌నవూ: 'బులంద్‌శహర్ అల్లర్ల'లో హత్యకు గురైన పోలీసు అధికారి సుబోధ్ కుమార్ సింగ్ సెల్‌ఫోన్ ఆ కేసు నిందితుడి ఇంట్లో లభ్యమైంది. విశ్వసనీయ సమాచారం అందడంతో నిందితుడు ప్రశాంత్ నట్ ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు తెలిపారు. సుబోధ్ ఫోన్‌తో పాటు మరో ఐదు ఫోన్లు కూడా అతడి ఇంట్లో దొరికాయని వివరించారు. రాష్ట్రంలోని బులంద్‌శహర్ పట్టణంలో డిసెంబర్ 3న గోరక్షకుల పేరుతో కొంత మంది జరిపిన హింసాత్మక దాడుల్లో సుబోధ్, మరో వ్యక్తి హత్యకు గురయ్యారు. నెల క్రితమే ప్రశాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుబోధ్‌ను తానే కాల్చినట్లు అతడు అంగీకరించాడని వారు చెప్పారు.

ఛాంపియన్స్

సుదీర్ఘ నిరీక్షణకు సైనా నెహ్వాల్ తెరదించింది.. రెండేళ్ల తర్వాత ఆమె సూపర్ సిరీస్ ట్రోఫీలో విజేతగా నిలిచింది.. ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో జయకేతనం ఎగర వేసిన ఆమె కొత్త సీజన్‌లో తొలి టైటిల్ దక్కించుకుంది.. ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారిన్ గాయం నుంచి తప్పుకోవడంతో గెలుపు సైనా సొంతమైంది.





మారిన్ బాధతో..

- ఇండోనేసియా మాస్టర్స్ నెహ్వాల్ సొంతం
- గాయంతో నిష్క్రమించిన మారిన్

సైనా మళ్లీ సూపర్

జకార్తా

కొత్త ఏడాదిలో తొలి సూపర్ సిరీస్ టైటిల్‌ను సైనా నెహ్వాల్ సొంతం చేసుకుంది. అద్భుత ప్రదర్శనతో ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్స్ చేరిన ఆమె తుదిపోరులో విజేతగా నిలిచింది. సైనా చివరగా 2017లో మలేసియా టోర్నీ గెలుచుకుంది. ఆది వారం జరిగిన ఫైనల్లో సైనా 4-10తో వెనుకబడ్డ సమయంలో ప్రపంచ ఛాంపియన్ కరోలినా మారిన్ మోకాలి గాయంతో ఆట నుంచి వైదొలిగింది. మారిన్‌ను గాయంతో చూడడం బాధగా ఉందని మ్యాచ్ అనంతరం సైనా వ్యాఖ్యానించింది. "షట్లర్లందరికీ ఈ ఏడాది ఎంతో కీలకం. ఇలాంటి సందర్భంలో మారిన్‌కు గాయం కావడం బాధ కలిగించింది. గత కొన్నేళ్లుగా నేను చాలా గాయాల బారినపడి నేను కోలుకున్నా. ఇప్పుడు మారీన్‌ను ఇలా చూడడం అంటే బాధగా ఉంది. మానసికంగా ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఎందుకంటే ఒలింపిక్స్ సమయంలో నాకు మోకాలి గాయమైంది. అప్పుడు చాలా ఆవేదనకు లోనయ్యా. కన్నీళ్లు పెట్టుకున్నా. నాకు తెలుసు మోకాలి గాయం నుంచి కోలుకోవడం ఎంత కష్టమో. గతేడాది చివర్లో కాలి గాయంతో ఇబ్బందిపడ్డా. పూర్తిగా కోలుకున్నానో లేదో తెలుసుకోవడం కోసమే ఈ టోర్నీ బరిలో దిగా. నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నా. కానీ విజయం ఇలా దక్కడం ఆనందాన్నివ్వట్లేదు. ఫైనల్ చేరినందుకు సంతృప్తిగా ఉన్నా" అని సైనా తెలిపింది.

మారిన్ బాధతో విలవిల్లాడుతూ..

ఇండోనేసియా మాస్టర్స్ ఫైనల్ తొలి గేమ్. మారిన్ 9-2తో సైనాపై తిరుగులేని ఆధిపత్యంలో ఉంది. ఆమె జోరు చూస్తుంటే సులభంగానే గెలిచేలా కనిపించింది. కానీ సరిగ్గా అప్పుడే సైనా కొట్టిన షాట్‌ను ఆడేందుకు కుడి వైపు దూకిన మారిన్ తన కాలుపై మొత్తం భారాన్ని వేసింది. దాంతో మోకాలి నొప్పితో కోర్టులోనే పడి విలవిలలాడింది. బాధతో కన్నీళ్లు పెట్టుకుంది. వైద్య సాయం తీసుకొని తిరిగి కోలుకున్నట్లు కనిపించిన ఆమె సౌకర్యవంతంగా కదలలేకపోయింది. చివరకు 10-4తో ఉన్న సమయంలో బాధతో ఏడుస్తూ కోర్టు విడిచి వెళ్లిపోయింది.

జకోవిచ్‌కు ఇది ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్. ఈ టోర్నీలో ఏడుసార్లు ఫైనల్ చేరిన అతడు.. అన్నిసార్లూ గెలిచాడు.

7

- ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ నొవాక్ సొంతం
- ఫైనల్లో నాదల్‌పై ఘనవిజయం



3 జకోవిచ్‌కు ఇది వరుసగా మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం. నిరుడు అతడు వింబుల్డన్, యుఎస్ ఓపెన్‌లను గెలుచుకున్నాడు. రాబోయే ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ గెలిస్తే ఓపెన్ శకంలో ప్రతి గ్రాండ్‌స్లామ్‌నూ కనీసం రెండు సార్లు గెలిచిన ఏకైక పురుషుడిగా ఘనత సాధిస్తాడు.

జయహో జకోవిచ్

అగ్రశ్రేణి ఆటగాళ్లిద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ఫిట్‌గానూ ఉన్నారు. అలవోకగా ఫైనల్ చేరుకున్నారు. ఇద్దరూ సమవుజ్జీలే. ఎన్నో మ్యాచ్‌ల్లో కొదమసింహాల్లా తలపడ్డారు. దీంతో టోర్నీకి రసవత్తర ముగింపు ఖాయమనుకున్నారంతా! కానీ టైటిల్ సమరం ఏకపక్షమైపోయింది. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన జకోవిచ్.. నాదల్‌ను అలవోకగా ఓడిస్తూ రికార్డు స్థాయిలో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకున్నాడు. 15వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో పీట్ సంప్రాస్‌ను అధిగమించాడు.



మెల్‌బోర్న్

ప్రపంచ నంబర్‌వన్ జకోవిచ్.. నంబర్-2 రఫెల్ నాదల్‌ల మధ్య ఆఖరిపోరాటం ఉత్కంఠతో ఉర్రూతలూగిస్తుందని టెన్నిస్ అభిమానులంతా భావించారు. ఐదు సెట్లు... ఐదు గంటల హోరాహోరీ పోరని భావించారంతా. కానీ జరిగింది వేరు. టాప్ సీడ్ జకోవిచ్ (సెర్బియా) చెలరేగిపోయాడు. తిరుగులేని ఫామ్‌లో ఉన్న అతడు రెండు గంటల్లో ముగిసిన ఫైనల్లో 6-3, 6-2, 6-3తో నాదల్ (స్పెయిన్)ను చిత్తుగా ఓడించాడు. ఏడో టైటిల్‌తో అతడు అత్యధిక సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ గెలిచిన ఆటగాడిగా అవతరించాడు. చెరో ఆరు టైటిళ్లు గెలిచిన ఫెదరర్, రాయ్ ఎమర్సన్‌లను జకోవిచ్ అధిగమించాడు. జకోవిచ్ గతంలో 2008, 2011, 2012, 2013, 2015, 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్లో విజేతగా నిలిచాడు. మరోవైపు రెండోసారి ఇక్కడ టైటిల్ గెలవాలనుకున్న నాదల్.. ఎందుకో తేలిపోయాడు. 28 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ఎనిమిది ఏస్‌లు కొట్టిన జకోవిచ్.. కేవలం 9 అనవసర తప్పిదాలే చేశాడు.

సమరం ఏకపక్షం..

జకోవిచ్, నాదల్ గతంలో ఒకే ఒక్కసారి (2012)లో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో తలపడ్డారు. 5 గంటల 53 నిమిషాల పాటు సాగిన ఆ మ్యాచ్ గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ ఫైనల్. కానీ ఈసారి ఫైనల్ అందులో సగం తీవ్రతతో కూడా సాగలేదు. నాదల్ ఆరంభంలోనే తడబడడంతో ఫైనల్ ఏకపక్షమైపోయింది. నాదల్ ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్ చేరాడు. తొలి రౌండ్ మ్యాచ్ తర్వాత అతడు సర్వీసే కోల్పోలేదు. కానీ టైటిల్ పోరులో నాదల్ జోరుకు తెరపడింది. అతడి సర్వీసులో పదును లోపించింది. నాదల్ తొలి గేమ్‌నే బ్రేక్ చేసిన జకోవిచ్ తొలి సెట్లో 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. పూర్తి నియంత్రణతో సర్వీసు చేసిన అతడు తన తొలి నాలుగు సర్వీసుల్లో ఒక్క పాయింట్ కూడా ఇవ్వకపోవడం విశేషం. 36 నిమిషాల్లోనే అతడు మొదటి సెట్‌ను గెలుచుకున్నాడు. రెండో సెట్లోనూ జకోవిచ్ అదే జోరు కొనసాగించాడు. ఐదో గేమ్‌లో బ్రేక్ సాధించి ఆధిక్యం సంపాదించాడు. అతడు.. నాదల్ తర్వాతి సర్వ్‌ను కూడా బ్రేక్ చేసి, వెంటనే వరుసగా మూడు ఏస్‌లతో సర్వీసు నిలబెట్టుకుని సెట్‌ను సొంతం చేసుకున్నాడు. మూడో సెట్లోనూ పరిస్థితేమీ మారలేదు. జకోవిచ్ బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లతో మరింతగా చెలరేగిపోయాడు. మూడో గేమ్‌లో బ్రేక్ సాధించిన అతడు.. సర్వీసును నిలబెట్టుకుంటూ అలవోకగా సెట్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ విజయంతో నాదల్‌పై గెలుపు ఓటములు రికార్డును జకోవిచ్ 28-25కు పెంచుకున్నాడు. ఇద్దరి మధ్య గ్రాండ్‌స్లామ్ ఫైనల్ రికార్డు 4-4తో సమంగా ఉంది.

"నేను బాగా ఆడిన గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో ఇదొకటి. మేం ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల కోసం పోటీపడుతున్నామంటే నమ్మలేకపోతున్నా. చాలా గొప్పగా అనిపిస్తోంది. 12 నెలల కిందే నాకు శస్త్రచికిత్స జరిగింది. ఆ తర్వాత నాలుగు టైటిళ్లలో మూడు నెగ్గా. నా అనుభూతిని మాటల్లో చెప్పలేకపోతున్నా" – జకోవిచ్

28 నాదల్‌తో ఆడిన 53 మ్యాచ్‌ల్లో జకోవిచ్ విజయాలు. ఓపెన్ శకంలో పురుషుల సింగిల్స్‌లో ఒకే ప్రత్యర్థిపై అత్యధిక మ్యాచ్‌లు నెగ్గిన ఆటగాడు అతడే.

15 జకోవిచ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల సంఖ్య. సంప్రాస్ (14)ను అధిగమించిన అతడు పురుషుల టెన్నిస్‌లో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన ఆటగాళ్ల జాబితాలో ఫెదరర్ (20), నాదల్ (17) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు.

1 గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో నాదల్ ఒక్క సెట్ కూడా గెలవకపోవడం ఇదే తొలిసారి



5 గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లో ఒక్క సర్వీస్ బ్రేక్ కూడా సాధించలేకపోవడం నాదల్‌కు ఇది ఐదోసారి మాత్రమే.



ఆపగలదా కివీస్!

ఉదయం 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

జోరుమీదున్న భారత్ ● మూడో వన్డే నేడు

వరుస విజయాలతో జోరు మీదున్న టీమ్ ఇండియా మరో సమరానికి సిద్ధమైంది. సిరీస్‌పై కన్నేసిన భారత్.. నేడు మూడో వన్డేలో న్యూజిలాండ్‌ను ఢీకొంటుంది. ఈ పర్యటనలో కెప్టెన్ కోహ్లికి ఇదే ఆఖరి మ్యాచ్. అందుకే ఇక్కడే సిరీస్ విజయాన్ని అందుకోవాలనే పట్టుదలతో అతడు ఉన్నాడు. ఐతే అందరి దృష్టిమాత్రం సస్పెన్షన్ నుంచి తిరిగొచ్చిన హార్దిక్ పాండ్యపైనే.

మౌంట్ మాంగనుయ్

అన్ని రంగాల్లోనూ అదరగొడుతున్న భారత్ రెట్టించిన ఉత్సాహంతో ఉంది. సోమవారం మూడో వన్డేలో నెగ్గి, ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను చేజిక్కించుకోకుండా టీమ్ ఇండియాను అడ్డుకోవడం న్యూజిలాండ్‌కు సవాలే. భారత్ సిరీస్ గెలిస్తే.. 2014 పర్యటనలో ఎదురైన 0-4 పరాజయానికి ప్రతీకారం తీర్చుకున్నట్లవుతుంది. చివరి రెండు వన్డేలు, టీ20ల నుంచి సెలక్టర్లు కోహ్లికి విశ్రాంతినిచ్చిన సంగతి తెలిసిందే. పర్యటనలో చివరి మ్యాచ్ ఆడనున్న అతడు.. విజయంతో ముగించాలనుకుంటున్నాడు.

పాండ్యపైనే అందరి కళ్లు

బౌలింగ్, బ్యాటింగ్‌లో భారత్‌కు ఎలాంటి సమస్యలూ లేవు. బ్యాట్స్‌మెన్ మంచి ఫామ్‌లో ఉన్నారు. మిడిల్ ఆర్డర్ కూడా గాడిన పడింది. అందరి దృష్టి ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఎలా ఆడతాడన్నదానిపైనే. సస్పెన్షన్ తొలగిపోయాక అతడు తొలి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు. విజయ్ శంకర్ స్థానంలో పాండ్య జట్టులోకి రానున్నాడు. అతడి చేరికతో జట్టు మరింత బలోపేతం కానుంది. తొలి రెండు వన్డేల్లో శంకర్ బంతితో పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. పాండ్య అతడికన్నా వేగంగా బౌలింగ్ చేస్తాడు. అవసరమైతే ఆరో స్థానంలో కూడా బ్యాటింగ్ చేయగలడు. ఒక్క పాండ్య రావడం తప్ప జట్టులో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. మరోవైపు న్యూజిలాండ్‌కు కఠిన పరీక్షే. సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక నెగ్గాలి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కోహ్లీసేనపై పైచేయి సాధించడం కష్టమైన పనే. తీవ్ర ఒత్తిడిలో ఉన్న కివీస్ భారత స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్ యాదవ్‌లను ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరం. కెప్టెన్ విలియమ్సన్, బ్రాస్‌వెల్ తప్ప బ్యాట్స్‌మెనెవరూ ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

పిచ్ ఎలా ఉందంటే..

రెండో వన్డే జరిగిన వేదికలోనే ఈ మ్యాచ్ కూడా జరగనుంది. స్పిన్నర్లకు సహకారం లభించవచ్చు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశముంది. వాతావరణం అనువుగా ఉంటుంది.

తుది జట్లు ఇలా ఉండొచ్చు

భారత్: రోహిత్, ధావన్, కోహ్లి, రాయుడు, జాదవ్, ధోని, హార్దిక్, కుల్‌దీప్, భువనేశ్వర్, షమి, చాహల్
కివీస్: గప్తిల్, మన్రో, విలియమ్సన్, టేలర్, లాథమ్, నికోల్స్, శాంట్నర్, బ్రాస్‌వెల్, సోధి, ఫెర్గ్యూసన్, ట్రెంట్‌బౌల్ట్

విశేషాలు

● గత ప్రపంచకప్ నుంచి భారత్ 10 నుంచి 40 ఓవర్ల మధ్య.. అన్ని జట్ల కన్నా ఎక్కువగా 345 వికెట్లు పడగొట్టింది. ● న్యూజిలాండ్ చివరిసారి 2013లో సొంత గడ్డపై వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయింది.

టీమ్ఇండియా దాడి చేస్తుంది జాగ్రత్త!

మౌంట్ మాంగనుయ్: "దేశంలో టీమ్ఇండియా పర్యటిస్తోంది.. అమాయక న్యూజిలాండ్ బృందంపై ఆ జట్టు నేపియర్, మౌంట్ మాంగనుయ్‌లో తీవ్రంగా దాడి చేసిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చేతిలో క్రికెట్ బ్యాట్ లేదా బంతి ఉంటే మాత్రం జాగ్రత్తగా ఉండండి".. న్యూజిలాండ్‌కు చెందిన ఈస్టర్ డిస్ట్రిక్ట్ పోలీసు విభాగం ఈ హెచ్చరిక జారీ చేసింది. సరదాగా ఫేస్‌బుక్‌లో వారు అలా పోస్టు చేశారు. భారత జట్టు న్యూజిలాండ్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న నేపథ్యంలో వారు చేసిన సరదా పోస్టు సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు చక్కర్లు కొడుతోంది. సాధారణంగా తమ జట్టు ఓడిపోతుంటే ప్రత్యర్థి ఆటగాళ్లపై విమర్శల దాడి లేదా గేలి చేస్తుంటారు.. కానీ న్యూజిలాండ్ పోలీసు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించడాన్ని నెటిజెన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ స్కాట్ స్టైరిస్‌తో పాటు మాజీ క్రికెటర్లు కొంతమంది టీమ్ఇండియా చిత్రంతో ఉన్న ఆ పోస్టును ట్వీట్ చేశారు.



ఛాంపియన్స్

భారత్-ఎదే వన్డే సిరీస్

తిరువనంతపురం: ఇంగ్లాండ్ లయన్స్‌తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్-ఎ మరో రెండు మ్యాచ్‌లు ఉండగానే చేజిక్కించుకుంది. ఆదివారం స్వల్ప స్కోర్ల మూడో వన్డేలో 60 పరుగుల తేడాతో గెలిచిన భారత జట్టు సిరీస్‌లో 3-0 ఆధిక్యం సంపాదించింది. మొదట పరుగుల సాధనలో విఫలమైన భారత బృందం 47.1 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. కేఎల్ రాహుల్ (13) విఫలం కాగా.. దీపక్ చాహర్ (39), ఇషాన్ కిషన్ (30) కృనాల్ పాండ్య (21) జట్టుకు పోరాడగలిగే స్కోరు అందించారు. బౌలింగ్‌లో కృనాల్ పాండ్య (4/21), అక్షర్ పటేల్ (2/26) విజృంభించడంతో ఇంగ్లాండ్ జట్టు 30.5 ఓవర్లలో 112 పరుగులకే ఆలౌటైంది. బెన్ డకెట్ (39)దే ఆ జట్టులో అత్యధిక స్కోరు.



రోస్టన్ ఛేజ్ (8/60)


ఒకప్పటి వెస్టిండీస్‌లా..

381 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ చిత్తు ● కరీబియన్ జట్టు ఘనవిజయం

బ్రిడ్జ్‌టౌన్: 381 పరుగుల తేడాతో టెస్టు విజయం.. అది పసికూనపై కాదు.. ప్రపంచ నం.3 జట్టుపై..! సాధించింది వెస్టిండీస్..! నిజమే.. కరీబియన్ జట్టు అసాధారణ విజయాన్ని సొంతం చేసుకుంది. గత వైభవాన్ని గుర్తుచేస్తూ సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో రికార్డు విజయాన్ని అందుకుంది. బార్బడోస్‌లో బంతితో, బ్యాట్‌తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన వెస్టిండీస్ మరో రోజు ఆట మిగిలివుండగానే ఇంగ్లాండ్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. ఆఫ్ స్పిన్నర్ రోస్టన్ ఛేజ్ (8/60) కెరీర్ ఉత్తమ గణాంకాలు నమోదు చేసిన వేళ.. 628 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. సొంతగడ్డపై వెస్టిండీస్‌కు ఇదే అతిపెద్ద విజయం. 91 ఏళ్ల టెస్టు చరిత్రలో పరుగుల పరంగా వారికి ఇది మూడో భారీ గెలుపు. ఓవర్‌నైట్ స్కోరు 56/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ డ్రా లక్ష్యంతో పోరాడింది. లంచ్ సమయానికి 134/2తో ఆ జట్టు మెరుగ్గానే కనిపించింది. ఆ దశలో మ్యాచ్ ఐదో రోజుకు వెళ్లడం ఖాయంగా కనిపించింది. ఐతే విరామం తర్వాత రోస్టన్ ఛేజ్ స్పిన్ వలలో చిక్కుకున్న ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. జో బర్న్స్ (84) మినహా ఎవరూ పెద్దగా స్కోరు చేయలేదు. రూట్ (22), స్టోక్స్ (34), బట్లర్ (26) విఫలమయ్యారు. లంచ్ తర్వాత 9 వికెట్లలో 8 ఛేజ్ ఖాతాలోనే చేరాయి. తొలి ఇన్నింగ్స్‌లో 289 పరుగులు చేసిన వెస్టిండీస్, రెండో ఇన్నింగ్స్‌ను 415/6 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన వెస్టిండీస్ కెప్టెన్ జేసన్ హోల్డర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. తొలి మ్యాచ్ ఇచ్చిన ఉత్సాహంతో ఉన్న విండీస్.. సిరీస్‌లో మిగతా రెండు మ్యాచ్‌ల్లో ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. రెండో టెస్టు 31న ఆరంభమవుతుంది.

ఇంకో 55 పరుగులే

రంజీ ఫైనల్ ముంగిట సౌరాష్ట్ర



పుజారా (108 బ్యాటింగ్)

బెంగళూరు: సౌరాష్ట్ర రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరువైంది. కర్ణాటకతో సెమీఫైనల్లో విజయం సాధించేందుకు ఆ జట్టు మరో 55 పరుగులు చేస్తే చాలు! అజేయ సెంచరీతో ఛతేశ్వర్ పుజారా (108 బ్యాటింగ్), షెల్డన్ జాక్సన్ (90 బ్యాటింగ్) జట్టును విజయ పథంలో నడిపిస్తున్నారు. 279 పరుగుల లక్ష్య ఛేదనలో 23/3తో జట్టు కష్టాల్లో ఉండగా.. అభేద్యమైన నాలుగో వికెట్‌కు వీరిద్దరు 201 పరుగులు జోడించారు. పుజారా కెరీర్లో 49వ ఫస్ట్‌క్లాస్ సెంచరీ సాధించాడు. నాలుగో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర 224/3తో నిలిచింది. సోమవారం మ్యాచ్‌కు ఆఖరి రోజు. అద్భుతం జరిగితే తప్ప విజయం సౌరాష్ట్రదే. తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక 275, సౌరాష్ట్ర 236 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో కర్ణాటక 239 పరుగులకు ఆలౌటైంది. కష్టాల్లో ఉన్న జట్టును సెంచరీతో ఆదుకున్నా పుజారాపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కారణం రెండో ఇన్నింగ్స్‌లో 34 పరుగుల వద్ద అంపైర్ తప్పిదం కారణంగా అతడు బతికిపోవడమే. వినయ్ (2/48) బౌలింగ్‌లో పుజారా వికెట్ కీపర్‌కు చిక్కాడు. ఐతే స్పష్టంగా లేకపోవడంతో అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అప్పుడు జట్టు స్కోరు 68/3. తొలి ఇన్నింగ్స్‌లో కూడా అతడు ఇలాగే జీవన దానం పొంది కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వ్యక్తిగత స్కోరు 1 వద్ద పుజారా.. మిథున్ బౌలింగ్‌లో వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఐతే అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో బ్యాటింగ్ కొనసాగించిన అతడు 45 పరుగులు చేసి జట్టును ఆదుకున్నాడు. వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో అతడు బంతి బ్యాట్‌కు తాకినా వెనుదిరగకపోవడంతో.. స్టేడియంలో కర్ణాటక అభిమానులు మోసగాడు, మోసగాడు అంటూ అతడిని గేలిచేశారు.

సోబర్స్ తర్వాత హోల్డరే..

నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన విండీస్ కెప్టెన్



దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో గారీ సోబర్స్ (1974) తర్వాత నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన తొలి వెస్టిండీస్ ఆటగాడిగా జేసన్ హోల్డర్ ఘనత సాధించాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల జాబితాలో షకిబ్ అల్ హసన్‌ను వెనక్కి నెట్టి హోల్డర్ మొదటి స్థానం దక్కించుకున్నాడు. విండీస్ కెప్టెన్ అయిన హోల్డర్ ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో డబుల్ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. జడేజా ఐదో స్థానంలో ఉన్నాడు. బ్యాట్స్‌మన్ జాబితాలో విరాట్ కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. చెతేశ్వర్ పుజారా మూడో స్థానంలో, వికెట్‌కీపర్ రిషబ్ పంత్ 15వ స్థానంలో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జడేజా ఓ స్థానం కోల్పోయి ఐదో స్థానంలో నిలిచాడు. అశ్విన్ 9వ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రబాడ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

చెలరేగిన షిన్వారి

దక్షిణాఫ్రికాపై పాకిస్థాన్ విజయం



ఉస్మాన్ (4/35)

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో కీలకమైన నాలుగో వన్డేలో పాకిస్థాన్ విజయం సాధించి ఐదు వన్డేల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించడంతో ఆ జట్టు కెప్టెన్ సర్ఫరాజ్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అయినా కూడా పాక్ స్ఫూర్తిదాయక ప్రదర్శనతో సత్తాచాటి ఆదివారం జరిగిన నాలుగో వన్డేలో 8 వికెట్లతో ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించిన పాక్ తగిన ఫలితం రాబట్టింది. పేసర్లు ఉస్మాన్ షిన్వారి (4/35), షహీన్ అఫ్రీది (2/24) ధాటికి.. దక్షిణాఫ్రికా 41 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. ఆ జట్టులో ఆమ్లా (59), డుప్లెసిస్ (57) అర్ధ శతకాలు చేశారు. ఛేదనలో పాక్ రెండు వికెట్లు కోల్పోయి 31.3 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది. ఇమామ్ ఉల్ హక్ (71), ఫఖర్ జమాన్ (44), బాబర్ అజామ్ (41 నాటౌట్) ఆకట్టుకున్నారు. సిరీస్‌లో నిర్ణయాత్మక చివరి వన్డే బుధవారం జరగనుంది.

సర్ఫరాజ్‌పై 4 మ్యాచ్‌ల నిషేధం



దుబాయి: పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై వేటు పడింది. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ అండిలె ఫెలుక్వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేయడంతో అతనిపై ఆదివారం ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ఫెలుక్వాయోను ఉద్దేశిస్తూ "ఓరేయ్ నల్లోడా! అమ్మ ఈ రోజు ఎక్కడ కూర్చుంది?. ఆమెకు ఏం చెప్పి వచ్చావ్" అని ఉర్దూలో సర్ఫరాజ్ జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఈ నిషేధంతో సర్ఫరాజ్.. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 2 వన్డేలు, ఫిబ్రవరి 1 నుంచి న్యూజిలాండ్‌తో ఆరంభం కానున్న టీ20 సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. "ఆటగాళ్ల ఇలాంటి చర్యలకు పాల్పడితే ఐసీసీ ఉపేక్షించదు. సర్ఫరాజ్ తప్పు చేశాడు. అతను దాన్ని ఒప్పుకున్నాడు. బహిరంగంగా క్షమాపణ కూడా కోరాడు. ఆ విషయాలను పరిగణనలోకి తీసుకొని శిక్ష విధించాం" అని ఐసీసీ సీఈఓ డేవిడ్ రిచర్డ్సన్ తెలిపాడు. మరోవైపు సర్ఫరాజ్‌పై ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధిస్తుందని ఊహించలేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వర్గాలు తెలిపాయి. ఐతే ఈ సంఘటన సర్ఫరాజ్‌కు చెడ్డ పేరు తెచ్చినప్పటికీ, ఇది అతనికి ఓ జీవితకాల పాఠమని పాక్ మాజీ కెప్టెన్ మహమ్మద్ యూసుఫ్ అభిప్రాయపడ్డాడు.

కార్ల్‌సన్‌కే టైటిల్ ● ఆనంద్‌కు మూడో స్థానం

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీని మూడో స్థానంతో ముగించాడు. ఆదివారం చివరి రౌండ్లో ఆనంద్. . భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్‌తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దాంతో మొత్తం 13 రౌండ్ల నుంచి 7.5 పాయింట్లతో అతను ఐదో స్థానంలో నిలిచాడు. విదిత్ (7) నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) అగ్రస్థానంలో నిలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు. అనీశ్ గిరి (పోలెండ్)తో చివరి రౌండ్లో తలపడిన కార్ల్‌సన్ ఆ గేమ్‌ను డ్రాగా ముగించాడు. మొత్తం 9 పాయింట్లతో కార్ల్‌సన్ ముందు వరుసలో నిలిచాడు. అనీశ్ (8.5) రెండో స్థానంలో ఉన్నాడు.

తెదేపాకు బీసీలే అండ

- తెలంగాణలో 32 బీసీ కులాలను జాబితా నుంచి తొలగించిన తెరాసకు జగన్ వత్తాసు
- జయహో బీసీ సభలో ఏపీ సీఎం చంద్రబాబు
- రూ.3 వేల కోట్లతో బీసీలకు వరాలు



రాజమహేంద్రవరంలో నిర్వహించిన జయహో బీసీ సభ వేదికపై నుంచి విజయ సంకేతం చూపుతున్న చంద్రబాబు

రాజమహేంద్రవరం నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: మరో 75 రోజుల్లో ఎన్నికలు జరగనున్నందున రాష్ట్రంలోని ప్రతి బీసీ ఇంటిపైనా తెదేపా జెండా రెపరెపలాడాలని తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ జయహో బీసీ గర్జనను ఉద్ధృతం చేసి ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే బాధ్యతను బీసీలే తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం 'జయహో బీసీ' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీసీ కులాలకు రూ.మూడు వేల కోట్ల విలువ వరాలను ప్రకటించారు. ఎన్నికలెప్పుడు జరిగినా తెదేపాకు అండగా నిలిచింది బీసీలేనని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. బీసీల ఐకమత్యాన్ని దెబ్బతీసేలా కుట్రలకు పాల్పడుతున్న భాజపా, వైకాపాల ఉచ్చులో ఎవరూ పడొద్దని సూచించారు. 'ప్రతి ఒక్కరూ జయహో బీసీ నినాదంతో ముందుకెళ్లాలి. మనం సంఘటితంగా ఉంటే తిరుగే ఉండదు'అని వ్యాఖ్యానించారు.

అన్యాయంపై గట్టిగా ప్రశ్నించాలి..

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీ జాబితాలో ఉన్న 32 కులాలను రాష్ట్రాన్ని విభజించాక తెలంగాణలో తెరాస ప్రభుత్వం ఆ జాబితా నుంచి తొలగించేసింది. అలాంటి పార్టీకి జగన్ వత్తాసు పలుకుతున్నారు. ఫెడరల్ ఫ్రంట్ పెట్టే ముందు ఈ కులాలను తెలంగాణలో ఎందుకు ఓసీ జాబితాలో చేర్చారో వారు సమాధానం చెప్పాలి. రాష్ట్రం విడిపోయినంత మాత్రాన మనవాళ్లకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించాల్సిన బాధ్యత మనపై లేదా? ఇదే విషయం హైదరాబాద్‌లోని తెరాస ప్రభుత్వానికి వినిపించేలా మనం చెప్పాలి. లోటస్‌పాండ్‌లో ఉండే జగన్ ఉలిక్కిపడేలా వినిపించాలి. బీసీలకు అన్యాయం చేసిన వారితో జత కట్టడం మంచిది కాదని జగన్‌ను హెచ్చరించాలి. మనం కలిస్తే వారికి డిపాజిట్లు గల్లంతుకావాలి. మనకు అన్యాయంచేసిన పార్టీలను ఉపేక్షించొద్దు. జయహో బీసీ సభ బీసీల జాతకాలను తిరగరాయాలి. 150 కంటే ఎక్కువ శాసనసభ స్థానాలు, 25 ఎంపీ స్థానాలను గెలిపించాలి" అని చంద్రబాబు పేర్కొన్నారు.

బీసీలకు చంద్రబాబు హామీలివే..

బీసీలపై చంద్రబాబు హామీల జల్లు కురిపించారు. ఇందుకయ్యే రూ.3వేల కోట్ల మొత్తాన్ని వచ్చే బడ్జెట్‌లోనే కేటాయిస్తారు.

కొత్త కార్పొరేషన్లు: యాదవ, తూర్పుకాపు, చేనేత, మత్స్యకారులు, శెట్టి బలిజ-గౌడ-ఈడిగ-శ్రీశయన, కళింగ, కొప్పు వెలమ, కురుబ, గవర, చేనేత(పద్మశాలి), అగ్నికుల క్షత్రియ, గాండ్ల, వన్నెకుల క్షత్రియ కులాలకు కార్పొరేషన్ల ఏర్పాటు. అవసరాన్ని బట్టి మిగిలిన వారికి కూడా..

ఫెడరేషన్ల నుంచి కార్పొరేషన్లు: రజక, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, సగర/ఉప్పర, మేదర, కల్లుగీత, కృష్ణబలిజ/పూసల, వాల్మీకి/బోయ, భట్రాజ, శాలివాహన, విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్లు కార్పొరేషన్లుగా మార్పు.

రాజధానిలో ప్రత్యేక స్థానం: రూ.100 కోట్లతో అమరావతిలో పదెకరాల్లో మహాత్మా జ్యోతిబా పూలే స్మారక భవనం నిర్మాణం, పూలే విగ్రహం, స్మృతివనం ఏర్పాటు.

ఆర్థిక వరాలు

- బీసీ ఉప ప్రణాళికకు చట్టబద్ధత
- అత్యంత వెనకబడిన వర్గాల(ఎంబీసీలకు)కు 90 శాతం రాయితీతో స్వయం ఉపాధి రుణాలు. యూనిట్ విలువ ప్రస్తుతం ఉన్న రూ.30వేల నుంచి రూ.50వేలకు పెంపు. ఖర్చు ఏడాదికి రూ.60 కోట్లు.
- ఆలయాల్లో తలనీలాలు తీసేవారికి ఇప్పటి వరకు తలకు రూ.5 చొప్పున ఇస్తున్న మొత్తాన్ని రూ.25కు పెంపు.
- చేనేతలకు నూలు కోసం ఇచ్చే రూ.1000 నుంచి రూ.2 వేలుకు పెంపు.

ఉచిత విద్యుత్తు

- ఎంబీసీల గృహాలకు ప్రతి నెలా 100 యూనిట్లు.
- నాయీ బ్రాహ్మణుల సెలూన్లకు నెలకు 150 యూనిట్లు.
- చేనేత వృత్తి చేసే కార్మికులకు నెలకు 150 యూనిట్లు.
- స్వర్ణకారులకు నెలకు 100 యూనిట్లు.

ప్రత్యేక కేటాయింపులు

- స్వయం ఉపాధి పథకాలకు వయో పరిమితి 50 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంపు.
- పారిశ్రామికవాడల్లో 25 శాతం ప్లాట్లు ఏపీఐఐసీ ద్వారా బీసీలకు కేటాయింపు, అందులో 1/3వ వంతు మహిళలకే.
- ట్యాక్సీలు, క్యాబ్ తదితర రవాణా వాహనాలపై బీసీలకు 25 శాతం రాయితీ.
- గొర్రెలకు ఉచిత బీమా, ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు.

విద్యా వరాలు

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓ గురుకుల పాఠశాల, ఇప్పటికే ఉన్న 106 పాఠశాలలకు అదనంగా 69 ఏర్పాటు
- విదేశీవిద్య ఆర్థిక సాయం రూ.10లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంపు.

వాల్మీకి, బోయలు ఎస్టీల్లో, రజకులు ఎస్సీల్లో..

- వాల్మీకి, బోయలు, వడ్డెరలను ఎస్టీల జాబితాలో చేర్చడానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తాం. రజకులను ఎస్సీల్లో చేర్చడానికి ప్రయత్నిస్తాం.



గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం రాత్రి తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్యకు నన్నపనేని వెంకట్రావు విశిష్ట పురస్కారాన్ని ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాజకుమారి, ఏపీ మంత్రి నక్కా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు - న్యూస్‌టుడే, తెనాలి

ప్రత్యేక హోదాపై ఒకే గొంతుక వినిపిద్దాం

ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేద్దాం: పవన్‌కల్యాణ్



గుంటూరులో నిర్వహించిన జనసేన శంఖారావం సభలో నినదిస్తున్న పవన్‌కల్యాణ్. పక్కన నాదెండ్ల మనోహర్

ఈనాడు, గుంటూరు: 'ఏపీకి ప్రత్యేక హోదా కోసం రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ఏకమై ఒకే గొంతుకను వినిపిద్దాం. ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేద్దాం' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. హోదా సాధన కోసం చివరి అస్త్రంగా గట్టిగా ఉద్యమిద్దామని, దీనికి అన్ని రాజకీయ పక్షాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఎవరు ఎన్ని విధాలుగా పోరాడినా.. ప్రస్తుతం దిల్లీ వీధులు పిక్కటిల్లేలా, కేంద్రం దిగివచ్చేలా ఉద్యమిద్దామని ఆహ్వానించారు. 'దీన్ని రాజకీయ కోణంలో చూడవద్దు. ముఖ్యంగా యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక అన్యాయానికి గురవుతోంది' అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అండతో జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని.. కచ్చితంగా కేంద్ర రాష్ట్రాల్లోని చట్టసభల్లోకి దూసుకుపోతుందని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. గుంటూరులో ఆదివారం రాత్రి 'జనసేన శంఖారావం' సభలో పవన్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. అధికారం ఎప్పుడిస్తారో తెలియదని, ప్రజల కోసం జీవితాంతం కష్టపడతానని, ఓపిగ్గానే రాజకీయాలు చేస్తానని పేర్కొన్నారు.

కరచాలనం చేసినా తప్పే..

'చట్టసభల ప్రజాప్రతినిధులంటే నాకు గౌరవం. 'ఎట్‌హోం' వంటి కొన్ని సందర్భాల్లో వారు ఎదురుపడినప్పుడు గౌరవించేందుకు కరచాలనం చేసినా, హత్తుకున్నా నేను ఆ పార్టీతో కలుస్తున్నానంటూ ముద్ర వేస్తున్నారు. ఇది సరికాదు. మన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను మీరే ప్రచారం చేయాలి' అని కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో అమరావతిపై పార్టీ జెండా తప్పక ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. 'రాష్ట్రానికి హోదా కల్పనను ప్రధాని, కేంద్ర నాయకులు మరిచారు. జనసేన మరవలేదు. ఉత్తరాది నాయకులకు ఈ సభ నుంచి హెచ్చరిస్తున్నా. ఏదో ఒక రోజు కచ్చితంగా యూపీ నాలుగు ముక్కలవుతుంది. మా రాష్ట్రాన్ని విభజించే సమయంలో మీరు కాళ్లు ఊపుతారా? అసలు మీపెత్తనమేంటి?' అని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలపై దెబ్బపడితే తోలుతీస్తానని ఘాటుగా హెచ్చరించారు. తెనాలి శాసనసభ స్థానానికి నాదెండ్ల మనోహర్, గుంటూరు నుంచి తోట చంద్రశేఖర్‌లు పార్టీ అభ్యర్థులుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని పవన్‌కల్యాణ్ ప్రకటించారు.

అమరావతి పనులకు చంద్రబాబు దంపతుల ప్రశంస

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఏపీ రాజధాని అమరావతిలో వివిధ భవనాల నిర్మాణాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, సతీమణి భువనేశ్వరితో పాటు ఆమె సోదరి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పరిశీలించారు. ఉండవల్లిలోని నివాసం నుంచి బయలుదేరిన వారు నేరుగా సీడ్‌యాక్సెస్ రహదారిలో ప్రయాణిస్తూ సంబంధిత నిర్మాణాల పనులను తిలకించారు. రాయపూడి పరిధిలో నిర్మిస్తున్న ఏఐఎస్ అధికారుల భవనం సహా అఖిల భారత సర్వీసు అధికారుల నివాస సముదాయంలో సిద్ధం చేసిన నమూనా ఫ్లాట్, శాశ్వత సచివాలయం, ఇటీవల నిర్మించిన రాఫ్ట్ కాంక్రీటు ఫౌండేషన్ పనులనూ పరిశీలించారు. వచ్చే నెల మూడో తేదీన ప్రారంభించబోయే తాత్కాలిక హైకోర్టు భవనాన్ని, ఎన్జీవోల భవన సముదాయాలను కూడా వారు తిలకించారు. అఖిలభారత సర్వీసు అధికారుల భవనంలోని నమూనా ఫ్లాట్‌ను తిలకించిన సీఎం సతీమణి భువనేశ్వరి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచస్థాయిలో నిర్మిస్తున్న భవనాలకు దీటుగా ఇంటీరియర్ డెకరేషన్ ఉందని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు.



అమరావతి పరిధిలో రాఫ్ట్ ఫౌండేషన్ విధానంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు

ఓడిపోయాం.. పైసలిచ్చేయండి!



డబ్బు తిరిగివ్వాలంటూ ఓటర్లను అడుగుతున్న ప్రభాకర్ (నిల్చున్న వ్యక్తి)

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన తన భార్య ఓడిపోవడంతో, తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలంటూ భర్త ఓటర్లను అడుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో తొమ్మిదో వార్డుకు గ్రామానికి చెందిన ఉప్పు హైమావతి పోటీ చేశారు. వార్డులో మొత్తం 269 ఓట్లు ఉండగా.. ఆమెకు 24 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఓటుకు రూ.500-700 చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. డబ్బులిచ్చినా ఓటు వేయలేదని, వాటిని తిరిగివ్వాలని హైమావతి భర్త ఉప్పు ప్రభాకర్ ఇంటింటికీ తిరుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతోంది. అయితే ఎంత ప్రయత్నించినా ఎవరూ డబ్బు తిరిగి ఇవ్వకపోవడం గమనార్హం.

- న్యూస్‌టుడే, జాజిరెడ్డిగూడెం




ఐఐసీటీలో జరిగిన సదస్సులో బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, ఆర్.కె.త్యాగి, వి.కె.సారస్వత్, కిరణ్‌కుమార్, సతీష్‌రెడ్డి

భవిష్యత్తులో కృత్రిమ మేధకు ప్రాధాన్యం

నీతి ఆయోగ్ సభ్యుడు డి.కె.సారస్వత్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ప్రాధాన్యం క్రమక్రమంగా పెరుగుతోందని నీతి ఆయోగ్ సభ్యుడు డి.కె.సారస్వత్ అభిప్రాయపడ్డారు. కొత్తగా ఉద్భవిస్తున్న పరిశ్రమల సామర్థ్యం, ఉత్పత్తి, వేగం, ఆవిష్కరణలపై ఇది తీవ్ర ప్రభావం చూపనుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ఆదివారం 'మానవ రహిత వైమానిక వ్యవస్థ (అన్‌మ్యాన్‌డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్), సవాళ్లు' అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో పదిహేనేళ్లలో ఎయిరోస్పేస్ 4.0 సైతం కృత్రిమ మేధ లక్షణాలను అలవరుచుకోనుందని తెలిపారు. వ్యయం, సమయాన్ని తగ్గించుకుని అనుకూలతలను పెంచుకోనుందని వివరించారు. డీఆర్‌డీవో ఛైర్మన్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ మానవ రహిత వ్యవస్థల్లో, అనుసంబంధ సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పౌర, రక్షణ వ్యవస్థలో ఇవి ప్రధానమైన భూమికను పోషించనున్నాయని పేర్కొన్నారు. రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో త్వరలో డ్రోన్ ఒలింపిక్స్ పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సదస్సులో ఇస్రో మాజీ ఛైర్మన్ ఎ.ఎస్ కిరణ్‌కుమార్, ఏరోనాటికల్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.కె త్యాగి, అగ్ని ప్రోగ్రాం డైరెక్టర్ వెంకటేశ్వరరావు, 500 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రెండోసారి రాయాలా? వద్దా?



జేఈఈ మెయిన్‌లో కటాఫ్ పర్సంటైల్ తెలియక విద్యార్థుల అయోమయం

ఏప్రిల్‌లో రెండో విడత మెయిన్ పరీక్షలు

95 పర్సంటైల్ దాటితేనే రెండోసారి ప్రయత్నించాలంటున్న నిపుణులు

ఆలోపు ఉంటే ఎంసెట్ వైపు చూడాలని సూచన

రెండోసారి జేఈఈ మెయిన్ రాయాలా? వద్దా? ఆ పరీక్షకు హాజరుకాకుండానే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధం కావాలంటే కనీస పర్సంటైల్ ఎంత ఉండాలి? ఇటీవల జేఈఈ మెయిన్ పేపర్-1 పర్సంటైల్ వెల్లడైన నేపథ్యంలో వేల మంది విద్యార్థులను వేధిస్తున్న ప్రశ్నలివి. పర్సంటైల్ ఎంత ఉన్నవారు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తారన్న దానిపై జేఈఈ శిక్షణ నిపుణుల్లోనూ భిన్న అంచనాలున్నాయి. మొత్తం 360 మార్కులకు 80 మార్కులు దాటితే జనరల్ కేటగిరీలో అడ్వాన్స్‌డ్ పరీక్షకు అవకాశం ఉంటుందని, 100 మార్కులొస్తే సందేహం లేదని నిపుణులు చెబుతున్నారు. పరీక్షకు అర్హత సాధించినంత మాత్రాన ఐఐటీల్లో లేదా జేఈఈ మెయిన్ మార్కులతో ఎన్ఐటీల్లో సీటు తప్పనిసరిగా వస్తుందని భావించకూడదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జేఈఈ మెయిన్‌ను ఈసారి రెండుదశల్లో నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తొలి విడత మెయిన్ పేపర్-1 పరీక్ష పూర్తికాగా పర్సంటైల్ స్కోర్‌ను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) వెల్లడించింది. రెండో దఫా పరీక్షను ఏప్రిల్ 6-20 తేదీల మధ్య జరపనున్నారు. రెండు పరీక్షల్లో ఏది ఉత్తమ పర్సంటైల్ అయితే దాన్ని పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయిస్తారు. ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత మార్కులు లేదా పర్సంటైల్ ప్రకటిస్తారు. ఆయా సామాజిక కేటగిరీల వారీగా మొత్తం 2.31 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు. గతంలో ఏప్రిల్‌లో జేఈఈ మెయిన్ నిర్వహించి ర్యాంకులు ప్రకటించినప్పుడే ఎన్ని మార్కులొస్తే అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హులో ప్రకటించేవారు. ఈసారి జేఈఈ మెయిన్‌ను రెండుసార్లు జరుపుతున్నందున మొదటి పరీక్ష పర్సంటైల్ వెల్లడైనా అర్హత పర్సంటైల్‌పై అయోమయం నెలకొంది.

నిపుణులు ఏమంటున్నారు?

తాజాగా వెల్లడైన జేఈఈ మెయిన్‌లో 98 పర్సంటైల్, ఆపైన వచ్చినవారు (జనరల్ కేటగిరీ) ఏప్రిల్‌లో రెండోసారి మెయిన్ రాయక్కర్లేదంటున్నారు నిపుణులు. '98 పర్సంటైల్ దాటినవారు నేరుగా మే 19న జరిగే అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధం కావచ్చు. 95-98 మధ్య పర్సంటైల్ వచ్చిన వారు మాత్రం ఏప్రిల్ మెయిన్ పరీక్షపై దృష్టి పెడితే ఎన్ఐటీల్లో సీటు దక్కించుకోవచ్చు' అని జేఈఈ శిక్షణ నిపుణుడు కృష్ణచైతన్య అభిప్రాయపడ్డారు. 95 పర్సంటైల్‌లోపు వచ్చినవారు ఎంసెట్, ఇతర డీమ్డ్ వర్సిటీల పరీక్షలకు సిద్ధమైతే మంచిదన్నారు.

■ 'మొదటి పరీక్షలో 90 పర్సంటైల్ దాటినవారు కూడా ఏప్రిల్ జేఈఈ మెయిన్‌కు, మేలో జరిగే అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధం కావొచ్చు' అని మరో నిపుణుడు ఉమా శంకర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన మెయిన్ 8 పరీక్షల్లోనూ దాదాపు ఒకే రకమైన కాన్సెప్ట్‌లతో కూడిన ప్రశ్నలు ఇచ్చారు. ఏప్రిల్‌లోనూ మొదటి రోజు ఉదయం ప్రశ్నపత్రం ఎలా ఉంటుందో ఆ తర్వాత జరిగే ప్రశ్నలు కూడా అదే తరహాలో ఉండొచ్చన్నారు.

■ 'అడ్వాన్స్‌డ్‌కు 1.17 లక్షల మంది వరకు జనరల్ కేటగిరీ వారు అర్హత సాధిస్తారు. ఆ ప్రకారం 90 పర్సంటైల్ వచ్చినా అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత పొందే అవకాశాలున్నాయి' అని మరో నిపుణుడు వెంకట రమణాచారి చెబుతున్నారు. అర్హత పొందినంత మాత్రాన సీట్లు రావన్నారు.

ర్యాంకు ఎలా కేటాయిస్తారంటే?

ఇప్పటివరకు జేఈఈ మార్కుల ప్రకారం ర్యాంకులు ఇచ్చేవారు. సమానంగా మార్కులు వస్తే గణితంలో ఎక్కువ మార్కులు సాధించినవారికి ర్యాంకులో ప్రాధాన్యం ఉంటుంది. ఆ మార్కులు కూడా సమానంగా వస్తే తర్వాత భౌతికశాస్త్రం, ఆ తర్వాత రసాయనశాస్త్రం మార్కులను చూస్తారు. ఆ మూడు సబ్జెక్టుల్లో సమానంగా ఉంటే ఎక్కువ వయసున్న అభ్యర్థికి ర్యాంకులో ప్రాధాన్యమిస్తారు. ఈసారి పర్సంటైల్ విధానం అమలు చేస్తున్నారు. అంతేకాకుండా ఏడు దశాంశాల వరకు మార్కులు ఇస్తున్నారు (ఉదాహరణకు 95 మార్కులు కాకుండా 95.01242763). మార్కులు సమానంగా రాకుండా ఇలా చేస్తున్నారు.

అడ్వాన్స్‌డ్ పరీక్షకు జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు

సంవత్సరం	జనరల్	ఓబీసీ	ఎస్సీ	ఎస్టీ
2014	115	74	53	47
2015	105	70	50	44
2016	100	70	52	48
2017	81	49	32	27
2018	74	45	29	24

– ఈనాడు, హైదరాబాద్

ఎకోకార్డియోగ్రఫీతో అద్భుతాలు

- **గుండె రక్తనాళాల్లో పూడికలు గుర్తింపు**
- **అంతర్జాతీయ గుండె పరిశోధక పుస్తకంలో ప్రత్యేక అధ్యాయం**
- **తెలుగు వైద్యుడు డా.ఆంజనేయులుకు అరుదైన గౌరవం**

ఈనాడు, హైదరాబాద్: గుండెపోటుకు మూలం గుండెలోని రక్తనాళాల్లో పూడికలు రావడం. అందుకే పూడికలు ఉన్నాయని అనుమానం వస్తే ఎంత శాతం ఏర్పడ్డాయనేది తెలుసుకోవడానికి యాంజియోగ్రామ్ చేస్తారు. స్టెంట్ చికిత్స అనంతరం గుండె రక్తనాళంలో రక్తప్రవాహ తీరును గుర్తించడానికీ యాంజియోగ్రామే శరణ్యం. ఈ పరీక్షలకు భిన్నంగా కేవలం 'ఎకోకార్డియోగ్రఫీ'తోనే అద్భుతాలు సృష్టించారు తెలుగు వైద్యుడు, ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ ఎ.వి.ఆంజనేయులు. రోగికి ఎలాంటి అసౌకర్యం లేకుండా నిర్వహించే '2డీ ఎకో' పరీక్ష ద్వారానే గుండె రక్తనాళాల్లో పూడికలున్నాయని నిర్ధారించారు. 15 ఏళ్లుగా ఈ అంశంపై ఆయన పరిశోధన కొనసాగిస్తున్నారు. డాక్టర్ ఆంజనేయులు 2డీ ఎకో ద్వారా గుండె వైద్యంపై చేసిన పరిశోధనాంశాలు 2008లోనే అమెరికన్ మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అంశాలన్నింటినీ ఒకే చోట కూర్చి ఒక అధ్యాయంగా వైద్యపుస్తకంలో రాసే అవకాశం ఈయనకు దక్కింది. గతేడాది డిసెంబరులో గుండె వైద్యంపై 'అడ్వాన్సెస్ ఇన్ క్లినికల్ కార్డియోవ్యాస్క్యులర్ ఇమేజింగ్ ఎకోకార్డియోగ్రఫీ అండ్ ఇంటర్వెన్షన్స్' పేరిట అమెరికాలో తీసుకొచ్చిన పుస్తకం తొలి ఎడిషన్‌లో డాక్టర్ ఆంజనేయులుకు స్థానం కల్పించారు. ఎకోకార్డియోగ్రఫీలో ఈయన సాధించిన విజయవంతమైన పరిశోధనలతో కూడిన ప్రత్యేక అధ్యాయాన్ని 'కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఎవాల్యుయేషన్ బై కరోనరీ డాప్లర్ ఇమేజింగ్' అనే శీర్షికన ప్రచురించారు. అమెరికాలో ముద్రించిన ఒక వైద్యపుస్తకంలో ఒక తెలుగు వైద్యుడు ప్రత్యేక అధ్యాయాన్ని రాయడం అరుదైన విషయంగా వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇందులో ముఖ్యాంశాలివీ..



డా.ఏవీ ఆంజనేయులు

- ★ గుండె ప్రధాన రక్తనాళాల్లో 70-100 శాతం పూడికలున్నప్పుడు గుర్తించారు.
- ★ గుండెపోటు రోగికి స్టెంట్ చికిత్సానంతరం గుండె రక్తనాళాల్లో రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుందా? లేదా? అనేది తెలుసుకున్నారు.
- ★ గుండెలోని మూడు ప్రధాన రక్తనాళాల్లో ఒకదాంట్లో పూర్తిగా పూడిక ఏర్పడినా ఎకో ద్వారా గుర్తించగలిగారు.
- ★ శిశువుల్లో పుట్టుకతో వచ్చే గుండె రక్తనాళాల్లో వేర్వేరు లోపాలనూ ఈ పరీక్ష ద్వారా నిర్ధారించారు.

సరస్వతీ విద్యాపీఠానికి రూ.50 లక్షల విరాళం

ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి దాతృత్వం



సుధాకర్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న సీబీఆర్ ప్రసాద్ (కుడివైపు వ్యక్తి)

నార్సింగి, న్యూస్‌టుడే: సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిశుమందిరాల్లో వసతుల కల్పనకు హైదరాబాద్‌కు చెందిన ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి, సామాజికవేత్త సీబీఆర్ ప్రసాద్ రూ.50 లక్షల విరాళం ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్ శివారు బండ్లగూడ శారదాధామం సరస్వతీ శిశుమందిరంలో జరిగిన పూర్వవిద్యార్థుల కార్యశాలలో విద్యాభారతి దక్షిణ, మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డికి చెక్కును అందజేశారు. స్వామి శివానంద సరస్వతి, సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.